RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 | సంచిక : 198 | గురువారం 13 - 02 - 2025 | ఎడిటర్ : బొమ్మరబోయున వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు : 08 | వెల : 2 రూ/-

## మరో ఘటన.. అమెరికాలో రెండు విమానాలు ఢీ



అమెరికాలో వరుస విమాన ప్రమాదాలు కలకలం రేపుతున్నాయి.
మరోసారి రెండు విమానాలు ఢీకొన్నాయి.

ఆరిజోనా: అమెరికాలో వరుస విమాన ప్రమాదాలు కలకలం రేపుతున్నాయి. మరోసారి రెండు విమానాలు ఢీకొన్నాయి. ఎయిర్‌పోర్ట్‌లో ప్రైవేట్ జెట్‌ను మరో విమానం ఢీకొట్టింది. ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. లియర్‌జెట్ 35ఎ విమానం ల్యాండింగ్ తర్వాత రన్‌వే నుండి మిగతా 2లో

## ఎల్‌వోసీలో భారీ పేలుడు.. ఇద్దరు జవాన్లు దుర్మరణం

జమ్ముకశ్మీర్‌లోని ఎల్‌వోసీ వద్ద భారీ పేలుడు సంభవించింది.
మంగళవారం మధ్యాహ్నం ఐఈడీ పేలి ఇద్దరు జవాన్లు అక్కడికక్కడే దుర్మరణంచెందారు.



జమ్ముకశ్మీర్‌లోని ఎల్‌వోసీ వద్ద భారీ పేలుడు సంభవించింది. మంగళవారం మధ్యాహ్నం ఐఈడీ పేలి ఇద్దరు జవాన్లు అక్కడికక్కడే దుర్మరణంచెందారు.మరో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం మిగతా 2లో

## పార్టీ శ్రేణులతో వీడియో కాన్ఫరెన్స్

కరీంనగర్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకమైనవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.
బంజారాహిల్స్ లోని ఆయన నివాసంలో పార్టీ శ్రేణులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.
క్షేత్ర స్థాయిలో కేడర్ను, లీడరను అప్రమత్తం చేసి కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి విజయానికి రూట్ మ్యాప్ రూపొందించుకోవాలని నేతలకు పిలుపునిచ్చారు.



కరీంనగర్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రతిష్టాత్మకమైనవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.మంగళవారం బంజారాహిల్స్ లోని ఆయన నివాసంలో పార్టీ శ్రేణులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్సీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో కేడర్ను, లీడరను అప్రమత్తం చేసి కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి విజయానికి రూట్ మ్యాప్ రూపొందించుకోవాలని నేతలకు పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎన్నికల్లో అనుసరించాల్సిన మిగతా 2లో

## మా పోరాటం ఆగదు..

### రేవంత్ ప్రభుత్వానికి హరీష్‌రావు మాస్ వార్నింగ్

రైతుల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు.

రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు.

రైతుల కోసం తాము నిరంతర పోరాటం కొనసాగిస్తామని, రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.



సిద్దిపేట: రైతుల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మిగతా 2లో

## రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుంది




- తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు.
- నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం లోకి వచ్చాక దాటవేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. మిగతా 2లో

## శ్రీవారి లడ్డూలో కాదు..

### చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాటల్లోనే ఉంది కల్తీ




వ్యవహారంలో సిట్ జరిపిన అరెస్టులకు సంబంధించి రిమాండ్ రిపోర్టుల్లో ఎక్కడా లడ్డూలో కల్తీ నెయ్యి వాడినట్టు పేర్కొనలేదని టీటీడీ మాజీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సహా ఎల్లో మీడియా.. నిర్ధారించినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

తిరుపతి: తిరుమల శ్రీవారి లడ్డూ వ్యవహారంలో సిట్ జరిపిన అరెస్టులకు సంబంధించి రిమాండ్ రిపోర్టుల్లో ఎక్కడా లడ్డూలో కల్తీ నెయ్యి వాడినట్టు పేర్కొనలేదని టీటీడీ మాజీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. అయినా టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు సహా

## ఒక్క క్షణం కూడా కరెంట్ పోకూడదు

### అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

రానున్న వేసవిలో డిమాండ్ మేరకు విద్యుత్తును అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు.

మంగళవారం ఆయన సచివాలయంలో ఎస్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ అధికారులతో వేసవిలో విద్యుత్ సరఫరా ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

గత వేసవిలో వచ్చిన విద్యుత్ డిమాండ్, రానున్న వేసవిలో ఏ మేరకు విద్యుత్తు డిమాండ్ ఉంటుంది. అందుకు తగిన విధంగా అధికారులు చేసుకున్న ప్రణాళికల వివరాలను డిప్యూటీ సీఎం సమీక్షించారు.

క్షేత్రస్థాయిలో అవసరాల మేరకు అధికారులు కోరిన అన్ని వసతులు కల్పించిన నేపథ్యంలో రానున్న వేసవిలో క్షణం కూడా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు.

విద్యుత్ సరఫరా అనేది సున్నితమైన అంశం, నిత్యవసరం కూడా ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని నిరంతరం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి అన్నారు.



వేసవి ప్రణాళికపై అన్ని స్థాయిల్లో అధికారులు వెనువెంటనే సమావేశం నిర్వహించుకుని క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ఏ రీతిలో సన్నద్ధంగా ఉన్నారు, వినియోగదారులకు సైతం అవగాహన కల్పించాలి అన్నారు.

రానున్న వేసవిలో డిమాండ్ మేరకు విద్యుత్తును అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన సచివాలయంలో ఎస్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ అధికారులతో వేసవిలో విద్యుత్ సరఫరా ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గత వేసవిలో వచ్చిన విద్యుత్ డిమాండ్, మిగతా 2లో

## ఏపీలో ఢిల్లీ లిక్కర్ స్కామ్ కంటే 10 రెట్ల పెద్ద స్కాం జరిగింది



- ఢిల్లీ లిక్కర్ స్కాంతో పోల్చితే ఏపీ లిక్కర్ స్కాం 10 రెట్లు పెద్దది
- లోక్ సభలో జీరో అవర్
- ఏపీ లిక్కర్ స్కాం అంశాన్ని ప్రస్తావించిన ఎంపీ సీఎం రమేశ్
- 2019-24 మధ్య కాలంలో లిక్కర్ పాలసీ మార్చారని ఆరోపణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఢిల్లీ లిక్కర్ స్కామ్ కంటే 10 రెట్లు ఎక్కువ పెద్ద స్కాం జరిగిందని బీజేపీ ఎంపీ సీఎమ్ రమేశ్ మిగతా 2లో

## మంత్రి పయ్యావుల ప్రీ-బడ్జెటరీ సమావేశాలు



- ఆంధ్రప్రదేశ్ 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూపకల్పనపై కసరత్తు ముమ్మరంగా జరుగుతోంది. వివిధ శాఖలకు చెందిన మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు.
- మంగళవారం ఇరిగేషన్, ఎక్సైజ్, మైనింగ్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు చెందిన మంత్రులు.. ఆయా శాఖల కార్యదర్శులతో మంత్రి పయ్యావుల ప్రీ-బడ్జెటరీ సమావేశాలు నిర్వహించనున్నారు.

అమరావతి: ఆంధ్రప్రదేశ్ 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూపకల్పనపై కసరత్తు ముమ్మరంగా జరుగుతోంది. మిగతా 2లో

## చంద్రబాబు మోసాలను ప్రజల్లో మరింత ఎండగట్టాలి

### చంద్రబాబు మోసాలను ప్రజల్లో మరింత ఎండగట్టాలి

గ్రామ స్వరాజ్య స్థాపనకు చర్యలెన్నో తీసుకున్నాం: వైఎస్ జగన్

పార్టీ సీనియర్ నేతలతో సమావేశంలో వైఎస్ జగన్

ఏపీ సీఎం వైఎస్ జగన్ పార్టీ సీనియర్ నేతలతో సమావేశమయ్యారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నేతల సమావేశంలో కూటమి ప్రభుత్వ విధానాలు...రానున్న అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.

కూటమి ఎన్నికల హామీల అమలు వైఫల్యాలపై అసెంబ్లీలో, ప్రజాక్షేత్రంలో పోరాటాల నిర్వహణ, పార్టీ సంస్థాగత బలపేతం, వైసీపీ పాలనపై కూటమి చేస్తున్న విమర్శలను తిప్పికొట్టడం వంటి అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ పంచాయితీరాజ్ విభాగం డైరీ 2025ను జగన్ ఆవిష్కరించారు



తాడేపల్లి : ఏపీ సీఎం వైఎస్ జగన్ పార్టీ సీనియర్ నేతలతో సమావేశ మయ్యారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నేతల సమావేశంలో కూటమి ప్రభుత్వ విధానాలు...రానున్న అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాల పై చర్చించారు.కూటమి ఎన్నికల హామీల అమలు వైఫల్యాలపై అసెంబ్లీలో, ప్రజాక్షేత్రంలో పోరాటాల నిర్వహణ, పార్టీ సంస్థాగత బలపేతం, వైసీపీ పాలనపై కూటమి చేస్తున్న విమర్శలను మిగతా 2లో

## సుప్రీంకోర్టు వ్యాఖ్యలు వైసీపీకి చెంపపెట్టు

- ఏపీని దోచేసి అప్పుల కుప్పగా మార్చారు
- క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తులు పార్టీలను ఎలా నడుపుతారని సుప్రీంకోర్టు ప్రశ్న
- వైసీపీని జగన్ హత్యా రాజకీయాల పునాదులపై నిర్మించారన్న ప్రత్తిపాటి
- హత్యలు చేసి దర్జాగా పాలన సాగించారని మండిపాటు



నేరమయ రాజకీయాలపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. క్రిమినల్ కేసులు ఉంటే ఉద్యోగాలకే అర్హత ఉండదని... అలాంటప్పుడు క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తులు పార్టీలను ఎలా నడుపుతారని, ప్రజా ప్రతినిధులుగా ఎలా ఉంటారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో చిలకలూరిపేట మిగతా 2లో

## మరో ఘటన.. అమెరికాలో రెండు విమానాలు ఢీ



జారి రాంప్‌పై ఉన్న బిజినెస్ జెట్‌ను ఢీకొట్టింది. ఆరిజోనాలోని స్కాట్‌డేల్ ఎయిర్‌పోర్టులో ఘటన జరిగింది. దీంతో ఎయిర్‌పోర్టులో విమానాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ఘటన మధ్యాహ్నం 2:45 గంటల సమయంలో జరిగినట్లు సమాచారం. కాగా, గత పది రోజుల్లో అమెరికాలో ఇది నాలుగో విమాన ప్రమాదం. పశ్చిమ అలాస్కాలోని నోమ్ కమ్యూనిటీకి వెళ్తున్న విమానం సముద్రంలో కూలిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పైలట్‌తో సహా పది మంది ప్రాణాలు కోల్పోయారు.కాగా, మరో విమానానికి కూడా తృటిలో ప్రమాదం తప్పింది. రన్‌వేపై టేకాఫ్ అవుతుండగా విమానంలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ప్రయాణీకులు ఎవరికీ గాయాలు కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇక, ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.గత వారం.. ఫిలడెల్ఫియా రాష్ట్రంలో విమానం ఇళ్లపై కూలిపోయింది. దీంతో, ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఆరుగురు మరణించారు. ఫిలడెల్ఫియాలోని షాపింగ్‌మాల్ సమీపంలో విమానం టేకాఫ్ అయిన కాసేపటికే ఇళ్లపై కూలిపోయింది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఇళ్లు, కార్లు దగ్ధమయ్యాయి. విమానం కూలిపోయిన వెంటనే భారీ పేలుడు సంభవించడంతో మంటలు ఎగిసిపడ్డాయి.

## ఒక్క క్షణం కూడా కరెంట్ పోకూడదు



రానున్న వేసవిలో ఏ మేరకు విద్యుత్తు డిమాండ్ ఉంటుంది.. అందుకు తగిన విధంగా అధికారులు చేసుకున్న ప్రణాళికల వివరాలను డిప్యూటీ సీఎం సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అవసరాల మేరకు అధికారులు కోరిన అన్ని వసతులు కల్పించిన నేపథ్యంలో రానున్న వేసవిలో క్షణం కూడా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా అనేది సున్నితమైన అంశం, నిత్యవసరం కూడా ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని నిరంతరం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి అన్నారు.వేసవి ప్రణాళికపై అన్ని స్థాయిల్లో అధికారులు వెనువెంటనే సమావేశం నిర్వహించుకుని క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ఏ రీతిలో సన్నద్ధంగా ఉన్నారు, వినియోగదారులకు సైతం అవగాహన కల్పించాలి అన్నారు. విద్యుత్ శాఖలో లైన్మెన్ మొదలు విద్యుత్ శాఖ మంత్రి వరకు ఒక కుటుంబంలో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఏ సమస్య వచ్చినా వెంటనే పై అధికారికి ఫోన్ చేయాలని వారు స్పందించని పక్షంలో ఆపై అధికారికి అలా నాకు కూడా ఫోన్ చేయవచ్చని సిబ్బందికి డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. మీకు క్షేత్రస్థాయిలో కావలసిన వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం, ఏదైనా అడగవచ్చని అధికారులకు డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఎమర్జెన్సీ వాహనాల ద్వారా కొనసాగుతున్న విద్యుత్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు కోరిన అన్ని అనుమతులు ఇచ్చాం, మార్చి మొదటి తేదీ నాటికి సబ్ స్టేషన్ల నిర్మాణం ఇతర పనులు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. గత మూడు సంవత్సరాలుగా సబ్ స్టేషన్ లపై పెరుగుతున్న లోడ్ భారం వివరాలను డిప్యూటీ సీఎం సమీక్షించారు.బాగా పని చేసే వారికి ప్రోత్సాహకంగా అవార్డులు సైతం ఇచ్చే కార్యక్రమాన్ని విద్యుత్ శాఖలో ప్రారంభించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. మొన్నటి భారీ వరదల సమయంలో అర్ధరాత్రి కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారని అటువంటివారిని గుర్తించాలని డిప్యూటీ సీఎం అన్నారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించాలని డిప్యూటీ సీఎం కోరారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, ప్రత్యామ్నాయ విద్యుత్తు ఉత్పత్తి ఈ రంగంలో ప్రపంచంలో వస్తున్న మార్పులపై సిబ్బందికి అవగాహన అవసరమని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు.విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన దయల్ 1912 కు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఇలాంటి సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రతి వినియోగదారునికి తెలిసేలా వారి మొబైల్ నెంబర్ కు 1912 ఎస్ఎంఎస్ చేయాలని, కరెంటు బిల్లు పైన సైతం 1912 సేవల గురించి ప్రచురించాలని ఆదేశించారు. ఈ విభాగాన్ని పటిష్టం చేసేందుకు సిబ్బంది సంఖ్య పెంచడం, సాంకేతికంగా అదనపు హంగులు కల్పించేందుకు అవసరమైన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. స్టోర్స్ లో అందుబాటులో ఉన్న సామాగ్రి, రాబోయే రోజుల్లో డిమాండ్కు తగిన విధంగా చేసుకుంటున్న ఏర్పాట్లపై వివిధ విభాగాల్లో ఉన్న సీఈలతో ప్రత్యేకంగా డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. గత ఏడాదికి వస్తున్న సమస్యల్లో తేడాలు, ఫిర్యాదులు తగ్గడానికి చేపట్టిన చర్యలను అధికారుల ద్వారా డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ అలీ, ఇంధన శాఖ ఓఎస్డి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మా పోరాటం ఆగదు..



విమర్శించారు. రైతుల కోసం తాము నిరంతర పోరాటం కొనసాగిస్తామని, రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం సలేంద్రి గ్రామంలో రంగనాయక సాగర్ కాలువను పరిశీలించారు. కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను చూసి సంతోషించారు. రైతులకు సాగునీరు అందడంపై హర్షం వ్యక్తం చేస్తూ, కాలువ పక్కన ఆగి సెల్ఫీ దిగారు.అనంతరం స్థానిక రైతులతో ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెట్టుపల్లి గ్రామంలోని పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్) తోటలను సందర్శించి, అక్కడి రైతులతో ముఖాముఖిలో చర్చించారు. రైతులు మార్కెటింగ్ సమస్యలను, పంటకు సరైన ధర లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించగా, తక్షణమే ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. సన్‌ఫ్లవర్ పంటకు తగిన మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హరీష్ రావు స్పష్టం చేశారు.ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు గిట్టుబాటు ధర అందించాలని అన్నారు. రైతుల అవగాహన కోసం పంట వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి, మార్కెట్ పరిస్థితుల గురించి ముందస్తు సమాచారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సాగునీరు అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించడం వల్లే ఇప్పుడు పంట పొలాలకు గోదావరి జలాలు అందుతున్నాయని చెప్పారు. నిత్యం నీటి కొరతతో తిప్పలు పడే ఈ ప్రాంతాలు సాగునీటి సౌకర్యంతో పచ్చగా మారాయని, ఇది కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమైందని హరీష్‌రావు గుర్తు చేశారు.

## ఏపీలో ఢిల్లీ లిక్కర్ స్కామ్ కంటే 10 రెట్ల పెద్ద స్కాం జరిగింది

పార్లమెంట్ లో అన్నారు.లోక్ సభలో మంగళవారం జీరో అవర్ సందర్భంగా.. ఎంపీ రమేష్.. ఏపీ లిక్కర్ పాలసీ అంశాన్ని లేవనెత్తారు. 2019-2024 మధ్యకాలంలో ఏపీ లిక్కర్ పాలసీ మార్చారని గుర్తు చేశారు.వైసీపీ హయాం లో మద్యం అమ్మకాలు కేవలం నగదు రూపంలోనే జరిగాయని, ఒక్కటి కూడా డిజిటల్ లావాదేవీలు జరగలేదని ఆయన తెలిపారు. లోక సభ లో ఎంపీ రమేష్ మాట్లాడుతుండగా.. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి మధ్యలో జోక్యం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీఎమ్ రమేష్ బీజేపీ కోసం పనిచేయడం లేదు టీడీఎకి పనిచేస్తున్నాడని విమర్శించారు. సీఎం రమేష్ నిరాధార ఆరోపణలు చేస్తున్నాడని చంద్రబాబు నుంచి కాంట్రాక్టులు పొందడానికే.. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నాడని అన్నారు. అలాగే మార్గదర్శి స్కామ్ చాలా పెద్ద కుంభకోణమని ఈ సందర్భంగా ఎంపీ మిథున్ రెడ్డి చెప్పుకొచ్చారు. మొత్తానికి ఈ వ్యవహారంతో ఏపీ లిక్కర్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది.బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ ఇవాళ లోక్ సభ జీరో అవర్ లో కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీలో భారీ లిక్కర్ స్కాం జరిగిందని అన్నారు. రూ.2,500 కోట్ల ఢిల్లీ లిక్కర్ స్కాంతో పోల్చితే ఏపీ లిక్కర్ స్కాం 10 రెట్లు పెద్దది అని వెల్లడించారు. 2019-2024 మధ్య కాలంలో మద్యం విధానాన్ని మార్చారని ఆరోపించారు. ప్రైవేటు దుకాణాలను మద్యం అమ్మకాల బాధ్యతల నుంచి తప్పించి, ఆ బాధ్యతను ప్రభుత్వ దుకాణాలకు అప్పగించారని సీఎం రమేశ్ వివరించారు. ఐదేళ్లలో రూ. లక్ష కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయని తెలిపారు. మొత్తం లావాదేవీలు పూర్తిగా నగదు రూపంలోనే జరిగాయని, ఒక్కటి కూడా డిజిటల్ ట్రాన్సాక్షన్ జరపలేదని అన్నారు. ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించుకున్నారని తెలిపారు.

## రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను
## కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుంది

నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం లోకి వచ్చాక దాటవేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అలాగే పే స్కేల్, పీఆర్సీ వంటి అంశాల్లో ప్రభుత్వ ఉద్యోగులను సైతం మోసం చేస్తున్నారని గుర్తు చేశారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులను కూడా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని.. పదవీ విరమణ పొందిన వెంటనే ఇవ్వాల్సిన డబ్బులు నెలలు గడుస్తున్నా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు గా ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వం పై ఎన్నో ఆరోపణలు చేశారని.. ఇప్పుడు వారు ప్రభుత్వంలోకి వచ్చాక వాటిపై చర్యలు మాత్రం శూన్యం అన్ని ఎద్దేవ చేశారు.దాని బట్టి చూస్తే.. కాంగ్రెస్ ఒకటేనని అర్థమౌతుందని, కాంగ్రెస్ ప్రభుత్వ కుంభకోణాలు ఎప్పటికప్పుడు వెలికితీసి ప్రజల ముందుకు తెస్తూ ప్రధాన ప్రతిపక్ష పాత్ర? పోషిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లతో బుద్ధి చెప్పాలని, పట్టా బద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించి, బీజేపీ ప్రజా గొంతుకకు బలం చేకూర్చాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, బీజేపీ నాయకులు సత్యనారాయణ గౌడ్, అయ్యన్న గారి భూమయ్య, మెడిసెమ్మ రాజు, సామ రాజేశ్వర్ రెడ్డి, అయ్యన్న గారి రాజేందర్, తో పాటు పట్టణ, మండలాల అధ్యక్షులు బీజేపీ నాయకులు కార్యకర్తలు పట్ట భద్రులు తదితరులు పాల్గొన్నారు

## మంత్రి పయ్యావుల ప్రీ-బడ్జెటరీ సమావేశాలు

వివిధ శాఖలకు చెందిన మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఇరిగేషన్, ఎక్సైజ్, మైనింగ్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు చెందిన మంత్రులు.. ఆయా శాఖల కార్యదర్శులతో మంత్రి పయ్యావుల ప్రీ-బడ్జెటరీ సమావేశాలు నిర్వహించనున్నారు. తమ శాఖలకు కావాల్సిన నిధులను.. ప్రవేశపెట్టేబోయే పథకాలను సమీక్షల్లో మంత్రి పయ్యావులకు ఆయా శాఖల మంత్రులు వివరించారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులను కేటాయించాల్సిందిగా ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు.. పయ్యావులను కోరారు. ప్రాధాన్యతల వారీగా ప్రాజెక్టులకు నిధుల విడుదల చేసే దిశగా ఆలోచన చేస్తామని మంత్రి చెప్పారు. ప్రాధాన్యతల వారీగా ఏయే ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలోననే అంశంపై జాబితా ఇవ్వాలని నిమ్మలను కోరారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణ, గేట్ల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవడానికి అవసరమైన బడ్జెట్ ఇవ్వాలని మంత్రి నిమ్మల ప్రతిపాదించారు. అలాగే వివిధ సంక్షేమ శాఖల్లో అమలు చేయాల్సిన పథకాలు వాటికి అవసరమైన బడ్జెట్ కేటాయింపులపై ఆయా శాఖల మంత్రులు సవిత, డోలా బాల వీరాంజనేయ స్వామి, గుమ్మడి సంధ్యారాణి, ఎన్ఎండీ ఫరూక్ ప్రతిపాదనలు ఇచ్చారు.కాగా మైనింగ్ శాఖకు అవసరమైన నిధులను కేటాయించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు మంత్రి పయ్యావులను కోరారు. మైనింగ్ శాఖ నుంచి ఆదాయాన్ని కూడా అదే స్థాయిలో తీసుకురావాలని అధికారులకు మంత్రి సూచించారు. గనుల శాఖ నుంచి వీలైనంత నిధులు వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి గుర్తు చేశారు. అనవసరపు ఖర్చులు తగ్గించుకుని.. ప్రాధాన్యతల వారీగా బడ్జెట్ ప్రతిపాదనలు పెట్టాలని మంత్రి సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ ప్రతిపాదనలు పెట్టాలని కోరారు. కేంద్ర పథకాలతో లింక్ అయ్యేలా పథకాలు.. వాటికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలపై ఎక్కువగా ఫోకస్ పెట్టాలని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.కాగా మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం వెలగపూడి సచివాలయంలో జల వనరుల శాఖపై నిర్వహించిన భేటీకి ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్సీ ఎం.వెంకటేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. నీటి ప్రాజెక్టులకు రూ.32 వేల కోట్లు కేటాయించాలని జల వనరుల శాఖ ప్రతిపాదించగా.. అంత పెద్దమొత్తంలో కేటాయింపులు అసాధ్యమని.. ఈ ఏడాదికి రూ.21 వేల కోట్లతో సర్దుకోవాలని నిమ్మలకు పయ్యావుల సూచించారు. ఇందులో పోలవరం ప్రాజెక్టుకు రూ.9,000 కోట్లు, గాలేరు-నగరి, హంద్రీ-నీవాకు చెరో రూ.4,500 కోట్లు, వెలిగొండకు రూ.1,800 కోట్లు ఇస్తామన్నారు. అయితే ఈ కేటాయింపులతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ఇతర చిన్న, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులను ఎలా చేపడతామని నిమ్మల ప్రశ్నించారు. చాలా ప్రాజెక్టుల పనులు ముందుకు సాగవన్నారు. ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్థిక మంత్రిని కోరారు.

## చంద్రబాబు మోసాలను ప్రజల్లో మరింత ఎండగట్టాలి

తిప్పికొట్టడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ పంచాయితీరాజ్ విభాగం డైరీ 2025ను జగన్ ఆవిష్కరించారుటగ్రామ స్వరాజ్యం స్థాపనకు గతంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను, స్థానిక సంస్థల బలోపేతంతో పాటు ఆర్థికంగా వాటిని స్వయంసమృద్ధి దిశగా తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా జగన్ ప్రస్తావించారు. స్థానిక ప్రజాప్రతినిధులకు వైఎస్సార్సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.ఈ సమావేశంలో పార్టీ నేతలు అంబటి రాంబాబు, కొట్టు సత్యనారాయణ, పేర్ని నాని, మజ్జి శ్రీనివాసరావు, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వైఎస్సార్సీపీ పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి, నాయకులు మల్లాది విష్ణు, గడికోట శ్రీకాంత్ రెడ్డి, మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్సీపీ ఎంపీపీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మరకపూడి గాంధీ, కడప మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో ఏవీ నెరవేర్చక పోవడంతో, ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత రోజురోజుకీ తీవ్రం అవుతోందని, అందువల్ల వైఎస్సార్సీపీ నాయకత్వమంతా సమష్టిగా సీఎం చంద్రబాబు మోసాలను ప్రజల్లో ఎండ గట్టాలని పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి .. సీనియర్ నేతలకు సూచించారు. వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో, అందుబాటులో ఉన్న పార్టీ సీనియర్ నేతలతో వైఎస్ జగన్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలతో పాటు, ఇటీవల సీఎం చంద్రబాబు మాటలు, ప్రకటనలు.. తదితర అంశాలు సమావేశంలో చర్చించారు. సూపర్‌సిక్స్ హామీల అమలుపై చేతులెత్తేయడమే కాకుండా.. అందుకే ఏవేవో సాకులు చెబుతూ.. అవి ప్రజలు నమ్మేలా ప్రచారం చేస్తున్నారని వైఎస్ జగన్ గుర్తు చేశారు. వీటన్నింటి నేపథ్యంలో చంద్రబాబు వంచన, దారుణ మోసాలను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అందు కోసం రోజూ ప్రజల్లో ఉండాలని, వారితో మరింత మమేకం కావాలని జగన్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి పార్టీ సీనియర్ నేతలు అంబటి రాంబాబు, పేర్ని నాని, పేర్ని కిట్టు, కొట్టు సత్యనారాయణ, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నందిగం సురేష్, ఎస్వీ మోహన్‌రెడ్డి, కైలే అనిల్‌కుమార్, కావటి మనోహర్‌నాయుడు, కె.సురేష్‌బాబు, గోరంట్ల మాధవ్, ఈపూరు గణేష్, ఆలూరు సాంబశివారెడ్డి, మజ్జి శ్రీనివాసరావు, వంకా రవీంద్రనాథ్, అదీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.గుంటూరు స్థానిక ప్రజాప్రతినిధులకు వైఎస్సార్సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్సీపీ పంచాయితీరాజ్ విభాగం డైరీ 2025ని ఆయన ఆవిష్కరించారు. మన హయాంలో గ్రామ స్వరాజ్య స్థాపనకు అనేక చర్యలు తీసుకున్నాం. స్థానిక సంస్థల బలోపేతానికి ఎంతో కృషి చేశాం. ఆర్థికంగా వాటిని ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపట్టాం. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు వైఎస్సార్సీపీ ఎప్పుడూ అండగా ఉంటుంది అని అన్నారాయన. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రరెడ్డి, వైఎస్సార్సీపీ సీనియర్ నేతలు పేర్ని నాని, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మల్లాది విష్ణు, గడికోట శ్రీకాంత్ రెడ్డి, మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్సీపీ ఎంపీపీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మరకపూడి గాంధీ, కడప మాజీ డీసీఎంఎస్ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి.. తదితరులు పాల్గొన్నారు.వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవటమే కేసీఆర్కు మనం ఇచ్చే పుట్టినరోజు కానుక అని అన్నారు.వృక్షార్చన కార్యక్రమాన్ని నడిపించేందుకు బాధ్యతలు తీసుకున్న బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ, మాజీ ఎంపీ జె సంతోష్ కుమార్ ను కేటీఆర్ అభినందించారు. రాష్ట్రం, దేశం పచ్చబడాలనే సంకల్పంతో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ చేస్తున్న ఈ వృక్షార్చనలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. హరితసేనలోని సభ్యులందరూ మొక్కలు నాటి అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని కోరారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. హరిత తెలంగాణ స్వాప్నికుడు కేసీఆర్ సంకల్పానికి మద్దతుగా చంద్రునికో నూలు పోగులాగా వృక్షార్చన తాను కార్యక్రమాన్ని తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను కేటీఆర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ ఆఫీస్ సెక్రటరీ, మాజీ రాజ్యసభ సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, బీగాల గణేష్, శంకర్ నాయక్, గ్రీన్ ఇండియా చాలెంజ్ కో-ఫౌండర్ రాఘవ సమక్షంలో విడుదల చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్అన్నారు.మంగళవారం కేటీఆర్ ఖమ్మంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. పువ్వాడ అజయ్ లాంటి నాయకుడు ఓడిపోతాడని ఎవరం అనుకోలేదు.. ఆయన ఓడిపోవడం నిజంగా బాధాకరమని అన్నారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు కీలక నాయకులు మంత్రులుగా ఉన్నారని.. అయినా జిల్లాలో అభివృద్ధి శూన్యం అని విమర్శించారు. వరదల సమయంలో ముగ్గురు మంత్రులతో ఒక్క పైసా ఉపయోగం కూడా లేదని ఎద్దేవా చేశారు. ఒక్క కుటుంబాన్ని కూడా వరదల నుంచి కాపాడలేకపోయారని అన్నారు. కనీసం హెలికాప్టర్ తెప్పించాలనే సోయి కూడా ముగ్గురిలో ఎవరికీ లేదని ఎద్దేవా చేశారు.కాగా, అంతకుముందు కేటీఆర్ వృక్షార్చన కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 17న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదినం సందర్భంగా ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. హరిత తెలంగాణ స్వాప్నికుడు కేసీఆర్ సంకల్పానికి మద్దతుగా చంద్రునికో నూలుపోగు లాగా వృక్షార్చన కార్యక్రమాన్ని చేపట్టాలని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని అన్నారు. అదే కేసీఆర్‌కు మనం ఇచ్చే పుట్టిన రోజు కానుక అని తెలిపారు. ఈ వృక్షార్చన కార్యక్రమం తీసుకున్న పార్టీ జనరల్ సెక్రటరీ, మాజీ ఎంపీ సంతోష్ కుమార్‌ను కేటీఆర్ అభినందించారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ ఆఫీస్ సెక్రటరీ, మాజీ రాజ్యసభ సభ్యుడు రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, బీగాల గణేశ్, శంకర్ నాయక్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ కో-ఫౌండర్ రాఘవ పాల్గొన్నారు.గత 14 నెలల పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులు, మహిళలు, వృద్ధులు, యువత కోసం ఒక్క పని కూడా చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. ఎనుముల అన్నదమ్ముల కోసం, అల్లుడు, అదాని కోసం, బావమరిది, కుటుంబసభ్యుల కోసం దోచుకునే పనిలో పడ్డారని ఆరోపించారు.

## సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
## వైసీపీకి చెంపపెట్టు

టీడీపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ... సుప్రీంకోర్టు వ్యాఖ్యలు వైసీపీకి చెంపపెట్టు అని అన్నారు. హత్యా రాజకీయాల పునాదులపై వైసీపీని జగన్ నిర్మించారని విమర్శించారు. క్రిమినల్ కేసులు ఉన్నవారు పాలకులైతే రాష్ట్రం ఎలా ఉంటుందో గత ఐదేళ్లలో చూశామని ప్రత్తిపాటి అన్నారు. హత్యలు చేసి దర్జాగా పాలన సాగించారని... వారి తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఇతరులపై బురద చల్లారని మండిపడ్డారు. అబద్ధాలతో ప్రజలను మోసం చేశారని... రాష్ట్రాన్ని అడ్డంగా దోచేసి, అప్పులకుప్పగా మార్చారని దుయ్యబట్టారు. సమాజంలో ఉండటానికే అర్హత లేని వ్యక్తులను అందలం ఎక్కిస్తే ఏమవుతుందో రాష్ట్ర ప్రజలు ఇప్పటికైనా గ్రహించాలని సూచించారు.నేరమయ రాజకీయాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యలు వైసీపీకి చెంపపెట్టు అని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. హత్యా రాజకీయాల పునాదులపై వైసీపీని జగన్ నిర్మించారని ఆరోపించారు. అవినీతి, విద్వేషమనే కవచాలతో వైసీపీని కాపాడుకుంటున్నారని చెప్పారు. క్రిమినల్ కేసులున్న వారు పాలకులయితే జరిగే నష్ట ప్రభావం రాష్ట్రం గత ఐదేళ్లు చవిచూసిందని అన్నారు. హత్యలు చేసి దర్జాగా పాలన సాగించి, తమ తప్పులు కప్పిపుచ్చుకునేందుకు నిస్సిగ్గుగా ఎదుటివారిపై బురదజల్లారని మండిపడ్డారు. అబద్ధాలు, మోసాలతో ప్రజల్ని వంచించి రాష్ట్రాన్ని దోచేసి అప్పుల కుప్పగా మార్చారని ధ్వజమెత్తారు. సమాజంలో ఉండటానికే పనికిరాని వారిని అందలం ఎక్కిస్తే ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందో ఇప్పటికైనా ప్రజలు గ్రహించాలని ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.

## ఎల్‌వోసీలో భారీ పేలుడు..
## ఇద్దరు జవాన్లు దుర్మరణం



తెలిసిన వెంటనే భద్రతా బలగాలు భారీగా అక్కడకు చేరుకొని కూంబింగ్ మొదలు పెట్టాయి. అనంతరం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. పేలుడుకు సంబంధించిన విషయాలపై ఆరా తీస్తున్నారు.కాగా, ఇటీవలే నార్త్ కశ్మీర్‌లోని బండిపొర జిల్లాలో ఆర్మీ వాహనం ప్రమాదవశాత్తూ లోయలో పడి ఇద్దరు జవాన్లు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సైనికులతో వెళ్తున్న వాహనం ఎస్‌కే పయీన్ ప్రాంతంలో మలుపు తిరుగుతుండగా రోడ్డుపై నుంచి జారి కిందనే ఉన్న లోయలో పడింది. ఈ ఘటన మరువక ముందే బ్లాస్టింగ్ జరిగి మరో ఇద్దరు జవాన్లు మృతిచెందటం పట్ల ఆర్మీ అధికారులు దిగ్భ్రాంతికి గురవుతున్నారు

## శ్రీవారి లడ్డూలో కాదు..




ఎల్లో మీడియా.. నెయ్యిలో కల్తీ జరిగిందని సిట్ నిర్ధారించినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తిరుపతిలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడిన భూమన కరుణాకర్‌రెడ్డి, ఇకనైనా తప్పుడు ప్రచారం ఆపకపోతే దేవదేవుని ఆగ్రహానికి గురవడం ఖాయమని హెచ్చరించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాటలు, ఆలోచనల్లోనే కల్తీ కొవ్వు ఉందని.. లడ్డూకి వాడే నెయ్యిలో కల్తీ జరిగే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు.

### ఆ విషయం రిమాండ్ రిపోర్టులో లేదు:

నిందితుల రిమాండ్ రిపోర్టులో నెయ్యి కల్తీ జరిగిందని సిట్ చెప్పలేదు. అయినా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సహా ఎల్లో మీడియాలో మాత్రం నెయ్యి కల్తీ జరిగిందని నిర్ధారణ జరిగిపోయినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బోలే బాబా డెయిరీ, వైష్ణవి డెయిరీ, ఏఆర్ డెయిరీ చేసిన తప్పులపై మాత్రమే సిట్ విచారణ జరిపి రిమాండ్ బాధ్యులను రిమాండ్‌కి తరలించింది. సుప్రీం కోర్టు నియమించిన సీబీఐ డైరెక్టర్ ఆధ్వర్యంలోని సిట్ బృందం ఎక్కడా నెయ్యి కల్తీపై మాట్లాడలేదు. టెండర్ల అవకతవకలపై మాత్రమే విచారణ జరుగుతోంది. దానికి సంబంధించే నలుగురిని అరెస్టు చేశారు.

### అయినా నిస్సిగ్గుగా దుష్ప్రచారం:

కానీ, చంద్రబాబు మాత్రం వైఎస్సార్సీపీ మీద నిందలు మోపడానికి లడ్డూ తయారీ కోసం పంది కొవ్వును ఉపయోగించారని ఆధారాలు లేకుండా తప్పుడు ప్రచారం చేశాడు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల మనోభావాలను కించపరిచారు. పవన్ కళ్యాణ్ మరింత ముందుకెళ్లి సనాతన ధర్మ పరిరక్షణ కోసం తానే ఆవిర్భవించినట్టు వేషం కట్టి బిల్డప్ ఇచ్చాడు. తిరుపతిలో పవన్ ముందుకు వెళ్లి పవనానంద స్వామి వేషంలో సనాతనధర్మం కోసం నడుం బిగించాను అని, తిరుపతిలో లడ్డూను నీచులు అపవిత్రం చేశారు అని మాట్లాడారు. అయోధ్య ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కూడా కల్తీ నెయ్యితో తయారు చేసిన లడ్డూలే పంపారని డిప్యూటీ సీఎం పవనానంద స్వామి తీవ్రమైన నిరాధార ఆరోపణలు చేశారు..నిజానికి అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి పంపిన లక్ష లడ్డూల తయారీకి కావాల్సిన నెయ్యిని చంద్రబాబు నియమించిన టీటీడీ బోర్డులోనే సభ్యుడిగా ఉన్న ముంబైకి చెందిన సౌరభ్ బోరా అనే వ్యక్తి సరఫరా చేశాడు.

## ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకమైనవి



వ్యూహంపై ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఎన్నికలు రేపటి స్థానిక సంస్థల ఎన్నికలకు రిహార్సల్స్ అవుతాయన్నారు.ఈ ఎన్నికల ఊపుతో స్థానిక సంస్థల ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించేందుకు దోహద పడుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకంగా మారుతుందని.. క్షేత్ర స్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని భాగస్వామ్యం చేయగలిగితే గెలుపు నల్లేరు మీద నడక అవుతుందన్నారు. తద్వారా రేపటి స్థానిక సంస్థలకు జరగనున్న ఎన్నికల్లో సైతం పార్టీ గెలుపుకు మార్గం సునాయాసం అవుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ప్రభుత్వం సాధించిన విజయాలను విరివిగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. పదేళ్ల సుదీర్ఘ విరామం అనంతరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన సంవత్సరం వ్యవధిలోనే జరిగిన ఉపాధ్యాయ నియామకాలు మొదలు ప్రభుత్వం భర్తీ చేసిన ప్రభుత్వ ఉద్యగాల నియామకాలను విద్యార్థి, యువతకు వివరించాలన్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వం పరంగా సనస్యలు తన దృష్టికి తీసుక రాగలిగితే సత్వరం పరిష్కరించేందుకు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులకు, పార్టీ యంత్రాంగానికి నిరంతరం అందుబాటులో ఉంటానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు దుద్దిళ్ల శ్రీదర్ బాబు, పొన్నం ప్రభాకర్లతో పాటు శాసనమండలి సభ్యులు జీవన్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, రాజ్ ఠాకూర్, డాక్టర్ సంజయ్, వెలిచాల రాజేందర్ రావు, మేడిపల్లి సత్యం, వడితేల ప్రణవ్, సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ సేన



# జీవిత గమ్యం చేరాలంటే విద్యార్థికి చదువే ఒక ఆయుధం

## సర్కిల్ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్





**చింతపల్లి, ఫిబ్రవరి 12, తెలంగాణ సేన న్యూస్ :** ప్రతి విద్యార్థి తను జీవిత గమ్యాన్ని చేరాలంటే చదువే ఆయుధంగా పనిచేస్తుందని నాంపల్లి సీఐ ఏ నవీన్ కుమార్ అన్నారు. బుధవారం చింతపల్లి మండలం పరిధిలోని గోడుకొండ్ల వీటి నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి నవీన్ కుమార్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కలలు కనాలి వాటిని సహకారం చేసుకోవాలంటే కష్టపడి ఇష్టంగా చదివి పట్టుదలతో మంచి ఫలితాలు సాధించాలని మనం గమ్యం చేరాలంటే మనకున్న ఆయుధం చదువని అందుకోసం పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చేల్లం పాండురంగారావు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్రస్థాయి విషయ నిపుణులచే రూపొందించబడిన మెటీరియల్ అందించడం సంతోషకరమని పాండురంగారావు ధనికుడు కాదు అలానే ఉద్యోగం లేదు కానీ తనకున్న ఆలోచన ఆశయం ఆయన నడిపిస్తుందని నల్లగొండ రంగారెడ్డి మేడ్చల్ హైదరాబాద్ లాంటి జిల్లాల్లో కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఈ మెటీరియల్ అందించడం గర్వంగా ఉందన్నారు విద్యార్థులు ఏకాగ్రతతో ఎలాంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని ఆన్లైన్ గేమ్ లకు ఇతర విష సంస్కృతికి దూరంగా ఉంటూ తల్లిదండ్రుల శ్రమను వృధా పోకుండా పాఠశాలకు గ్రామానికి విద్యను బోధించే గురువులకు మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చే విధంగా జీవితాన్ని మలుచుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు నేటి సమాజంలో చాలామంది చెడుకు తొందరగా ఆకర్షితులై బంగారు భవిష్యత్తును పాడు చేసుకునే పరిస్థితి నెలకొందని వాటన్నిటిని నియంత్రించాలంటే విద్యార్థి దశ నుండే మనం మారుతూ సమాజాన్ని మార్చవలసిన బాధ్యత విద్యార్థుల పైన ఉందని పి ఆర్ ఆర్ ఫౌండేషన్ విద్యాభివృద్ధి తో పాటు సామాజిక పరమైన అంశాల పైన సమాజాన్ని చైతన్యవంతం చేయాలని ప్రయత్నం విలువైందని భవిష్యత్తులో పాండురంగారావు ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపట్టి వ్యవస్థ మార్పు కోసం పి ఆర్ ఆర్ ఫౌండేషన్ సేవలు కొనసాగాలని వారు ఈ సందర్భంగా అన్నారు విద్యార్థులు వారికి నచ్చిన రంగానించుకొని అందులో విజయం సాధించే విధంగా ప్రయత్నం చేయాలని ఆయన ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియజేశారు అనంతరం సర్కిల్ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్ పి ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చేల్లం పాండురంగారావు చింతపల్లి మండల మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్ చేతుల మీదగా విద్యార్థులకు లాస్ట్ రివిజన్ బుక్ అందించడం జరిగింది కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి మరియు పాఠశాలకు అన్ని విధాలుగా తనవంతుగా ప్రోత్సాహం అందిస్తున్న మాజీ ఎంపీపీ భవాని పవన్ కుమార్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ప్రవీణ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# భార్యను అదనపు కోసం వేధిస్తున్న సీఐ

**నా కుటుంబ సభ్యులలకు ప్రాణహాణి ఉంది**

**బాధితురాలి ఆవేదన**



**నల్గొండ, తెలంగాణ సేన న్యూస్ :** సోషల్ మీడియా వేదికగా నా పరువు ప్రతిష్టకు భంగం కలిగే విధంగా నా భర్త అబిడ్స్ సీఐ కుంభం నరసింహ ,ఆయన స్నేహితులు జాజిరెడ్డిగూడెం మండలం,వేల్పుచర్ల గ్రామానికి చెందిన ఖమ్మంపాటి భిక్షపతిలు , వెల్దేవి గ్రామం నిమ్మల శ్రీను నా పైనాచేస్తున్న కుట్రను ఖండిస్తున్నానని కుంభం సంధ్య బుధవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కుంభం సంధ్య తెలిపిన వివరాల ప్రకారం అడ్డగూడూరు మండలం వెల్దేవి గ్రామానికి చెందిన అబిడ్స్ సీఐ కుంభం నరసింహతో పెద్దలు కుదిరించి, పెద్దల సమక్షంలో 18 ఏప్రిల్ 2012 న వివాహం జరిగిందన్నారు. నా భర్త కుంభం నరసింహ అబిడ్స్ సీఐగా విధులు నిర్వహిస్తున్నాడు.మాకు కూతురు, కుమారుడు ఉన్నారు. పెళ్లి అయిన దగ్గర నుండి నన్ను అదనపు కట్నం కోసం వేధిస్తూ, పలుమార్లు శారీరకంగా బెల్టుతో కొడుతూ, మానసికంగా, చిత్రహింసలు చేసేవాడని, పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడినప్పటికీ నా భర్త తీరును మార్చుకోకుండా ఆయన చేసిన తప్పులు కప్పి పుచ్చుకోవడానికి నన్ను నా క్యారెక్టర్ను తప్పుగా తనకున్నా అధికార బలంతో తప్పుడు ప్రచారం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. 10 జూన్ 2024 న నన్ను తీవ్రంగా కొట్టి,మీ తల్లి గారి ఇంటికి వెళ్లకుండా ఇక్కడ ఉంటే చంపుతానని నువ్వు వెళ్లిపోవాలని నన్ను భయభ్రాంతులకు గురిచేశాడు. నేను ప్రాణభయంతో బండమీదిగూడెం గ్రామమైన నా తల్లిదండ్రుల వద్దకు నేను వచ్చానని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కోర్టు, శాలిగౌరారం పోలీస్ స్టేషన్లో కోర్టులో కేసు నడుస్తుందని తెలిపారు. నా భర్త కుంభం నరసింహ తన స్నేహితులతో కలిసి ఫోనులో మాట్లాడి నా పై అనవసరమైన ఆరోపణలను చేస్తూ ఆడియో రికార్డులను సామాజిక మాధ్యమాలలో ఆయనకున్న అధికారబలంతో వైరల్ చేస్తూ నా పరువు ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నాడని ఆవేదనను వ్యక్త పరిచారు. నా భర్త రెండో పెండ్లి చేసుకుని నన్ను, నా కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడాని తెలిపారు. మీడియా వేదికగా 09/02/25న ఒక వ్యక్తి ఫోటో ప్రెస్ ద్వారా విడుదల చేస్తూ ఆఫోటోలో వేరే మహిళతో ఉన్న ఫొటోను మీడియా వారికి ఇస్తు అందులో ఉన్నది నేనే అన్నట్టుగా చూపించే ప్రయత్నం చేస్తూ నా పరువు ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న నా భర్త అబిడ్స్ సీఐ నరసింహపై ఆయన స్నేహితుడు భిక్షపతిపై, 10 ఫిబ్రవరి 2025న శాలిగౌరారం మండల పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు సంధ్య తెలిపారు.తమ భర్త నరసింహపై ఉన్నంత స్థాయి పోలీస్ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.పెళ్లి అయి 12 సంవత్సరాలు అయిన,ఇద్దరు పిల్లలు ఉన్న, అతని వైఖరి రోజు రోజుకి మరింత దారుణంగా మారిందన్నారు.నా భర్త నుండి నేను ఎదుర్కొంటున్న హింస,నాకు వేరే వాళ్లతోనే శారీరక సంబంధాలు ఉన్నాయని సోషల్ మీడియాలో విచ్చలవిడిగా తన అధికారం అడ్డుపెట్టుకుని ప్రచారం చేస్తున్నాడని, ఈ వార్తలు నన్ను ,నా తల్లిదండ్రులని అన్నదమ్ముల్ని, పిల్లల్ని ఎంతో కృంగదీస్తు న్నాయన్నారు. నన్ను దూరం పెట్టి అతను రెండో పెళ్లి చేసుకున్నాడని, నన్ను నా పిల్లలను పట్టించుకోకుండా వదిలేశాడన్నారు. పోలీస్ అధికారిగా తన ఉన్నత స్థాయిని ఉపయోగించి రక్షణ పొందుతున్నాడు. బయటకు నిజాలు రాకుండా ప్రయత్నిస్తున్నాడు. ఆయన అక్రమ సంబంధాన్ని ధృవీకరించి, అతని అధికార దుర్వినియోగంపై చర్య తీసుకోవాలని, పోలీసు ఉన్నత అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.అతని నుంచి నాకు నా తల్లిదండ్రులకు అన్నదమ్ములకు ప్రాణ భయం ఉందన్నారు.

# సిపిఎం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి గిరిజన నేతల ముకుమ్మడి రాజీనామా

**సాదుల శ్రీనివాస్ నియంతృత్వ ధోరణి నచ్చాక బయటికి వెళ్తున్నాం రాజీనామా చేసాక సస్పెండ్ చేస్తే పరువుదావా కేసు వేస్తాం**

**మాలోతూ శాంతి కుమార్ నాయక్, కెలోత్ సాయి కుమార్, గుగులోతు సూర్య ప్రకాష్**



**మహబుబాబాద్ తెలంగాణ సేన :** సిపిఎం పార్టీలో సామాజిక న్యాయం కోరుకునే సాదుల శ్రీనివాస్ గిరిజన వ్యక్తులను వెళ్లగొట్టడం పట్ల తీవ్రంగా మండిపడ్డ మాజీ సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు శాంతి కుమార్ నాయక్ కేవలం కంగన్ హాల్ లో ప్రోపరెటర్ పేరు పెట్టినందుకు SFI జిల్లా కార్యదర్శి గా నన్ను వెళ్ళగొట్టారు కెలోత్ సాయి కుమార్ నాయక్ (మాజీ SFI జిల్లా కార్యదర్శి మహాసభలో ప్రతినిధులు మొత్తం ఏకగ్రీవంగా ఎన్నుకున్నా లంబాడి బిడ్డ ను అవమానపరచడం తో బయటికి,వచ్చినా ,గుగులోతు సూర్య ప్రకాష్(మాజీ SFI జిల్లా కో కన్వీనర్) డోర్నకల్ మండల కార్యదర్శిగా పని చేసి జిల్లా కేంద్రానికి రానివ్వకుండా నాకు అడ్డుపడ్డాడు సాదుల శ్రీనివాస్ SFI మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా శ్రీకాంత్,గుగులోతు సూర్య ప్రకాష్ జరిగిన అన్యాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం ఎస్ఎఫ్ఐ మాజీ తొర్రూరు డివిజన్ అధ్యక్షుడు సురేష్ బాబు,మాజీ ఎస్ఎఫ్ఐ నేతలకు అన్ని విధాలుగా అండగా నేనుంటానని,కిసాన్ పరివార్ సీఈఓ డాక్టర్ వివేక్ హామీ మహబూబాబాద్ జిల్లాలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ సామాజిక వర్గాల పట్ల చూపిస్తున్న తీవ్ర వివక్ష ఈరోజు మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నట్లు మాలోతు శాంతి కుమార్, కే లోతు సాయికుమార్, గుగులోతు సూర్య ప్రకాష్ ప్రకటించారు,అనంతరం వారు మాట్లాడుతూ సిపిఎం పార్టీలో ఒక నియంతలాగా వ్యవహరిస్తూ సామాజిక వర్గాల బిడ్డలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, ఎదవనివ్వడం లేదని, ప్రశ్నించే వారందరినీ సస్పెండ్ చేస్తు న్నారని వారు తెలిపారు.పదవి మీద వ్యామోహం అని సూర్య ప్రకాష్ పై దుష్ప్రచారం చేస్తున్న సిపిఎం పార్టీ నేతలకు ఒకటే చెప్తున్నాం, పదవి మీద వ్యామోహం మాకు కాదని కేవలం సాదుల శ్రీనివాస్ కు వుందని, ఆ కుర్చీని 30 సంవత్సరాల నుండి వదలడం లేదని తెలిపారు,సాదుల శ్రీనివాస్ నియంతృత్వ వైఖరి నచ్చక మేము, రాజీనామా, చేస్తున్నామని, రాజీనామా తర్వాత బహిష్కరిస్తే పరువు దావకేసు వేస్తామని హెచ్చరించారు సిపిఎం పార్టీ మానుకోట లో పెరగాలంటే సాదుల శ్రీనివాస్ ను తక్షణమే పై పార్టీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# సీసీ రోడ్ల పేరుతో15 కోట్లరూపాయల అవినీతికి పాల్పడ్డ కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులకు స్థానిక ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి

## డా జాడీ రామరాజు నేత



**ములుగు జిల్లా ప్రతినిధి,తెలంగాణ సేన న్యూస్ :** పిబ్రవరి 12 : మంగళవారం రోజున కన్నాయిగూడెం మండల కేంద్రం లోనీ కంతనపల్లి గ్రామం లో బీజేపీ భూత్ అధ్యక్షులు డబ్బాకట్ల నాగరాజు ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం కు ముఖ్యఅతిథిగా బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి డా.జాడి రామరాజు నేత హాజరై మాట్లాడుతూ కన్నాయిగూడెం నూతన మండలంగా ఏర్పాటు చేసిన నాటి నుండి ఆదివాసి దళిత బహుజన మైనార్టీ వర్గాల గ్రామాలలో కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ ఉపాధిహామీపథకం ద్వారా సీసీ రోడ్ల కు కన్నాయిగూడెం మండలానికి 15కోట్ల రూపాయలు ఇస్తే కాంగ్రెస్, తెరాస నాయకులు కలిసి రోడ్ల పేరుతో సైడ్ బర్మ్ కానీ, రోడ్డు రోలర్ తో తొక్కించి రోడ్డు పోసేది ఉండేది కానీ రెండు పార్టీల నాయకులు ఒక్కటై నీకెంత నా కేంత అని పంచుకొని నిధులు దుర్వినియోగం చేశారాణి అన్నారు. ఇప్పటికైనా ఆదివాసి దళిత బహుజన వర్గాల ప్రజలు బి ఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకుల అవినీతి అక్రమాలు బ్యాంకు లను దోపిడీ చేసి కేంద్ర ప్రభుత్వం నిధులను దుర్వినియోగం చేసిన నాయకులకు పంచాయతీ ఎన్నికల్లో గుణపాఠంచెప్పాలని అన్నారు. అదేవిదంగా కంతంనపల్లి రోడ్డు పెద్దచెరువు ఐలపురం రోడ్డు కావాలంటే బీజేపీ అభ్యర్థులను గెల్పించండి అలాగే కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షమా పథకాలు ప్రజలకు అందాలంటే బీజేపీ బలపరిచిన అభ్యర్థులను ఆదివాసి దళిత హుజన వర్గాల ప్రజలు ఒక్క అవకాశం ఇచ్చి గెల్పించండి అభివృద్ధి చేసి చూపేడతామణి బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికారప్రతినిధి డా జాడి రామరాజు నేత అన్నారు. ఈ సమావేశం లో డబ్బాకట్ల పవన్, నవీన్, రమేష్ బాబు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.


## వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న...ఎమ్మెల్యే



**పెద్దపల్లి తెలంగాణ సేన :** పెద్దపల్లి పట్టణంలోని శ్రీ. వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రోజున ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ పరిసరాలను పరిశీలించి ఆలయ కమిటీ సభ్యుల ఆలోచన మేరకు,భక్తుల సౌకర్యం కోసం ఆలయాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని భక్తులు,పట్టణ ప్రజలు పార్టీలకు కతీతంగా ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు..ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులు అయిన నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో చేర్చాలి





**తెలంగాణ సేనా :** యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రమోద్ కుమార్ గారిని మరియు కోతులపురం గ్రామ పంచాయతీ సెక్రటరీ గారిని కలిసి ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో నుంచి తొలగించిన పేర్లను మళ్లీ పునః సర్వే చేసి అర్హులు అయిన నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో చేర్చాలని కోరడం కోతులపురం గ్రామ యువజన సంఘం నాయకులు కోరారు.అలాగే ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తించి వారి పేర్లను కూడా ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో చేర్చాలని కోరడం జరిగింది. దానికి వారు సానుకూలంగా స్పందించారు.ఇట్టి విషయం పై సోమవారం రోజున కలెక్టర్ గారిని మరియు హౌసింగ్ రూరల్ డెవలప్మెంట్ ఆఫీసర్ ని కలవడం జరుగుతుంది అని అన్నాను.ఈ కార్యక్రమంలో సందీప్, జలంధర్,దీపక్, మహేందర్ పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు



**ములుగు జిల్లా ప్రతినిధి :** తెలంగాణ సేన న్యూస్ మాజీ కో ఆప్షన్ ఖలీల్ అమ్మగారిని బట్ట రాములు ఇటీవల మరణించిన వారి కుటుంబాన్ని పరామర్శించిన వారి కుమారుడు సంజయ్. స్వామి. భార్య లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్న హైమద్ పాషా ను వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మహమ్మద్ అబ్దుల్ హదిర్ మృతి చెందగా వారి కుమారుడు షబ్బీర్ జమీర్ లను పరామర్శించడం జరిగింది. బోయిరి నర్సయ్య మరణించగా వారి భార్య లక్ష్మి ని పరామర్శించి ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని పార్టీ కోసం ప్రతి ఒక్కరూ సైనికుల పనిచేయాలని కోరడం జరిగింది. వారి వెంట మండల పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షులు ఖాజా పాషా కాకులమర్రి ప్రదీప్ రావు, తాడూరి రఘు, వలీ బాబా, గండే పేల్లి నరసయ్య, కుమ్మరి చంద్రబాబు, దన్నపనేని కిరణ్, జాడిభోజారావు,ఆనందు, ఖలీల్, చిప్ప నాగరాజు, శ్రీరాములు, వావిలాల పోషాలు, రామ్, నర్సయ్య,ముత్తయ్య,సప్పిడి రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ చండూర్ సేవా వారి ఆధ్వర్యంలో 10వ విద్యార్థులకు పరీక్షల సామాగ్రీ పంపిణీ





**చండూరు, ఫిబ్రవరి 12, తెలంగాణ సేన న్యూస్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ చండూర్ సేవా వారి ఆధ్వర్యంలో 10వ విద్యార్థులకు పరీక్షల సామాగ్రిని లయన్స క్లబ్ ఆఫ్ సూర్యాపేట 320ఇ రీజిన్ 4 ఆర్ సి గుడుపూరి వెంకటేశ్వరరావు సహకారంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చండూరు స్కూల్లో దాదాపు 100 మంది విద్యార్థులకు ప్యాడ్లు పెన్నులు డిక్షనరీ స్కేలు పంపిణీ చేయడం జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బంగారిగడ్డ విద్యార్థుల యొక్క శారీరక మానసిక దృఢత్వం కొరకు క్రీడా సామాగ్రిని పిఎంజెఎఫ్ లయన్ మదన్ మోహన్ రేపాల బహూకరించారు. ఈ సందర్భంగా పి ఎం జె ఎఫ్ లయన్ మదన్ మోహన్ రేపాల గారిచేత యువత సాధికారత అంశంపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది విద్యార్థులు గుడుపూరు వెంకటేశ్వరరావు గారిని మరియు పీఎంజేఎఫ్ లయన్ మదన్ మోహన్ రేపాల గారిని అభినందించారు.ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్ గా ఆర్సి రీజియన్ చైర్పర్సన్ గడ్డం ప్రదీప్ కుమార్, లైన్స్ క్లబ్ ఆఫ్ ప్రెసిడెంట్ చండూరు సేవ సంగు జానయ్య, కార్యదర్శి లతీఫ్ పాషా, ట్రెజరర్ వెంకటరెడ్డి గారు, లవ కుమార్, నాగరాజు, నెల్లూరి శ్రీనివాస్, జగదీశ్ లైన్ పెద్దలు పాఠశాల ఇన్చార్జ్ హెడ్మాస్టర్లు వాసంతి మరియు రామలింగం, ఉపాధ్యాయులు సుధీర్ మరియు చందు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ యాదవరెడ్డి



**తెలంగాణ సేనా :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ్ రెడ్డి చేతుల మీదుగా ఏ వన్ టీవీ తెలుగు న్యూస్ ఛానల్ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా డాక్టర్ యాదవ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధి జర్నలిస్టులు అని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ మంచి గుర్తింపు పొందిన ఏ వన్ టీవీ తెలుగు న్యూస్ ఛానల్ వారిని అభినందిస్తూ రాబోయే రోజుల్లో మరింత ప్రజలకు చేరువ కావాలని యాజమాన్యానికి సిబ్బందికి శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు.

## చెత్త ప్లాస్టిక్ రహిత పెద్దపల్లి గా తీర్చిదిద్దుదాం మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్



**పెద్దపల్లి తెలంగాణ సేనా :** స్వచ్ఛత హీ సేవ 2024-25 కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ సిబ్బంది తో కలిసి పెద్దపల్లి పట్టణం లోని మినీ ట్యాంక్ బండ్ (ఎల్లమ్మ గుండమ్మ చెరువు) పై స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..పెద్దపల్లి పట్టణాన్ని చెత్త, ప్లాస్టిక్ రహిత పెద్దపల్లి గా తీర్చిదిద్దడానికి పెద్దపల్లి పట్టణ ప్రజలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ఇంట్లో ప్రతిరోజు వెళ్లే చెత్త తడి పొడి చెత్తగా వేరుచేసి మీ వద్దకు వచ్చే మున్సిపల్ సిబ్బందికి స్వచ్ఛ ఆటోలకు అందజేయాలని అలాగే పెద్దపల్లి పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ పై సాయంత్రం వేళ వచ్చే సందర్శకులు అలాగే పట్టణ ప్రజలు ఇంట్లో నుండి పూజ సామాన్లు,ప్లాస్టిక్ కవర్లు తీసుకువచ్చి చెరువులో వేయడం జరుగుతుందని దయచేసి అలా వేయకుండా మినీ ట్యాంక్ బండ్ పై ఏర్పాటుచేసిన ప్లాస్టిక్ డస్ట్ బిన్స్ లో వేయాలని ఉన్నారు. పెద్దపల్లి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే క్రమంలో మీ వంతు సహాయ సహకారాలు అందించాలని అన్నారు ఇంత చక్కటి కార్యక్రమం చేయడం చాలా సంతోషంగా ఉందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బందికి వార్డ్ ఆఫీసర్లకు,ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్,జూనియర్ అసిస్టెంట్ రమాకాంత్,వార్డ్ ఆఫీసర్లు,సానిటరీ ఇన్స్పెక్టర్లు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణా



**నర్సంపేట డివిజన్ తెలంగాణ సేన :** ఆర్డీవో కార్యాలయం లో ప్రతిభ మరియు స్వయం కృషి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యం లో ఎఫ్ ఎమ్ ఎమ్ మరియు ఐ జే ఎం సంస్థల వారి సహకారంతో నిర్వహిస్తున్న మానవ అక్రమ రవాణా మరియు వెట్టి చాకిరి నిర్మూలన కు సంబంధించిన వాల్ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నర్సంపేట ఆర్ డి ఓ ఉమారాణి తో జరిగినది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆర్ డి ఓ ఉమారాణీ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా వివిధ రూపాల్లో లాభాపేక్షతో మహిళలను, పిల్లలను, ఆడా,మగా తేడా లేకుండా జరగడం ఆందోళ నకర విషయం అన్నారు.ముఖ్యంగా మహిళలకు సినిమా నటిగా,చదువు ఎక్కువ లేకున్నా పెద్ద ఉద్యోగం అని నమ్మించి వ్యభిచార గృహాలకు,అవయవాలను అమ్మడానికి ,తక్కువ వేతనానికి వెట్టి చాకిరి, బిచ్చమెత్తడానికి ల కోసం అమ్ముతున్నారని అన్నారు.దీని అరికట్టడానికి లైంగిక రవాణా కై, బీ యన్ ఎస్ సెక్షన్143 తో,143 (1)(4)(5), మరియు సెక్షన్ 76&79 లతో ఈ నేరాలకు పాల్పడిన వారిని శిక్షించ వచ్చని,ఈ నేరాలు జరుగుతున్నప్పుడు పసిగట్టి వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ లు 1930 కు గాని, 181,1098,112కు గాని ఉచితంగా ఫోన్ చేస్తే వెంటనే ఆయా నేరాలను ఆపి నేరస్తులను శిక్షించ వచ్చని ప్రజలందరికి దీనిపై అవగాహన కలిగించే విధంగా స్వచ్ఛంద సంస్థలు కృషి చేయడం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రతిభా సంస్థ అధ్యక్షుడు గిరగాని సుదర్శన్ గౌడ్ స్వయం కృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ వెంకటాచారి నరేష్ సిబ్బంది వెంకట్‌లు పాల్గొన్నారు.

## పేదలకు అండగా రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్

**బాధిత కుటుంబాలకు 10,000 ఆర్థిక సాయం**



**తెలంగాణ సేనా :** కడ్తాల్ మండలంలోని మృతి చెందిన మృతుల కుటుంబాలకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ కొండంత భరోసా నిస్తుంది. మండలంలో అనేక కారణాలతో మృతి చెందిన మృతుల కుటుంబాలకు తానున్నానని భరోసా నిస్తుంది. బుధవారం కడ్తాల్ మండల కేంద్రంలో ముత్తి తులసి దాస్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ స్థానిక నాయకులతో కలిసి తులసి దాస్ కుటుంబాన్ని పరామర్శించారు.అనంతరం తులసీదాస్ మృత దేహానికి పూలమాలేసి నివాళులర్పించారు.తులసి దాస్ కుటుంబానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించగా, కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డిలు చెరో 5000 రూపాయల ఆర్థిక సాయం అందించారు. అనంతరం ముదివెన్ గ్రామంలో వరికుప్పల నరసమ్మ కుటుంబాన్ని ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్ స్థానిక నాయ కులతో కలిసి పరామర్శించారు.అనంతరం ట్రస్టు ద్వారా 5000 రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాదయ్య గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ రాజు నాయకులు పుట్టి శ్రీను గణేష్ రామచంద్రయ్య జంగయ్య రాజు పర్వతాలు కృష్ణ అంజి శ్రీకాంత్ రాజా దాసు శ్రీశైలం నరసింహ సాయి కృష్ణ నరసింహ మహేష్ రాములు అశోక్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్



**పెద్దపల్లి తెలంగాణ సేనా :** పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ జూలపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన వేల్పుల లక్ష్మి అనారోగ్య కారణాల చేత ఇటీవలే మరణించగా విషయం తెలుసుకున్న రఘువీర్ సింగ్ స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి వారి ఇంటికి వెళ్లి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో వెంకట్రావుపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు మంద స్వామి, వేల్పుల తిరుపతి, కైకిరెడ్డి నర్సయ్య, మల్లెత్తుల మహేందర్, వేల్పుల సందీప్,వేల్పుల శంకర్,మారం అంజయ్య,వేల్పుల లక్ష్మి,కుటుంబ సభ్యులు వేల్పుల కొమురయ్య కనకయ్య, సాగర్ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సేన
గురువారం 13 - 02 - 2025

## మీ కంట్రోల్‌లోనే ఉన్నారా?



ఈ స్మార్ట్ యుగంలో మీరు మీ కంట్రోల్‌లో ఉన్నారని భావిస్తున్నారా! మీరు భ్రమల్లో పరిభ్రమిస్తున్నట్టే!! డిజిటల్ దునియాలో ట్రెండింగ్ ఐటమ్ ఏంటో తెలుసా? మీరే!! కృత్రిమ మేధ వికృత క్రీడలో మీరో సేల్డ్ ప్రొడక్ట్! ఇక్కడ ఇంకో ట్విస్ట్ ఉంది. మిమ్మల్ని అమ్మేసిన విషయం మీక్కూడా తెలియదు! ఇటీవల విడుదలైన సినిమా ఈ విషయాన్ని క్లియర్‌గా చూపించింది. క్షణాల్లో మన పనులు చక్కబెడుతున్న ఏఐ మిమ్మల్ని రింగ్ మాస్టార్‌లా ఆడిస్తుందన్నది నిజం. కావాలంటే చెక్ చేసుకోండి.. గూగుల్ మీ ఆసక్తులకు తగ్గ వస్తువులకు సంబంధించిన నోటిఫికేషన్లు పంపిస్తుంది కదా! ఎప్పుడో ఏడాది కిందట దిగిన ఫొటోలు.. మళ్లీ రీక్యాప్ చేస్తుంది కదా! ఈ ఉదాహరణలు చాలు అరచేతిలో ఒదిగిపోయిన ఫోన్‌లో మీ జీవితమంతా ఇమిడిపోయిందని చెప్పడానికి. 'గోడలకు చెవులుంటాయ్' పాత సామెత! కానీ, ఇప్పుడు జేబులో ఉన్న ఫోనో.. ఒడిలో ఉన్న ల్యాపీనో వింటుందేమోనని సందేహించాల్సిందే! మైక్రోఫోన్, బిల్ట్‌ఇన్ కెమెరా.. ఈ రెండూ దేంట్లో ఉన్నా పరేషానే! ఇవి వాటంతట అవి మీ జీవితంలోకి ప్రవేశించవు. అవగాహనా రాహిత్యంతో మీరిచ్చే పర్మిషన్లు వాటిని యాక్టివేట్ చేస్తాయి. మనం పడుకున్నప్పుడు కూడా అవి మనల్ని గమనిస్తూ ఉంటాయి. మన మాటలు వింటుంటాయి. మన ఇన్‌బాక్స్‌లో మేసేజ్‌లను చదివేస్తాయి. మన టైమ్ బాగోకపోతే.. 'కంట్రోల్' సినిమాలో లాగా మనకు తెలియకుండానే మెసేజ్‌లకు రిట్కప్లైలు కూడా ఇచ్చేస్తుంటాయి.

మన కమాండ్‌తో పనిచేసే గ్యాడ్జెట్ కేవలం యంత్రం అనుకుంటే పొరపాటే! ఏదైనా యాప్ ఇన్‌స్టాల్ చేసినప్పుడు ఏం ఆలోచించకుండా పర్మిషన్స్ ఇచ్చేస్తుంటాం. విశేష అనుమతులు పొందిన ఏఐని ఆసరాగా చేసుకొని హ్యాకర్లు రకరకాల విన్యాసాలకు పాల్పడుతుంటారు. మీ ముఖాన్ని ఫేక్ చేయొచ్చు, మీ మాటల్ని వింటూ కరెక్ట్‌గా మిమిక్రీ చేయొచ్చు! ఈ రెండూ ఫేక్ చేయగలితే మీ పరిస్థితి 'కంట్రోల్' సినిమాలో కథానాయికలా మారిపోతుంది. దీనికి విరుగుడు డిజిటల్ డిటాక్షన్ మాత్రమే! స్మార్ట్‌ఫోన్ వినియోగాన్ని ఎంత తగ్గించుకుంటే మీరు అంత సేఫ్‌గా ఉన్నట్టు. యాప్‌లు ఇన్‌స్టాల్ చేసేటప్పుడు, వెబ్ సర్వీస్‌లు వినియోగించే ముందు టర్మ్స్ అండ్ కండీషన్స్ ఓపికగా చదవాలి! ఆ ఏం చదువుతాంలే అని ఓకే.. ఓకే.. అనుకుంటూ వెళ్లిపోతే, అసలుకే ఎసరొస్తుంది. సదరు యాప్‌లు, వెబ్ సర్వీస్‌లు బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అవుతూ మిమ్మల్ని వాటి కంట్రోల్‌లోకి తీసుకుంటాయి. అలా జరగొద్దంటే.. ఒక యాప్ ఇన్‌స్టాల్ చేసే క్రమంలో 'ఓకే' అనేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కాదని సామాజిక మాధ్యమాల్లో దుమ్మురేపాలన్న ఆలోచన ధోరణిని తగ్గించుకోవాలి. ఏఐ విప్లవాత్మకంగా విస్తరిస్తున్న తరుణంలో ఫోన్‌ను ఎడాపెడా వాడేసే సంస్కృతిని తగ్గించుకోవాలి. డిజిటల్ అక్షరాస్యత తప్పనిసరి. సమస్య ఏదైనా కుటుంబసభ్యులతో పంచుకోవాలి. లేదంటే.. 'కంట్రోల్' సినిమాలోని కథానాయికలా వర్చువల్ వరల్డ్‌కు సరెండర్ అవ్వాల్సి వస్తుందని గుర్తుంచుకోండి.

## పర్యాటకులకు ఐఆర్‌సీటీసీ గుడ్‌న్యూస్..!




భారత్ గౌరవ్ రైలులో తొమ్మిదిరోజుల కార్తీకమాసం స్పెషల్ దివ్యదక్షిణ యాత్ర..!ఈ ఏడాది అక్టోబర్ 23వ తేదీ నుంచి కార్తీక మాసం ప్రారంభంకానున్నది. ఎంతో పవిత్రమైన కార్తీకమాసంలో పలు ఆలయాలను దర్శించుకోవాలని పలువురు భావిస్తుంటారు. ముఖ్యంగా శివాలయాలను దర్శించుకోవాలనుకుంటున్నారు. పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలనుకుటున్న వారికి ఐఆర్‌సీటీసీ టూరిజం ప్రత్యేక టూర్ ప్యాకేజీని ప్రకటించింది. దివ్యదక్షిణ యాత్ర విత్ జ్యోతిర్లంగ యాత్ర పేరుతో స్పెషల్ టూర్ ప్యాకేజీని తీసుకువచ్చింది. ఈ ప్యాకేజీలో ప్రయాణం నవంబర్ 6న ప్రారంభం కానున్నది. టూర్ ప్యాకేజీలో తొమ్మిదిరోజులు, ఎనిమిది రాత్రుల పాటు పర్యటన కొనసాగుతున్నది. ప్యాకేజీలో తిరువణ్ణామలైలోని అరుణాచలం, రామేశ్వరంలోని రామేశ్వరస్వామి, మధురైలో మీనాక్షి అమ్మవారు, కన్యాకుమారిలో రాక్ మెమోరియల్, కుమారి అమ్మన్ ఆలయం, త్రివేండ్రంలో అనంతపద్మనాభ స్వామి ఆలయం, తిరుచ్చిలో రంగనాథస్వామి, తంజావూరులోని బృహదీశ్వర ఆలయాలను సందర్శించేందుకు అవకాశం కల్పిస్తున్నది. ఈ టూర్ ప్యాకేజీలో పర్యటన హైదరాబాద్ నుంచి ప్రారంభమవుతుంది. భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్ జంక్షన్, ఖమ్మం, మదిర, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగులో, కావలి, నెల్లూరు, గూడురు, రేణిగుంట స్టేషన్లలోనూ రైలు ఆగుతుంది. ఇక పర్యటన భారత్ గౌరవ్ టూరిజం రైలులో కొనసాగుతుంది.

## వన దేవతలు శ్రీ సమ్మక్క సారలమ్మ లను దర్శించుకున్న బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు



**ములుగు జిల్లా ప్రతినిధి, తెలంగాణ సేన న్యూస్ :** ఈ రోజు తాడ్వాయి మండలం లోని బయ్యక్క పేట గ్రామంలో, మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ వన దేవతల ను దర్శించుకొని అనంతరం అయన మాట్లాడుతూ మినీ మేడారం జాతర సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు ప్రభుత్వమే తగు జాగ్రత్తలు తీసుకోవాలని భక్తులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, పోరిక గోవింద నాయక్,కాకులమర్రి ప్రదీప్, మండల పార్టీ అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్, తాడూరి రఘు, వలీ బాబా, వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, సమ్మక్క సారలమ్మ పూజార్లు తదితరులు పాల్గొన్నారు.



## చలికాలంలో మీ ఇమ్యూనిటీ పవర్‌ను ఇలా పెంచుకోండి ఇంట్లోనే చ్యవన్ ప్రాశ్‌ను ఇలా తయారు చేయండి



చిన్నతనంలో చాలా మంది చ్యవన్‌ప్రాశ్ లేహ్యాన్ని తినే ఉంటారు. ఈ రోజుల్లో చాలా మంది దీన్ని తినడం లేదు కానీ ఇమ్యూనిటీని పెంచడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది. మార్కెట్‌లో మనకు పలు రకాల కంపెనీలకు చెందిన చ్యవన్ ప్రాశ్‌లు అందుబాటులో ఉన్నాయి. అయితే మార్కెట్‌లో ఉన్న చ్యవన్ ప్రాశ్‌లు వద్దనుకుంటే మీరు ఇంట్లోనే సులభంగా దీన్ని తయారు చేసుకోవచ్చు. ఇందులో అనేక రకాల ఆయుర్వేద మూలికలు కలుస్తాయి. దీన్ని రోజూ తింటే శరీర రోగ నిరోధక శక్తి పెరగడంతోపాటు అనేక లాభాలు కలుగుతాయి. ఇక చ్యవన్ ప్రాశ్ లేహ్యాన్ని ఎలా తయారు చేయాలి, దీని తయారీకి కావల్సిన పదార్థాలు ఏమిటి.. అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

చ్యవన్ ప్రాశ్ ప్రధాన ఉద్దేశం ఇదే..

అనేక రకల ఆయుర్వేద మూలికలను వేసి తయారు చేసే చ్యవన్ ప్రాశ్ అనేక బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది. చ్యవన్ అంటే ఒక ముని పేరు. ప్రాశ్ అంటే ప్రత్యేకమైన ఆహారం అని అర్థం. చ్యవన్ అనే ముని దీన్ని తయారు చేసినందున దీనికి చ్యవన్ ప్రాశ్ అనే పేరు వచ్చింది. చ్యవన్ ప్రాశ్‌ను చలికాలంలో కచ్చితంగా తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో అనేక ఆరోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు చ్యవన్ ప్రాశ్‌ను ఎవరైనా సరే తినవచ్చు. చ్యవన్ ప్రాశ్ ప్రధాన ఉద్దేశం రోగ నిరోధక వ్యవస్థను పటిష్ఠం చేయడమే. దీంతో శరీర సహజసిద్ధమైన శక్తి ఉత్తేజితం అవుతుంది. శరీరం ఎర్ర రక్త, తెల్ల రక్త కణాలను మరింత సమర్థవంతంగా ఉత్పత్తి చేసుకుంటుంది. అలాగే చ్యవన్ ప్రాశ్‌ను తినడం వల్ల గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే శ్లేష్మం పోతుంది. దీంతో శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. కనుక చలికాలంలో చ్యవన్ ప్రాశ్‌ను తప్పనిసరిగా తినాల్సి ఉంటుంది.


కావల్సిన పదార్థాలు..

చ్యవన్ ప్రాశ్ లేహ్యం తయారీకి గాను కంపెనీలు పొటాషియం సార్బేట్‌ను ఉపయోగిస్తాయి. ఇది ఒక ప్రిజర్వేటివ్. కానీ మనం ఇంట్లో తయారు చేసే చ్యవన్‌ప్రాశ్‌కు ఇది అవసరం లేదు. మనకు కావల్సినప్పుడు చ్యవన్ ప్రాశ్‌ను తయారు చేసుకుని వాడవచ్చు. చ్యవన్ ప్రాశ్ తయారీకి గాను తురమిన బెల్లం వాడాల్సి ఉంటుంది. అలాగే తేనె, ఇతర ఆయుర్వేద మూలికలు కూడా ఇందుకు అవసరం అవుతాయి. చ్యవన్ ప్రాశ్‌ను తయారు చేసేందుకు ఉసిరికాయలు 750 గ్రాములు, చక్కెర 750 గ్రాములు, తేనె 85 గ్రాములు, వెన్న పావు కిలో, నువ్వుల నూనె 75 ఎంఎల్, యాలకులు 25 గ్రాములు, త్రిఫల చూర్ణం 12 గ్రాములు, గుడుచి సత్వ 12 గ్రాములు, వంశలోచన్ 12 గ్రాములు, చందనం 10 గ్రాములు, పిప్పళ్లు 10 గ్రాములు, అల్లం (పొడి) 10 గ్రాములు, దశమూలం 5 గ్రాములు, బిర్యానీ ఆకులు 5 గ్రాములు, జాజికాయ 5 గ్రాములు, లవంగాలు 5 గ్రాములు, చైనీస్ దాల్చిన చెక్క 5 గ్రాములు, మిరియాలు 5 గ్రాములు, ప్రవాల భస్మం 2.5 గ్రాములు, మృగశృగ భస్మం 2.5 గ్రాములు, నాగకేసరం 2.5 గ్రాములు కావల్సి ఉంటుంది.

ఎలా తయారు చేయాలి..?

అన్ని పదార్థాలకు చెందిన పొడులను కలిపి ఒక గాజు పాత్రలో వేసి పక్కన పెట్టాలి. ఉసిరికాయలను బాగా కడిగి పొడిగా అయ్యే వరకు ఉంచాలి. ఉసిరికాయల్లోంచి గింజలను తీసేయాలి. ఉసిరికాయలను కుక్కర్‌లో వేసి 2 విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. తరువాత వాటిని పేస్ట్‌లా చేసి పక్కన పెట్టాలి. అనంతరం నాన్‌స్టిక్ పాన్ తీసుకుని అందులో వెన్న, నూనె, చక్కెర వేయాలి. అందులో ముందు సిద్ధం చేసుకున్న ఉసిరికాయ పేస్ట్‌ను వేసి బాగా కలపాలి. తరువాత స్టవ్‌ను చిన్న మంటపై పెట్టి ఉడికించాలి. దీంతో అందులో ఉన్న తేమ అంతా బయటకు పోతుంది. తరువాత ముందుగా సిద్ధం చేసి పెట్టుకున్న పొడులను వేసి బాగా కలపాలి. తరువాత స్టవ్ ఆఫ్ చేసి మిశ్రమం బాగా చల్లగా అయ్యే వరకు ఉంచాలి. అనంతరం ఆర్గానిక్ తేనె వేసి బాగా కలపాలి. తరువాత ఈ మిశ్రమాన్ని పొడిగా ఉండే గ్లాస్ బాటిల్‌లోకి తీసుకోవాలి. దీంతో చ్యవన్ ప్రాశ్ రెడీ అయినట్లే. దీన్ని మీరు కావల్సినప్పుడు తినవచ్చు. పెద్దలు దీన్ని రోజుకు ఒక టీస్పూన్ తినవచ్చు. పిల్లలకు అర టీస్పూన్ నుంచి పావు టీస్పూన్ సరిపోతుంది. ఎక్కువగా తింటే వేడి చేస్తుంది. ఇక చ్యవన్ ప్రాశ్‌ను తినడం వల్ల శరీరంలో వేడి పుడుతుంది కనుక దీన్ని కేవలం చలికాలంలోనే తినాలి. ఎండాకాలంలో తినకూడదు. ఇలా ఇంట్లోనే మీరు చ్యవన్ ప్రాశ్‌ను తయారు చేసి వాడవచ్చు.

## ఊగిసలాటలో మార్కెట్లు




దేశీయ స్టాక్ మార్కెట్లలో లాభనష్టాల దోబూచులాటలు కొనసాగుతున్నాయి. గతకొద్ది రోజులుగా పడుతూలేస్తూ పయనిస్తున్న సూచీలు.. గడిచిన వారం కూడా అదేదారిలో నడిచాయి. మదుపరులు అమ్మకాలు, కొనుగోళ్ల మధ్య ఊగిసలాడారు. అయినప్పటికీ ఆఖర్లో పెట్టుబడులకే పెద్దపీట వేశారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 685.68 పాయింట్లు లేదా 0.86 శాతం బలపడి 79,802.79 వద్ద ఆగింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 223.85 పాయింట్లు లేదా 0.93 శాతం పుంజుకొని 24,131.10 దగ్గర స్థిరపడింది. ఈ వారం విషయానికొస్తే.. రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు, గౌతమ్ అదానీ లంచం కేసు, విదేశీ మదుపరుల పెట్టుబడులు ప్రధానంగా ట్రేడింగ్‌ను ప్రభావితం చేయవచ్చు. అయితే ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)లో దేశ జీడీపీ గణాంకాలు నెమ్మదించడంపై మార్కెట్ రియాక్షన్ కీలకం కానున్నది. అంతేగాక నవంబర్ నెల వాహన విక్రయాలు ఆటో షేర్లపై ప్రభావం చూపవచ్చు. అలాగే డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు కూడా ముఖ్యమే. అమెరికాలో పెరిగిన ద్రవ్యోల్బణం, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లపై ఊహాగానాలనూ తోసిపారేయలేమన్న అంచనాలున్నాయి. దీంతో ఒడిదొడుకులు ఈ వారం కూడా తప్పవనే అనిపిస్తున్నది. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,500-24,700 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**గమనిక..**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

# సంఘాల మద్దతు సార్ కే

- మల్క కొమరయ్యకు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల మద్దతు
- ఇప్పటికే స్వచ్ఛందంగా ముందుకొచ్చిన11 సంఘాలు
- అత్యధిక సంఘాల మద్దతు పొందిన ఎమ్మెల్సీ అభ్యర్థి
- అన్ని జిల్లాల్లో కలిసివస్తున్న టీచర్లు, అధ్యాపకులు
- క్లీన్ ఇమేజ్, ప్రతిపక్ష అభ్యర్థి కావడం ప్లస్ పాయింట్స్





**హైదరాబాద్‌తెలంగాణ సేన న్యూస్ :** కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ పోరు తుది దశకు చేరుకున్న వేళ.. ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు బీజేపీ అభ్యర్థి మల్క కొమరయ్యకు మద్దతు ప్రకటిస్తున్నాయి. అతిపెద్ద సంఘంగా భావిస్తున్న పీఆర్టీయూ నుంచి ఇద్దరు అభ్యర్థులు బరిలో ఉండటం.. వారి పట్ల ఉపాధ్యాయ వర్గాల్లో కొంత వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో టీచర్లు మల్క కొమరయ్య వైపు మొగ్గ చూపుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఒక్కొక్కటిగా ఉపాధ్యాయ సంఘాలు కొమరయ్యకు స్వచ్ఛంద మద్దతు ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం, తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్, బీసీ టీచర్స్ అసోసియేషన్, తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్ స్వచ్ఛందంగా సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఆదివాసీ టీచర్స్ అసోయేషన్ కూడా మద్దతు ప్రకటించింది. ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ కూడా సంపూర్ణ మద్దతు ప్రకటించింది. తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్మటర్స్ అసోసియేషన్ మద్దతుకు ముందుకొచ్చింది. తెలంగాణ రీజినల్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేశ్ యాదవ్ మల్క కొమరయ్యకు సంఘం తరఫున మద్దతు ప్రతిని అందజేశారు. ఇలా ఇప్పటి వరకు రాష్ట్రంలో కీలకంగా ఉన్న 8 ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు మల్క కొమరయ్యకు మద్దతు ప్రకటించాయి.

### తాజాగా మరో మూడు

తాజాగా మరో మూడు సంఘాలు మల్క కొమరయ్యకు మద్దతు ప్రకటించాయి. రెండు రోజుల క్రితం నిర్మల్ జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం వెంగ్వాపేట్, నిర్మల్ జూనియర్ లెక్చరర్స్ ఫోరం, ఆర్ యూపీపీ సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు ఆయా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు మద్దతు పత్రాలను మల్క కొమరయ్యకు అందజేశారు.

### మద్దతు ప్రకటించిన సంఘాలు ఇవే

1. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం
2. తెలంగాణ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్
3. బీసీ టీచర్స్ అసోసియేషన్
4. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్
5. ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్
6. తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్మటర్స్ అసోసియేషన్
7. తెలంగాణ రీజినల్ టీచర్స్ యూనియన్
8. తెలంగాణ ఆదివాసీ టీచర్స్ అసోయేషన్
9. ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం, వెంగ్వాపేట్
10. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్
11. జూనియర్ లెక్చరర్స్ ఫోరం

క్లీన్ ఇమేజ్

పల్లవి విద్యా సంస్థల అధినేతగా మల్క కొమరయ్యకు క్లీన్? ఇమేజ్ ఉన్నది. పెద్దపల్లి జిల్లా బంధంపల్లిలో ఓ సాధారణ వ్యవసాయ కుటుంబంలో పుట్టి.. గత 40 ఏండ్లుగా శ్రమపడి విద్యాసంస్థలను స్థాపించి లక్షలాది మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ నివ్వడంతోపాటు వేలాది మంది టీచర్లకు ఉపాధి కల్పిస్తున్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే చందంగా.. అత్యంత సాధారణంగా ఉంటారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ స్థానం నుంచి పోటీ పడుతున్న ముగ్గురు ప్రధాన అభ్యర్థుల్లో క్లీన్ ఇమేజ్ ఉన్న నేతగా కొమరయ్య ఉపాధ్యాయవర్గాల్లో విశ్వాసం చూరగొన్నారు.

### ప్రచారంలో దూకుడు

ఇప్పటికే ఉపాధ్యాయ నియోజకవర్గం పరిధిలోని కొత్త జిల్లాలను చుట్టేసిన మల్క కొమరయ్య.. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి ఇలా.. ఎప్పుడు వీలైతే అప్పుడు ఉపాధ్యాయులను వ్యక్తిగతంగా కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. మార్నింగ్ వాక్స్, ఆత్మీయ సమ్మేళనాలు, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల జనరల్ మీటింగ్‌లకు హాజరవుతూ వారి మద్దతు కోరుతున్నారు. ఇప్పటి వరకు ఉపాధ్యాయవర్గాల్లో అంతర్గతంగా జరుగుతున్న సర్వేల్లో మల్క కొమరయ్యనే ముందు ఉన్నట్లు తెలుస్తున్నది.

# రాముడి వంశీకులమని కొందరు ఎందుకు చెప్పుకుంటున్నారు ?

## చరిత్ర, పురాణాల్లో ఏముంది






"ఇక్ష్వాకు కుల తిలకా.. ఇకనైన పలుకవే రామచంద్రా.." అంటూ సాగే భక్త రామదాసు కీర్తన తెలుగు వారికి బాగా పరిచితం. రాముణ్ణి తరచుగా ఇక్ష్వాకు వంశీకుడిగా పురాణాల్లో వర్ణిస్తూ ఉంటారు. తాజాగా మరోసారి ఇక్ష్వాకు వంశం పేరు వార్తల్లోకి వచ్చింది."భూమండలం అంతా ఇక్ష్వాకులదా కాదా? ఇక్ష్వాకుల గోత్రం ఏంటి?" అంటూ చిలుకూరు బాలాజీ ఆలయ పూజారి రంగరాజన్‌ను బెదిరిస్తూ 'రామరాజ్యం' సంస్థకు చెందిన వీర రాఘవ రెడ్డి మాట్లాడిన వీడియో ఈ మధ్య వైరల్ అయింది."ఇక్ష్వాకుల గోత్రం కూడా నీకు తెలియదు" అంటూ రంగరాజన్‌ను విమర్శించారు రాఘవ రెడ్డి.ఇంతకీ ఎవరీ ఇక్ష్వాకులు? ఏంటి వారి వంశం? అనేవి అర్థం కావాలంటే మూడు విషయాలు తెలియాలి. ఈ పదం మూడు చోట్ల ప్రముఖంగా వినిపిస్తుంది.హిందూ పురాణాల ప్రకారం రాముడి వంశాన్ని ఇక్ష్వాకు వంశం అంటారు. సూర్యుడి నుంచి ఆ వంశం ఏర్పడింది కాబట్టి సూర్య వంశం అని, రఘు అనే గొప్ప మహారాజు కూడా ఆ వంశీకుడే కాబట్టి రఘువంశం అని కూడా అంటారు.పురాణాల ప్రకారం.. రాముడి వంశంలో మొట్టమొదటి పాలకుడు అంటే అయోధ్య రాజధానిగా కోసల రాజ్యాన్ని పాలించిన వ్యక్తి ఇక్ష్వాకుడు. ఆ ఇక్ష్వాకుడు వైవస్వత మనువు కొడుకు. అలా వారి క్రమంలో 80వ రాజు రాముడు.ముచుకుంద, అంబరీష, భరత, బాహుబలి, హరిశ్చంద్ర, దిలీప, సగర, రఘు, దశరథ...ఇలా వీరంతా రాముడి కంటే ముందు ఇక్ష్వాకు వంశపు రాజులు."శ్రీరాముని వంశ వృక్షాన్ని రఘువంశ మహాకావ్యంలో వర్ణించారు. అది కాళిదాసు రాసిన సంస్కృత మహా కావ్యం. ఇక ఇక్ష్వాకుల వంశ మొదటి రాజుగా ఇక్ష్వాక చక్రవర్తే ఉంటారు. ఇక్ష్వాకు వంశంలో చివరి రాజుగా బృహద్బలుడి పేరు కనిపిస్తుంది. ఆయనే మహాభారతంలో కూడా కనిపిస్తారు. బృహద్బలుడు కౌరవుల తరపున భారత యుద్ధంలో పాల్గొన్నాడు" అని వాస్తు జ్యోతిష్య పండితులు, ఆధ్యాత్మికవేత్త పాలెపు రాజేశ్వర శర్మ బీబీసీతో చెప్పారు.రామాయణంతో పాటు వేదాల్లో కూడా ఇక్ష్వాకు పదం ప్రస్తావన ఉంది. వీటన్నింటిని హిందువుల విశ్వాసాలతో పాటు రామాయణం, భాగవతం, ఇతర పురాణాలు, రఘువంశం కావ్యం పేర్కొన్నాయి.హిందూ గ్రంథాలతో సంబంధం లేకుండా చారిత్రక ఆధారాలను బట్టి చూస్తే, భారతదేశంలో కొన్ని రాజ కుటుంబాలు ఈ పేరును ఉపయోగించుకున్నాయి.అయోధ్య ప్రాంతాన్ని క్రీస్తు పూర్వం 530 ప్రాంతంలో పాలించిన ప్రసేన్‌జిత్ అనే రాజు ఇక్ష్వాకు వంశీకుడని, అలాగే క్రీస్తు పూర్వం 345 ప్రాంతంలో పాలించిన సుమిత్రుడనే రాజు సూర్య వంశీకుడని చెప్పుకున్నట్టు కొందరు చరిత్రాకారులు రాశారు.అయితే ఈ ఇద్దరూ హిందూ పురాణాల్లోని ఇక్ష్వాకు వంశీకులే అనడానికి స్పష్టమైన ఆధారం లేదు.తెలుగునాట కూడా ఓ రాజ వంశానికి ఈ పేరు ఉంది. కృష్ణా నదీ తీరంలో శాతవాహనుల తరువాత పాలించిన రాజులు ఆంధ్ర ఇక్ష్వాకులు. వీళ్లనే విజయపురి ఇక్ష్వాకులు అని కూడా అంటారు.క్రీస్తు శకం 3-4 శతాబ్దాల్లో వీరు పాలించారని ఎక్కువ మంది చరిత్రకారులు చెప్పారు. ప్రస్తుత పల్నాడు జిల్లా మాచర్ల దగ్గర నాగార్జునకొండ వీరి రాజధాని. ఆంధ్ర, తెలంగాణల్లో పలు ప్రాంతాలను వీరు పాలించారు.రాముడి గురించి చెప్పే ఇక్ష్వాకు వంశానికీ వీరికీ సంబంధం ఉన్నట్టు పురాణపరంగా గానీ, చరిత్రపరంగా గానీ ఆధారాలు లేవు."శాతవాహనుల తరువాత ఆంధ్ర ఇక్ష్వాకులు తెలుగునేలను పాలించారు. హిందూ పురాణాల్లో ఇక్ష్వాకులు, వీరూ ఒకరని చెప్పడానికి ఏ ఆధారమూ లేదు" అని చరిత్రకారులు శ్రీరామోజు హరగోపాల్ బీబీసీతో చెప్పారు."నేటికి 2500 ఏళ్ల క్రితమూ, 1700 సంవత్సరాల కిందటా పాలించిన కొందరు రాజులు తమను తాము ఇక్ష్వాకులు అని చెప్పుకున్నారు. కానీ చరిత్రలోని ఇక్ష్వాకులు, పురాణాల్లోని ఇక్ష్వాకులు ఒకరే అని చెప్పే ఆధారాలు లేవు. అసలు హిందూ పురాణాల్లో ఇక్ష్వాకులుగా చెబుతున్నవారు నిజంగా చరిత్రలో ఉన్నారా? అనే దానికి సైతం స్పష్టమైన ఆధారాలు లేవు. ఇక ఇన్ని వందల సంవత్సరాల తరువాత ఇక్ష్వాకు వంశం వారు ఇంకా ఉన్నారా అంటే సాక్ష్యాలు, ఆధారాలు ఉండవు" అంటున్నారు చరిత్రకారులు హరగోపాల్.జైన సాహిత్యంలోని స్వయంభూ స్తోత్రంలో 1-3-3 శ్లోకంలో 'భగవంతుడైన రిషభదేవుడు ఇక్ష్వాకు వంశానికి మొదటి రాజు' అని రాశారు. ఆయన్నే ఇక్ష్వాకుడు అని జైనులు పిలుస్తారు.రిషభదేవుడు లేదా రిషభనాథుడు జైనుల్లో మొదటి తీర్థంకరుడు. ఈయన్ను జైన మత స్థాపకుడిగా పరిగణిస్తారు.ఇక బౌద్ధంలో కూడా ఇక్ష్వాకు వర్ణనలు ఉన్నాయి. భారత్‌తో పాటు టిబెట్ బౌద్ధ సంప్రదాయాల్లో ఇక్ష్వాకుకు సమానార్థకమైన పదాలతో రాజ వంశాల వర్ణన బౌద్ధ సాహిత్యంలో కనిపిస్తుంది.

### ఇక్ష్వాకులు ఇప్పుడు ఉన్నారా?

"ఏ కులం వారైనా ఇక్ష్వాకులు అని చెప్పడానికి ఏ ఆధారమూ లేదు. ఇక్ష్వాకు వంశం ఇప్పటి వరకూ కొనసాగి, ఆ వంశం వారు ఎవరో ఒకరు ఇంకా ఉన్నారనడానికి చెప్పే అవకాశం లేదు. ఎవరైనా చెప్పుకున్నా దానికి సాక్ష్యం ఉండదు. ఈ మధ్య కాలంలో చాలామంది తమ కులం, కుటుంబ గతం ఘనమైనది అని చెప్పుకునే క్రమంలో రాజరికాన్ని ఆపాదించుకుంటున్నారు. వారికి నిజంగా ఘన చరిత్ర ఉందా లేక లేనిదాన్ని ఘనంగా చెప్పుకుంటున్నారా అన్నది చూడాలి" అన్నారు హరగోపాల్."ఒకసారి ఒకరు రాజరికం పొందాక తమను తాము కాని, లేదా వారి ఆస్థానంలోని వారు కాని ఈ రాజులకు దైవత్వం ఆపాదించడం, సూర్య, చంద్ర వంశాల వారంటూ కీర్తించడం భారత చరిత్రలో బాగా కనిపిస్తుంది. దీన్నే శాసనాల్లో, గ్రంథాల్లో రాజ ప్రశస్తి అంటారు" అని శ్రీరామోజు హరగోపాల్ చెప్పారు.

# పులికాట్ సరస్సు నుంచి పురుగుల స్మగ్లింగ్, ఏమిటిది ?








వినడానికి ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ చూడటానికి వానపాముల్లా కనిపించే పాలీకేట్ అనే జీవుల అక్రమ రవాణా పులికాట్ నుంచి జోరుగా సాగుతోంది.దీని వల్ల పులికాట్ సరస్సు దెబ్బతినడం తోపాటు, చేపలు తగ్గి మత్స్యకారులకు ఉపాధి పోవడం, వలస పక్షుల రాక తగ్గడం వంటి సమస్యలు కూడా వస్తున్నాయి.

### ఈ చిన్న జీవులను ఎందుకు స్మగ్లింగ్ చేస్తున్నారు?

వానపాముల్లా కనిపించే పాలికేట్ పురుగులు లేదా బ్రిజిల్ పురుగులు పులికాట్ సరస్సులో చాలా ఎక్కువగా ఉంటాయి. వానపాముకు కాళ్లుండవు. వీటికి చూడటానికి కాళ్లుంటాయి."బ్రాకిష్ వాటర్‌లో పెరిగే చేపలు, రొయ్యలు, పీతలు వంటి వాటికి ఈ పురుగులు ప్రధాన ఆహార వనరు. ఆక్వాటిక్ ఎకో సిస్టంలోని ఆహార గొలుసులో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి" అని మెరైన్ బయాలజిస్ట్ డా. టీడీ బాబు బీబీసీతో చెప్పారు.పాలికేట్ పురుగులను వానపాము లనుకుని చాలామంది గందరగోళపడతారు. చూడటానికి ఈ పాలికేట్లు కూడా వానపాముల్లానే ఉంటాయి. కానీ వానపాములు భూమిలో ఉంటాయి. పాలికేట్లు నీటి జీవులు. వీటికి జెర్రి తరహాలో కాళ్లు ఉంటాయి. సూళ్లూరుపేట స్థానికులు వానపాములను పిలిచినట్టే వీటిని కూడా ఎర్రలు అని పిలవడం వల్ల గందరగోళం పెరిగి, పత్రికలు కూడా వీటిని వానపాములనే రాస్తున్నాయి. పులికాట్‌లో రొయ్యలు, చేపలు వీటిని తిని ఎదుగుతాయి. ఆ చేపలను మత్స్యకారులు పట్టుకుంటారు. కానీ ఇప్పుడు కోస్తా ఆంధ్రలోని రొయ్యల హేచరీల కన్ను ఈ పురుగుల మీద పడింది. అంతే పులికాట్‌ను గుల్ల చేసేలా పెద్ద ఎత్తున అక్రమ మార్గాల్లో వీటిని సేకరించి స్మగ్లింగ్ చేస్తున్నారు. కొందరు ఇదే పనిగా కూలీలను పెట్టి, ఈ పురుగులను సేకరించి, రహస్యంగా ఎగుమతి చేసి, హేచరీలకు అమ్ముతున్నారు.

### పులికాట్ సరస్సు

ఈ పురుగులను పులికాట్ సరస్సు నుంచి వెలికి తీసే కూలీలకు రోజుకు సుమారు వెయ్యి రూపాయల వరకూ ఇస్తారు. కొందరు సేకరించిన జీవులను బట్టి కేజీల ప్రకారం కూడా ఇచ్చేవారు. అయితే స్మగ్లర్లు వాటిని ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు స్థానిక పాత్రికేయులు కొందరు బీబీసీతో చెప్పారు.ఆంధ్రలో రొయ్యల చెరువులు ఎక్కువగా ఉంటాయి. వాటికి కోట్లలో రొయ్య పిల్లలు కావాలి. సముద్రాల నుంచి తల్లి రొయ్యను సేకరించి, అవి పిల్లల్ని పెట్టే విధంగా చూసి, ఆ రొయ్య పిల్లలను హేచరీల వారు ఆక్వా రైతులకు అమ్ముతారు. అయితే ఆ తల్లి రొయ్య బాగా ఎదగడానికి, తొందరగా పిల్లలు పెట్టడానికి మంచి మేత కావాలి."ఆ తల్లి రొయ్య తొందరగా ఎదగడం కోసం మంచి పోషకాలున్న ఆహారం ఇవ్వాలి కాబట్టి ఈ జీవులను అక్రమంగా, రహస్యంగా సేకరించి వాటిని మేతగా వేస్తున్నారు. ఈ పాలికేట్లలో పాలీ అన్‌శాచ్యురేటెడ్ ఫాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. దీంతో తల్లిరొయ్యలు తొందరగా ఎదగడానికి, ఎక్కువసార్లు పిల్లల్ని పెట్టడానికి ఇవి ఉపయోగపడతాయి. వాస్తవానికి వీటిని విదేశాల నుంచి కూడా కొందరు దిగుమతి చేసుకుంటారు. అయితే ఫ్రోజెన్ పాలీకేట్లు దిగుమతి చేసుకోవడం కన్నా ఇక్కడ పులికాట్ సరస్సు నుంచి సేకరించడం చవక కావడంతో హేచరీలు ఈ పనిచేస్తున్నాయి" అని బీబీసీతో చెప్పారు డా. టీడీ బాలు.పాలీకేట్ జీవుల అక్రమ రవాణాతో వలస పక్షుల రాకపై ప్రభావం పడుతుందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.నేషనల్ బయోడైవర్సిటీ చట్టం 2002 ప్రకారం పాలికేట్ల సేకరణ నేరం. అంతేకాదు, వీటిని నిరంతరం ఏరేయడం ద్వారా చేపలు, రొయ్యల సంఖ్య కూడా తగ్గి, పరోక్షంగా మత్స్యకారులను కూడా దెబ్బతీ స్తుందని పర్యావరణవేత్తలు చెబుతున్నారు."ఇలా వీటిని సేకరిస్తూ పోతే ఈ పులికాట్ ఎకో సిస్టమ్ మొత్తం దెబ్బతింటుంది. ఇక్కడుండే నీటి జీవులకు ఇక ఆహారం మిగలదు. వాటిని సేకరించే క్రమంలో సరస్సు అడుగు భాగాన్ని కలబెట్టేస్తున్నారు. ఆ ప్రాంతాన్ని బెంతిక్ జోన్ అంటారు. దాన్ని ధ్వంసం చేస్తున్నారు. అనేక చిన్న జీవులను చంపుతూ, వాటి ఆవాసాలను ధ్వంసం చేస్తున్నారు" అని బాబు చెప్పారు."ఈ జీవుల వేట ఆపాలి. లేకపోతే ప్రకృతికి నష్టం. వలస పక్షులు రావడం ఆగిపోతుంది. సరస్సు దెబ్బతింటుంది. మత్స్యకారులకు కూడా ఉపాధి ఉండదు" అని తడ ప్రాంతానికి చెందిన ఉస్మాన్ బాషా అనే ప్రకృతి ప్రేమికుడు బీబీసీతో చెప్పారు.


### లెక్కకు తేలని అక్రమ రవాణా

మరికొందరు మాజీ వ్యాపారుల మాట భిన్నంగా ఉంది. గతంలో కంటే ఈ ఎగుమతులు కాస్త తగ్గాయని వారు అంటున్నారు."చెన్నై నుంచి కూడా ఈ తరహా జీవుల దిగుమతి పెరిగింది. అలాగే, విదేశాల నుంచి దిగుమతి చేసుకునే వారు, హేచరీల్లోనే సొంతంగా వీటిని పెంచుకునే వారు పెరిగారు" అని సూళ్లూరుపేటకు చెందిన ఒక వ్యాపారి బీబీసీతో చెప్పారు. పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఆయన గతంలో ఈ పాలీకేట్ల అక్రమ ఎగుమతుల్లో భాగస్వామి."గతంలో కన్నా ఇప్పుడు కాస్త తగ్గింది అని మాత్రం చెప్పగలను. ఇప్పటికీ నెలకు కొన్ని లక్షల రూపాయల విలువైన అక్రమ రవాణా జరుగుతోంది. అయితే క్రమంగా హేచరీలు సొంతంగా పెంచుకోవడం వల్ల ఇక్కడ డిమాండ్ కాస్త తగ్గింది" అని ఆయన అన్నారు.ఈ అక్రమ రవాణా దాదాపు దశాబ్ద కాలానికి పైగా జరుగుతోంది. ఎంత మొత్తంలో ఈ దందా జరుగుతోంది, ఎంత మొత్తంలో ఎగుమతి అవుతున్నాయి అనేదానికి ఎక్కడా స్పష్టమైన లెక్కలు లేవు. స్మగ్లర్లను అధికారులు పట్టుకున్నప్పుడు మాత్రమే ఆ కొద్ది వివరాలు బయట పడుతున్నాయి.ఈ అక్రమ రవాణా పరిమాణాన్ని బీబీసీ స్వతంత్రంగా నిర్ధరించలేదు.స్మగ్లర్లు, వారి ఏజెంట్లు పులికాట్ పరిసర గ్రామాల్లోని మత్స్యకారులు, కూలీలతో ఒప్పందం చేసుకుంటున్నారు. వేనాడు, ఇరకం దీవులు సహా తడ, సూళ్లూరుపేట, అరంబాక్కం (తమిళనాడు) ప్రాంతాల్లోని వారు ఈ పనుల్లో దిగుతున్నారు. వారంతా చేపలవేటకు వెళ్లినట్టుగా పడవలో వెళ్లి, సరస్సు మధ్యలో పడవ ఒకచోట ఆపి, నీటిలో దిగి ఈ పురుగులను సేకరిస్తారు. చూసేవారికి వారు చేపలవేటకు వెళ్తున్నట్టే కనిపిస్తుంది.అలా సేకరించిన వాటిని బతికి ఉండగానే కొన్ని నీళ్లు నింపిన ప్లాస్టిక్ సంచుల్లో ప్యాక్ చేస్తారు. తరువాత వాటిని థర్మాకోల్ బాక్సులు లేదా ఇతర ప్లాస్టిక్ కంటైనర్లలో పెట్టి, ట్రావెల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు వంటి వాటిలో రవాణా చేస్తున్నారు. కొందరు కుండల్లో కూడా పంపుతారు. లైవ్ కాకుండా ప్యాక్ చేసి పంపేవారు కూడా ఉంటారు."కొందరు హేచరీల వారు ఈ పాలీకేట్లను తమ హేచరీల్లోనే పెంచుకుంటున్నారు. ప్రభుత్వాలు ఈ తరహా విధానాలను ప్రోత్సహించవచ్చు. దానివల్ల సరస్సుల నుంచి సేకరించడాన్ని ఆపవచ్చు." అని మెరైన్ బయాలజిస్ట్ డా. బాబు చెప్పారు. "ఈ సమస్యలన్నీ వద్దనుకుని హేచరీల వారు కొందరు తమ ప్రాంగణంలోనే వీటిని కల్చర్ చేస్తున్నారు. వానపాములను ఎలా పెంచుతారో, అలా వీటి కోసం బాగా చిన్న చెరువుల్లాంటివి నిర్మించి పెంచుతున్నారు" అని ఒక రొయ్య పిల్లల హేచరీలో పనిచేసే టెక్నీషియన్ ఒకరు బీబీసీతో చెప్పారు.

### పులికాట్ సరస్సు

అటవీ శాఖ సిబ్బంది ఈ అక్రమ రవాణాపై అప్పుడప్పుడు దాడులు చేసి కొందరిని పట్టుకుంటారు. కానీ అలాంటి సంఘటనలు చాలా తక్కువగా జరిగాయి. దీనిపై బీబీసీ సూళ్లూరుపేట అటవీ శాఖ వన్యప్రాణి సంరక్షణ విభాగం అధికారులను సంప్రదించింది. వారు స్పందించడానికి సమయం కోరారు. వారి స్పందన రాగానే ఇక్కడ తెలియచేస్తాం.

# మొక్కలు, పూలు, కుండీల మాటున వచ్చే జంతువులతో ఎంత ప్రమాదమో తెలుసా?



కప్పలు, బల్లులు, పాములు, సాలెపురుగులు, ఇతర క్రిమి కీటకాలను కోసిన పూలు, చిన్నచిన్న కుండీల్లో పెంచే చెట్ల ద్వారా ప్రపంచవ్యాప్తంగా రవాణా అవుతున్నాయని, వీటివల్ల ప్రకృతికి హాని కలుగుతుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు.ఇలా తరలివస్తున్న జీవులలో... షెఫీల్డ్‌లోని ఒక పూల దుకాణంలో గులాబీ పూల నుంచి బయటపడ్డ కప్ప, యూరప్ ప్రధాన భూభాగంలో అలంకరణకు ఉపయోగించే ఆలివ్ మొక్కలలో పాములు దొరికాయి.ఇలా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలివచ్చే జంతువులు, కీటకాలతో పంటలకు, గ్రామీణ ప్రాంతాల్లోని భూభాగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ పరిశోధకులు చెప్పారు.మొక్కలకు, దుంపలకు, పూలకు ప్రపంచ మార్కెట్లలో బాగా డిమాండ్ ఉన్న సమయంలో, రవాణా ప్రమాణాలను తక్షణం మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు.

"ఇలా తరలి వచ్చే జీవుల్లో పాములు, బల్లులు కేవలం చిన్న భాగం మాత్రమే" అని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ విల్లియం సదర్లాండ్ చెప్పారు. ఇవే ఇలా ఒకదేశం నుంచి మరో దేశానికి రాగలుగుతున్నప్పుడు ఇక చిన్నచిన్న కీటకాలు, ఫంగీలను గుర్తించే అవకాశం ఎంత?- అవి నిజంగా సమస్యలకు కారణం కావా? అని ప్రశ్నించారు.భౌగోళికంగా ముఖ్యంగా తూర్పు ఆఫ్రికా, దక్షిణ అమెరికాలో అలంకరణ మొక్కల ఉత్పత్తి చాలా వేగంగా విస్తరించింది.చట్టాలు, సరిహద్దుల్లో తనిఖీలు ఉంటున్నప్పటికీ..పెద్ద ఎత్తున సాగే పూలు, అలంకరణ మొక్కల వాణిజ్యంతో దాని ద్వారా వచ్చే క్రిమి కీటకాలను, వ్యాధులను అడ్డుకోవడం చాలా కష్టమని కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన డాక్టర్ సిల్వియు పెట్రోవాన్ చెప్పారు.


షెఫీల్డ్‌లో ఒక పూల దుకాణంలో బతికున్న కప్పను గుర్తించాలని ఒకసారి క్షీరదాల నిపుణుడిని పిలిచారు.ఆయన దాన్ని ఫ్రాంక్ అనుకున్నారు. కానీ, నిజంగానే ఈక్వెడార్ మీదుగా కొలంబియా నుంచి వచ్చిన గులాబీల్లో ట్రీ-ఫ్రాగ్ (ఎక్కువ కాలం చెట్లపై పెరిగే కప్ప)ను గుర్తించి తాను షాకైనట్లు సదరు నిపుణుడు తెలిపారు.బ్రిటన్‌లో కప్పలు, బల్లులు, క్రిమి కీటకాలు ప్రధానంగా ట్రాన్స్‌పోర్ట్ అవుతున్నాయి. యూరప్‌లో, ఎన్నో అరుదైన సరీసృపాలు, ఉభయచర జీవులు దొరుకుతున్నాయి.కుండీల్లో పెంచే ఆలీవ్ మొక్కలలో గుర్తిస్తున్న జీవులు, జంతువులు.బల్లులు, యూరోపియన్ భూభాగంలో ఉండే పలు రకాల పాములు కప్పలు, కప్పలు మాదిరి ఉండే జీవులు పెద్ద సంఖ్యలో క్రిమి కీటకాలు అదొక అడవి దున్నల పుర్రెల పర్వతం, దాని వెనుక ఓ దారుణమైన కుట్ర కథ.

బయోసైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఒక రీసర్చ్ పేపర్‌లో, 2017-18 మధ్య కాలంలో నెదర్లాండ్స్‌లో కస్టమ్ అధికారుల తనిఖీల్లో అలంకరణ మొక్కల్లో దొరికిన కీటకాల రికార్డులను ఒక టీమ్ పరిశీలించింది.తమ పరిశీలనలను 2021-23లో యూకేలోని పర్యావరణం, ఆహారం, గ్రామీణ వ్యవహారాల విభాగానికి రిపోర్టు చేసింది.ఉత్పత్తి ప్రమాణాలను మెరుగుపర్చాలని, వాణిజ్యంలో ఉన్న నిర్దిష్ట ప్రమాదాల డేటాను సేకరించి,షేర్ చేయాలని వారు కోరారు.

# ఆదాయాన్నిచ్చే రిజిస్ట్రేషన్ వ్యవస్థపై మరింత శ్రద్ధ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమైన మూడవ అతిపెద్ద (11శాతం వాటా) ఆదాయాన్ని ఆర్జించే విభాగం రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల విభాగం. 1864 సంవత్సరం నుండి పనిచేస్తున్న ఈ శాఖ....

ఆదాయాన్నిచ్చే? రిజిస్ట్రేషన్ వ్యవస్థపై మరింత శ్రద్ధ




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమైన మూడవ అతిపెద్ద (11శాతం వాటా) ఆదాయాన్ని ఆర్జించే విభాగం రిజిస్ట్రేషన్ మరియు స్టాంపుల విభాగం. 1864 సంవత్సరం నుండి పనిచేస్తున్న ఈ శాఖ లక్ష్యం ఆస్తులకు రిజిస్టర్డ్ పత్రాల ద్వారా హక్కు కల్పించి రక్షించడం. స్టాంప్ డ్యూటీ, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల ద్వారా ఈ విభాగం రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని సేకరిస్తోంది. కానీ ప్రస్తుత రిజిస్ట్రార్ కార్యాలయాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. అనేక కార్యాలయాలు అద్దె భవనాలలో కనీస సౌకర్యాలు కూడా లేకుండా కొనసాగుతున్నాయి. విజయవాడ నగరంలో అత్యధిక రిజిస్ట్రేషన్లు జరిగే కార్యాలయం అయిన పటమట రిజిస్టర్ ఆఫీసులో కనీసం తాగునీరు కూడా సరిగ్గా దొరకదు.రిజిస్ట్రార్ ఆఫీసుల్లో దస్తావేజుకు రూ.500 యూజర్స్ చార్జెస్ వసూలు చేస్తున్న పరిస్థితి ఉన్నది. ఈ ఛార్జీల ద్వారా లభించే ఆదాయాన్ని కూడా రిజిస్ట్రేషన్ శాఖ ప్రయోజనాల కోసం వాడటం లేదు. దస్తావేజు రైటర్స్ వ్యవస్థకు మరో మంచి ప్రత్యామ్నాయాన్ని ఏర్పాటు చేయగలిగితే దళారీల పాత్రను తగ్గించవచ్చు. పూర్వం లాగే డాక్యుమెంట్ రైటర్లకు లైసెన్సులు ఇవ్వాలి. రిజిస్ట్రేషన్ సేవలు పొందే సమయంలో ప్రజలు కార్యాలయాల వద్ద ఎండలో, వానలో రోడ్ల మీద వేచి చూడాల్సిన పరిస్థితి ఉన్నది. ఈ ఆఫీసులలో కనీస సౌకర్యాలను తక్షణం పెంచాలి. రాష్ట్ర ఆదాయంలో ముఖ్య పాత్ర పోషించే రిజిస్ట్రేషన్ ఆఫీసులను మెరుగుపరచాలి.రాష్ట్రానికి నిర్దిష్ట ఏపీ స్టాంప్ చట్టం అవసరం. కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు తమ రాష్ట్ర చట్టానికి సవరణ ద్వారా అదనపు ఆదాయాన్ని సేకరించేందుకు వీలుగా స్వంత స్టేట్ స్టాంప్ చట్టాన్ని కలిగి ఉన్నాయి. కానీ మనం ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వ చట్టాన్ని అమలు చేస్తున్నాం. ఇండియన్ స్టాంప్ చట్టం 1899 నాటిది కాబట్టి పార్లమెంటు అనుమతి లేకుండా మేము సవరించలేకపోతున్నాం అని రిజిస్ట్రేషన్ శాఖ చెపుతుంది. ప్రభుత్వం దీనిపై సమీక్ష జరపాలి. ఏపీ కోసం కొత్త స్టాంప్ చట్టాన్ని తీసుకురావాలి.రాష్ట్ర ఖజానాకి భవిష్యత్తులో సంవత్సరానికి అదనంగా దాదాపు రూ.1000కోట్లు రాబడి తేవాలంటే రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్‌కు నిర్దిష్ట స్టాంప్ చట్టం అవసరం. దీనిని ప్రజలపై పన్ను భారంగా భావించరాదు. అట్లాగే కొత్త భవన నిర్మాణాలకు యూజర్ చార్జీలు కింద వసూలయ్యే మొత్తంలో కొంత వినియోగించుకోవాలి. రాష్ట్రంలో మొత్తం రిజిస్ట్రార్ కార్యాలయాలు 294 కాగా వీటిలో దాదాపు సగం భవనాలు అద్దె భవనాలలోనే ఉన్నాయి. రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్న ప్రభుత్వ భవనాలు కూడా శిథిలమైన స్థితిలో ఉన్న పరిస్థితి. అద్దె భవనాలు కూడా సరైన సౌకర్యాలతో సక్రమంగా లీజుకు తీసుకోబడలేదు. అలానే రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులు 2500కు గానూ ప్రస్తుతం సుమారు 1800 మాత్రమే ఉన్నారు. ఉద్యోగుల కొరత కారణంగా ఈ ఆఫీసులలో అనధికారిక వ్యక్తుల ప్రమేయం పెరుగుతున్నది. స్కానింగ్, కేవైసీ ఆధార్ సీడింగ్ మొదలైన వాటి కోసం ప్రైవేట్ వ్యక్తులపై ఆధారపడవలసి వస్తోంది. అడ్వాన్స్‌డ్ కంప్యూటర్లు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం లేదు. ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడేందుకు సిబ్బందికి సరైన శిక్షణ లేదు. చిన్న చిన్న సర్వర్ సమస్యల కోసం ప్రైవేట్ కాంట్రాక్టర్లపై ఆధారపడాల్సి వస్తున్నది. దీనివల్ల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన సాధారణ ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.ఈ - స్టాంప్ విధానం కోసం రాష్ట్ర ప్రభుత్వం స్టాక్ హోల్డింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం కుదుర్చుకుంది. స్టాంప్‌ల కొరత, నకిలీ స్టాంప్‌ల విక్రయం, ట్యాంపరింగ్.. వంటి సమస్యలకు ఈ-%-%స్టాంప్ చెక్ పెడుతుందంటున్నారు అధికారులు. నాన్ జ్యుడిషియల్‌కు ఉన్న చట్టబద్ధత ఈ -స్టాంపుకూ ఉంటుంది. స్టాంప్ వెండర్లతో పాటు కామన్ సర్వీస్ సెంటర్లలో ఈ%-%-స్టాంప్‌లు అందుబాటులో ఉంటాయి. తమకు ఎంతో కొంత కమిషన్ వచ్చేలా చూస్తే కొత్త విధానం ఎంతో బాగుంటుందని స్టాంప్ వెండర్లు చెబుతున్నారు. స్టాంప్ పేపర్ల తయారీ ఖర్చు భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశముంది.గత ప్రభుత్వ హయంలో రిజిస్ట్రేషన్ శాఖలో చోటుచేసుకున్న చలానాల కుంభకోణాన్ని ఛేదించే క్రమంలో ఆశ్చర్యగొలిపే విషయాలు వెలుగులోకి వచ్చాయి. కడప సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ కుంభకోణం మొదట వెలుగుచూసింది. రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 2018 నుంచి ఆన్‌లైన్ ద్వారా అప్లోడ్ చేసిన చలాన్లను అధికారులు పరిశీలించి దాదాపు అన్ని జిల్లాల్లోనూ అవకతవకలు ఉన్నట్లు గుర్తించారు. ప్రజల వెసులుబాటు కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన సీఎంఎఫ్ఎస్ విధానం అక్రమార్కులకు అందివచ్చిన అవకాశంగా మారింది. ఈ విధానంలో కంప్యూటర్ ద్వారా వచ్చే చలానాలపై అధికారుల ధ్రువీకరణ సంతకాలు, సీళ్లు ఉండవు. నకిలీ చలానాలు సృష్టించడానికి ఇది అనువుగా మారింది. చలానా కట్టిన అనంతరం రిజిస్ట్రేషన్ చెల్లింపు మొత్తాన్ని ఎడిట్ చేసుకునే సాంకేతిక పరిజ్ఞానాన్ని అక్రమార్కులు వాడుకున్నారని ప్రచారం జరుగుతోంది. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద రైటర్స్‌గా పనిచేసిన వ్యక్తులే కోట్లాది రూపాయల ప్రభుత్వాదాయానికి గండి కొట్టారని పోలీసులు గుర్తించారు. కృష్ణా జిల్లా మండవల్లి, నెల్లూరు జిల్లా నాయుడుపేట, పశ్చిమగోదావరి జిల్లా తణుకు, కర్నూలు జిల్లా నంద్యాల, గుంటూరు జిల్లా మంగళగిరి, విజయవాడ గాంధీనగర్, విశాఖ జిల్లా లంకెలపాలెం వంటి ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు నకిలీ చలానాలను, నగదును స్వాధీనం చేసుకున్నారు.గత వైసీపీ ప్రభుత్వం ప్రయోగాత్మకంగా గ్రామ సచివాలయాల ద్వారా ఆస్తుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టింది. ఈ విధానం ద్వారా ప్రజల కష్టాలు పూర్తిగా తీరిపోతాయని చెబుతూ%-% సచివాలయ ఉద్యోగులకు సరైన శిక్షణ ఇవ్వకుండా, అరకొర సదుపాయాలతో ఈ కార్యక్రమం ప్రారంభించారు. అయితే ఈ ప్రయోగాల వల్ల గ్రామ సచివాలయంలోని ఉద్యోగులపై ఒత్తిడి పెరిగింది తప్ప మరే సత్ఫలితమూ సమకూరలేదు. గత రెండున్నర ఏళ్ల కాలంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కేవలం 110 ఆస్తుల రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లను పూర్తిగా రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ స్టాంపుల విభాగంలో లోపాలను, లొసుగులను పూర్తిగా ప్రక్షాళన చేస్తుందని, కనీస సౌకర్యాలు మెరుగుపరుస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు. సుదీర్ఘ పాలనానుభవం, దక్షత ఉన్న చంద్రబాబునాయుడి ద్వారానే రిజిస్ట్రేషన్ శాఖలో సంస్కరణలు సాధ్యమని ప్రజలు భావిస్తున్నారు.

# ఓటమి నేర్పే పాఠం








జీవితంలో ఓడిపోతే.. ఎవరేంటో తెలుస్తుంది. నువ్వేంటో అర్థమవుతుంది. ప్రపంచం ఏమిటో తెలిసొస్తుంది. విజయం అనే పదార్థానికి ఓటమి కొత్త రుచిని అందిస్తుంది. ప్రతీ ఎదురుదెబ్బ.. మళ్లీ పుంజుకోవడానికి అవసరమైన అవకాశాన్ని ఇస్తుంది. అంతకుముందుతో పోలిస్తే గొప్పగా నిలవడానికి దోహదం చేస్తుంది. ఓటమి ఎరుగని వ్యక్తితో పోలిస్తే.. వైఫల్యాలతో పడిలేచిన మనిషే దృఢంగా ఉంటాడు. అందుకే ఓటములకు బెంబేలెత్తిపోకండి. పరాజయాలను గుండెకు హత్తుకోండి. ఫెయిల్యూర్ నేర్పిన పాఠం ఒంటబట్టించుకుంటే.. జీవన సమరంలో అంతిమ విజేత మీరే! 'విజయం వరించినప్పుడు సంబురాలు చేసుకోవడం మంచిదే! కానీ, ఓటమి పాఠాలు నేర్చుకోవడం అంతకంటే ముఖ్యం' అంటాడు మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, వితరణశీలి బిల్ గేట్స్. విజయవంతైన ఏ వ్యక్తి కథయినా సాదాసీదాగా సాగిపోదు. అందులో వాళ్లు ఎదుర్కొన్న అవమానాలు, గాయాలు, కష్టాలు, వేదన, మానసికంగా నలిగిపోవటాలు.. ఇలా ఎన్నెన్నో అనుభవాలు కనిపిస్తాయి. జీవితంలో ఎదురైన పరాజయాలే తమకు అద్భుతమైన తెలివితేటలు నేర్పాయనీ, తర్వాత ప్రయాణంలో తారసపడిన ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే శక్తియుక్తులు ఇచ్చాయనీ విజేతల మాట! ఉలి దెబ్బలు ఓర్చుకున్న శిల.. అందమైన శిల్పంగా మారినట్టు, ఓటమి నేర్పిన పాఠాలు.. మనిషిని ఉన్నతుడిగా, అజేయుడిగా నిలబెడతాయన్నమాట! ఏదో ఒక రూపంలో ప్రతిఘటన ఎదురుకాకపోతే.. జీవితంలో మజా రాదు. ఎన్నో కోతలకు గురైతే గానీ వజ్రం విలువ పెరగదు! తీవ్రమైన యాతనలు ఎదురైనా తట్టుకున్నప్పుడే మన విలువ అపరిమితంగా పెరుగుతున్నది సత్యం.

### ఏది విజయం? ఏది అపజయం?

పరీక్షల్లో తక్కువ గ్రేడ్ రావడం, పరీక్ష తప్పటం, ఇంటర్వ్యూకి పిలుపు రాకపోవడం, వచ్చినా ఉద్యోగం పొందలేకపోవడం, వృత్తివ్యాపారాల్లో ఎదురీతలు, కష్టానికి తగిన ప్రతిఫలం పొందకపోవడం, జీవితంలో అగచాట్లు.. ఇవన్నీ వైఫల్యాలు అనుకోవచ్చు. ప్రఖ్యాత విశ్వవిద్యాలయంలో సీటు రావడం, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో భారీ వేతనంతో ఉద్యోగం పొందడం, కెరీర్‌లో ఊహించనంతగా ఎదగడం, సవాళ్లు ఎదురైనా మీ నిజాయతీని కాపాడుకోవడం, కీర్తి ప్రతిష్ఠలు పొందడం, అందరి ఆదరాభిమానాలు సంపాదించడం, మరిన్ని అవకాశాలను అందుకోవడం ఇవన్నీ గెలుపుబాటలో మైలురాళ్లుగా చెప్పుకోవచ్చు. వైఫల్యం వచ్చినంత మాత్రాన జీవితం ముగిసినట్టుకాదు. ఒక్క విజయంతో అన్నీ సాధించానని అనుకోవడం ఎలా తప్పో.. ఒక్క అపజయంతో అన్నీ కోల్పోయానని కుంగిపోవడమూ సమంజసం కాదు. అయితే ఓటమి మొదట నిరాశకు గురిచేస్తుంది. అయినవారు కూడా చులకనగా చూస్తారన్న భావన కలిగిస్తుంది. ఆ ఆవేదనలోనే కూరుకుపోతే బతుకు పరుగు అక్కడితో ఆగిపోతుంది. లోతుగా ఆలోచిస్తే.. ప్రతి ఓటమీ ఓ అద్భుతమైన పాఠం చెబుతుంది. మిమ్మల్ని ఆలోచింపజేస్తుంది. పరిస్థితులను అవలోకనం చేసుకోమని బోధ చేస్తుంది. అందుకు తగ్గట్టుగా మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకోవాలని హెచ్చరిస్తుంది. ఉదాహరణకు ఒకసారి బ్రేక్ దెబ్బతిని బైక్ పైనుంచి పడిపోయామని అనుకోండి. ఆ తర్వాత నుంచి బైక్ ఎక్కిన ప్రతిసారీ.. బ్రేకులు సరిగ్గా పడుతున్నాయో లేదో చెక్ చేసుకోవడం అలవాటుగా మారుతుంది. ఇంటి గుమ్మానికి తల కొట్టుకుంటే, ఇకపై జాగ్రత్తగా నడవాలని గ్రహిస్తాం. గుమ్మం దాటిన ప్రతిసారీ.. తెలియకుండానే తలొంచుకుంటాం. ఓటమి నేర్పిన పాఠమే కదా ఇది. అయితే వాటిని గుర్తించి, అందుకు తగ్గట్టుగా నడుచుకుంటేనే ఓటమి మనల్ని గెలుపు తీరాలకు చేరువ చేస్తుంది. లేకపోతే.. జీవితంలో ముందుకు వెళ్లడం అసాధ్యమవుతుంది. ఓ వ్యక్తి పిండి వ్యాపారం చేసేవాడు. అందులో రాణించలేకపోయాడు. పశ్చిమ గాలులు విపరీతంగా వీయడం వల్ల పిండి గాలికి ఎగిరిపోయేది. మరోవైపు ఉప్పు వ్యాపారం చేసే వ్యక్తి లాభాలు గడించాడు. ఈ విషయం తెలిసిన మొదటి వ్యక్తి మనసు మార్చుకుని తనూ ఉప్పు వ్యాపారం చేద్దామనుకున్నాడు. ఉత్సాహంగా రంగంలోకి దిగాడు. అప్పటికి వర్షకాలం రావటంతో వానకు మొత్తం ఉప్పు కరిగిపోయి వ్యాపారంలో నష్టం వచ్చింది. పనిని ఎంచుకోవటంలో లోపమే ఇక్కడ వైఫల్యానికి కారణం. ఆఫ్రికాలో తమకు మార్కెట్ ఉంటుందో, లేదో తెలుసుకోవాలని ఓ సంస్థ ఇద్దరు సేల్స్‌మెన్‌లను అక్కడికి పంపింది. ఒకరు తూర్పు తీరానికీ, మరొకరు పశ్చిమ తీరానికీ వెళ్లారు. ఇద్దరూ ప్రాథమికంగా సర్వే చేసి తమ నివేదికలను సంస్థ యజమానికి పంపారు. 'ఇక్కడ ఒక్కరు కూడా షూ ధరించటం లేదు. ఇక్కడ అసలు మార్కెట్టే లేదు' అని మొదటి వ్యక్తి తన సర్వే సారాంశాన్ని పేర్కొన్నాడు. రెండో వ్యక్తి అందుకు భిన్నంగా 'ఇక్కడ షూ ధరించే వ్యక్తులు ఎవరూ లేరు. మనకు మార్కెట్ బ్రహ్మాండంగా ఉంటుంది. వెంటనే ఇన్వెంటరీ పంపండి' అన్నాడు. మనం చూసే దృష్టి కోణాన్ని బట్టి పరిస్థితులు ఉంటాయి! ఇద్దరిలో ఒకరు ఇక్కడ పరిస్థితులు మార్చలేమని భావిస్తే, మరొకరు అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని గుర్తించాడు. గెలుపు, ఓటమి సహజం అనే వైఖరి ఉన్నవాళ్లు మొదటి రకం సాధారణ మనుషులు. ప్రతికూల పరిస్థితుల్లోనూ అనుకూలతను దర్శించగలిగిన వాడు రెండో వ్యక్తి తరహా మనిషన్నమాట! 'వైఫల్యం అంటే నేర్చుకోవడంలో తొలి ప్రయత్నం' అంటారు ఏపీజే అబ్దుల్ కలాం. ఓడిపోతామన్న భయం మనిషిని గెలుపునకు దూరం చేస్తుంది. అదే ఓటమిని స్వీకరించగల నైతిక ట్కస్థైర్యం ఉంటే.. గెలుపు బావుటా ఎగురవేయడం పెద్ద కష్టమేం కాదనిపిస్తుంది.

### ఓటమి అంటే..

వైఫల్యం వచ్చిందంటే మీరు ఓడిపోయినట్టు కాదు. విజయం కోసం మీరు తాపత్రయపడుతున్నారని! విజయం వరించలేకపోవడానికి కారణాలు అనేకం ఉంటాయి. మీరు పనిచేసే విధానంలో ఏదో లోపం ఉండొచ్చు. విజయాన్ని అందుకునేంత శక్తిసామర్థ్యాలను, సమయాన్ని వెచ్చించి ఉండకపోవచ్చు. అంతమాత్రానికే.. 'మనతో కాదు' అని తోకముడిస్తే గెలుపు అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది. మరో రకంగా ప్రయత్నించి చూడండి! మరింత సమయం వెచ్చించండి. మరింత లోతుగా అర్థం చేసుకుంటే.. ఓటమి ఎంత ఎరుకతో ఉండాలో చెబుతుంది. ఆ దిశగా ప్రయత్నిస్తే విజయపథం కనిపిస్తుంది. ఉదాహరణకు శాస్త్రవేత్తలు చేసే ప్రతి ప్రయోగం విజయవంతమైతే.. సైన్స్‌లో ఇన్ని ఆవిష్కరణలకు ఆస్కారం ఉండేది కాదేమో! ప్రయోగాల్లో వైఫల్యమైన ప్రతిసారీ వాళ్లు మరో కొత్త ఆవిష్కరణకు నాంది పలికారు. మీ ఆలోచనలను 'రీ డైరెక్ట్' చేసుకోవడం వల్ల.. మరిన్ని ఆప్షన్లు ఎదురవుతాయి. కొత్త మార్గంలో ప్రయాణించగలుగుతారు. ఓటమి పాలైనంత మాత్రాన మీరు ఆత్మగౌరవాన్ని కోల్పోయినట్టు కాదు. మళ్లీ కొత్తగా ప్రయత్నించటానికి ధైర్యాన్ని పోగు చేసుకున్నారన్నమాట!! ఒక ఇంటర్వ్యూలో ఎంపిక కానంత మాత్రాన మీరు పనికిమాలిన వాళ్లు కాదని గ్రహించాలి. ఆ అపజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని మీ నైపుణ్యాలను నిజాయతీగా విశ్లేషించుకోవాలి. అప్పుడు గతంలో కన్నా గొప్ప అవకాశం మీ తలుపు తడుతుంది. ఓడిపోవటం అంటే మీకేదీ మిగలలేదని కాదు. కొత్తదారులలోకి మీరు అడుగుపెట్టవలసిన సమయం వచ్చిందని తెలుసుకోండి. పట్టుదల, ఏకాగ్రతతో ముందుకు వెళ్లండి. ఓడిపోవటం అంటే ప్రయత్నాన్ని ఆపేయమని కాదు. మరింత శక్తిని వెచ్చించి కష్టపడవలసిన అవసరం ఉందన్న సూచన అది. కొన్ని సంవత్సరాల పాటు అహోరాత్రులు కష్టపడితే గానీ విజయం సాధ్యం కాని సివిల్ సర్వీసు పరీక్షల్లో నాలుగోసారి, ఐదోసారి విజయం సాధిస్తున్నవారు ఎంతమంది లేరు. వాళ్లంతా తొలి ప్రయత్నాల్లో విఫలమైన వారేగా! ఓడిపోయారంటే మీరు సాధించలేరని కాదు. ఓర్పు, పట్టుదలతో మరింత ప్రయత్నించాలని అర్థం. ఒక మార్గంలో ఎదురయ్యే అపజయం.. ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకునేందుకు సిద్ధంగా ఉండమని సూచన చేస్తుంది. ఓడిపోయారంటే మీరు బలహీనులని కాదు. మరింత బలం పుంజుకోవాలన్నమాట! వరుస ఓటములు ఎదురైతే.. మీ జీవితం వృథా అని భావించొద్దు. మళ్లీ కొత్తగా ప్రారంభించటానికి ఓ సాకు దొరికిందని సంతోషించాలి. ఓడిపోయారంటే మీకు అవకాశం తప్పిపోయినట్టు కాదు. మీకు రెక్కలు ఎగరటానికి సిద్ధమవుతున్నాయని భావించాలి. మొత్తంగా ఓటమి అంటే గెలుపు వాయిదా పడటం మాత్రమే! ఆ గెలుపు తీరం చేరే దాకా అలుపెరగని పోరాటం కొనసాగించాల్సిందే! ఓటమి నేర్పిన గుణపాఠం.. గెలుపు పాఠాన్ని చెబుతుంది. జీవితంలో గెలిచినప్పుడు మనమే కాదు.ఎవరైనా సంతోషంగానే ఉంటారు. ఓడిపోయినప్పుడు కూడా నిబ్బరంగా ఉండటం, ధైర్యంగా వ్యవహరించటం ఎలాగో తెలిసి ఉండాలి. వైఫల్యాన్ని హుందాగా స్వాగతించ గలిగితే.. గెలుపు వంగి వంగి సలాములు చేస్తుంది. అందుకే వైఫల్యం ఎదురైనప్పుడు లక్షసార్లు ధన్యవాదాలు చెప్పండి. ఇతరుల నుంచి మీ వృత్తికి సంబంధించిన విషయాలు నేర్చుకోండి. ఇతరుల వైఫల్యాల నుంచి మీరు పాఠాలు నేర్చుకోగలిగితే తెలివైన వారు అనిపించుకుంటారు. వైఫల్యాలు మీ తలుపు తడుతున్నాయంటే, మీరు కొత్త పాఠాలు నేర్చుకుంటున్నారని భావించండి. ఆ పాఠాల వల్ల అచిర కాలంలోనే మీరు అద్భుతమైన విజయాన్ని అందుకోగలుగుతారు.

### విజయం సాధించాలంటే..

ఓటమి పాలైనప్పుడు ఎవరిని వాళ్లు నిందించుకుంటారు. ఇంట్లోవాళ్లు సరేసరి. కానీ, మీ అంతర్గత శత్రువులను జయించండి. సంకోచం, అనుమానం, ఆత్మన్యూనతా భావం, సెల్ఫ్ పిటీ అనేవి నాలుగు అంతర్ శత్రువులు. అవి లోపల నుంచి దాడి చేసి మిమ్మల్ని ఎదగనివ్వవు. ఆత్మవిశ్వాసంతో సంకోచాన్ని జయించండి. పరిపూర్ణ విశ్వాసంతో అనుమానాన్ని అధిగమించండి. సమతౌల్యంతో ఆత్మన్యూనతను ఎదుర్కోండి. స్వీయ క్రమశిక్షణతో సెల్ఫ్ పిటీని తరిమికొట్టండి. అన్నిటినీ మించి గతంలో ఉండిపోవద్దు. భవిష్యత్తులో విహరించొద్దు. వర్తమానంలో జీవించాలి. గతంలో ఎదురైన చేదు అనుభవాలు మన ఉత్సాహాన్ని చంపేస్తాయి. అలాగే భవిష్యత్తు పట్ల భయం అవరోధాలను ఎదుర్కొనే అవకాశాన్ని అడ్డుకుంటుంది. ఎవరు కాలాన్ని సద్వినియోగం చేసుకుంటారో వాళ్లు సత్ఫలితాలను సాధించగలుగుతారు. స్ఫూర్తినిచ్చే వ్యక్తుల కథలు చదవడం వల్ల ఉత్సాహం పొందొచ్చు. అలాగని విజయగాథలు చదువుతూ.. వాళ్లు సాధించిన దానికి మనం రొమ్ము విరుచుకోవాల్సిన పనిలేదు. ఓడిపోయిన వ్యక్తుల కథలు చదివితేనే.. ఓటమి తత్వం బోధపడుతుంది. విజేతల గాథలు సందేశాన్నిస్తాయి. ఓటమిపాలైన వ్యక్తుల కథలు గెలవడానికి కొత్త మార్గాలను నిర్దేశిస్తాయి. చివరిగా, పరాజయం అంటే ప్రయత్నించటంలో విఫలం కావటం. అంతే తప్ప అసలు ప్రయత్నించకపోవటం కాదు. ఈ సత్యాన్ని గ్రహించి మీ అదృష్టాన్ని మీరే పునర్ లిఖించుకోండి.

### చీమ చెప్పే సత్యం...

మీరెప్పుడైనా చీమల కదలికలను గమనించారా? వాటికి అంతరాయం కలిగించి చూడండి. అవి పక్కకు తొలిగి ముందుకు వెళ్లాటానికి ప్రయత్నిస్తాయే తప్ప ప్రయాణం ఆపవు. చీమలబారుకు అడ్డంగా ఓ చిన్నకర్రను అడ్డుపెడితే.. చీమలు తమ మార్గాన్ని మార్చుకొని కుడివైపు వెళ్తాయి. మరో కర్ర అడ్డం పెడితే.. అవి మళ్లీ కుడివైపు మళ్లుతాయి. ఇంకోసారి అడ్డుకోవటానికి ప్రయత్నించినప్పుడు వాటికి అర్థమైపోతుంది. ఈసారి అవి అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తాయి. అవి ఏ వైపూ తిరగకుండా.. కర్రపైకి ఎక్కి ప్రయాణించడం మొదలుపెడతాయి. వాన వచ్చినప్పుడు పక్షులు ఆశ్రయం కోసం చూస్తే, గద్దలు మేఘాలను దాటి పైకి ఎగురుతాయి. ఓటములు ఎదుర్కోవాలే కానీ, వాటి నుంచి పారిపోవద్దు. ఓటమిని ఢీ కొడితే.. విజయం తథ్యం.

### ఆర్థర్ ఆదర్శం...

ప్రసిద్ధ టెన్నిస్ ఆటగాడు ఆర్థర్ యాష్‌కు 1983లో గుండె సర్జరీ జరిగింది. ఆ సందర్భంగా అతనికి అందించిన రక్తం ఇన్‌ఫెక్షన్ కావడంతో ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధి సోకింది. అతను మరణానికి చేరువయ్యాడు. అభిమానులకు గుండె పగిలినంత పనైంది. 'ఇంత దరిద్రమైన వ్యాధి మీకే రావాలా? భగవంతుడు మిమ్మల్నే ఎందుకు ఎంచుకున్నాడు?' అని కన్నీళ్లు పెట్టుకున్నారు. 'ఎందుకు ఎంచుకోకూడదు?' అని వాళ్లను తిరిగి ప్రశ్నించాడు ఆర్థర్. 'ప్రపంచ వ్యాప్తంగా 5,00,00,000 చిన్నారులు టెన్నిస్ ఆడాలని కోరుకుంటున్నారు. 50,00,000 మంది టెన్నిస్ నేర్చుకుంటున్నారు. 5,00,000 వృత్తిపరమైన శిక్షణ పొందుతున్నారు. 50,000 మంది సర్క్యూట్‌కి వస్తారు. 5,000 మంది తర్వాతి దశకు చేరుకుంటారు. అందులో వడపోత తర్వాత 500 మంది మిగులుతారు. 50 మంది గ్రాండ్‌శ్లామ్‌కి చేరతారు. నలుగురు సెమీఫైనల్ దాకా వెళతారు. ఫైనల్‌కి ఇద్దరు చేరతారు. ఒకే ఒక్కరు గెలుస్తారు. నేను విజేతగా కప్పు అందుకున్నప్పుడు%ూ% 'నేనే ఎందుకు?' అని దేవుణ్ని ప్రశ్నించలేదు. అప్పుడు 'నేనే ఎందుకు?' అని అడగనప్పుడు.. ఇప్పుడు 'నాకే ఎందుకు ?' అని అడగటం న్యాయమా? అన్నాడు ఆర్థర్. ఇది నిజంగా ఆలోచించవలసిన అంశం. చిన్న చిన్న ఓటములకే కుంగిపోయి ఆత్మహత్యలకు సిద్ధపడుతున్న వారు ఈ టెన్నిస్ స్టార్ నుంచి ఎంతో నేర్చుకోవాలి. జీవితంలో పరిస్థితులు సానుకూలంగా లేవని ఆవేదనకు గురయ్యే ప్రతి ఒక్కరికీ ఆర్థర్ ఆదర్శం.

### ఓడి గెలిచిన వాళ్లెందరో..


నేడు మనం విజేతలని ఆరాధిస్తున్న ఎందరో తొలిరోజుల్లో పరాజయం చవిచూసిన వాళ్లే. వారిలో క్రీడాకారులు, రాజకీయ ఉద్ధండులు, వ్యాపారవేత్తలు, కవులు, కళాకారులు ఎందరో కనిపిస్తారు. వాళ్లు కోరుకున్న ఫలితాలు రాకపోయినా, 'నీ వల్ల కాద'ని ఇతరులు వెనక్కి లాగినా.. రాజీపడలేదు. చిన్నచిన్న ఓటములకు కుంగిపోలేదు. మళ్లీ మళ్లీ శక్తి కూడదీసుకొని లంఘించారు. ఓటమిని జయించి.. గెలుపు శిఖరాలను అధిరోహించారు. చరిత్ర పుటలను తిరగేస్తే.. అలాంటి వారెందరో కనిపిస్తారు. వారిలో కొందరిని ఇక్కడ ప్రస్తావించుకుందాం.. ఆపిల్ సంస్థ సహ వ్యవస్థాపకుడు స్టీవ్‌జాబ్స్‌ను 1985లో ఆ సంస్థ నుంచి బయటికి పంపారు. 1990లో ఆ సంస్థ దాదాపు దివాళా తీసే స్థితికి చేరుకుంది. మళ్లీ 1997లో స్టీవ్ ఆపిల్ సీఈవోగా మళ్లీ బాధ్యతలు చేపట్టాడు. తరవాతి సంగతి మనకు తెలిసిందే! వాల్ట్ డిస్నీలో సృజనాత్మకత, ఊహాబలం తక్కువని పేర్కొంటూ 'సిటీ స్టార్' అనే ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నుంచి అతణ్ని తొలగించారు. దిగ్గజ దర్శకుడు స్పీల్ బర్గ్‌కూ చేదు అనుభవాలు లేకపోలేదు. యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియాకు అనుబంధంగా ఉన్న స్కూల్ ఆఫ్ సినిమాటిక్ ఆర్ట్స్ స్పీల్‌బర్గ్‌ని మూడుసార్లు తిరస్కరించింది. నాలుగో ప్రయత్నంలో అతనికి ప్రవేశం లభించింది. వాల్ట్ డిస్నీ, స్పీల్ బర్గ్ ఎంతటి సృజనాత్మకత కలిగిన వ్యక్తులో ప్రపంచమంతా తెలిసింది కదా! హైస్కూల్‌లో ఉండగా మైఖెల్ జోర్డాన్‌ను బాస్కెట్ బాల్ ఆటకు పనికిరాడని టీమ్ నుంచి బయటికి పంపారు. కానీ, అతను ఆ క్రీడలో ప్రపంచ ప్రఖ్యాత చాంపియన్‌గా నిలిచాడు. ఎగిరే యంత్రాన్ని కనుగొనడం అసాధ్యమని రైట్ సోదరులను ఎందరో చులకనగా చూశారు. ఆ మాటలకు వాళ్లు కుంగిపోయి ఉంటే.. విమానం ఆవిష్కరణ ఎప్పటికి జరిగి ఉండేదో! ప్రఖ్యాత నవలా రచయిత స్టీఫెన్‌కింగ్ మొదటి నవల 'కేరీ'ని దాదాపు 30 మంది ప్రచురణకర్తలు బాగాలేదంటూ వెనక్కి పంపారట. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక కాపీలు అమ్ముడైన నవలల్లో ఒకటిగా కీర్తి మూటగట్టుకున్న 'హారీపాటర్' నావెల్‌ను మొదట 12 మంది పబ్లిషర్స్ 'ఛీ' కొట్టారట. అబ్రహం లింకన్ అమెరికా అధ్యక్షుడు కాకముందు ఎన్నో వైఫల్యాలను చవిచూశాడు. ఐన్‌స్టీన్‌కు చదువు రాదని బడి నుంచి బయటికి పంపారు. తర్వాత రోజుల్లో కూడా అనేక యూనివర్సిటీలు ఆయనకు ప్రవేశం ఇవ్వలేదు. థామస్ ఎడిసన్ బల్బును కనుగొనడానికి ముందు వెయ్యి వైఫల్యాలను చవిచూశాడు. ప్రఖ్యాత శాస్త్రవేత్త మేరీ క్యూరీకి పోలాండ్ యూనివర్సిటీలో అడ్మిషన్ దొరకలేదు. దీంతో ఆమె ఫ్రాన్స్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఇలా తరచి చూస్తే.. ఎందరో వ్యక్తులు శక్తులుగా ఎదగడానికి ముందు పతనం లోతులు చూసిన వాళ్లే అని తెలుస్తుంది. పాతాళానికి పడిపోయామని వాళ్లు కుంగిపోయి ఉంటే.. చరిత్రలో వాళ్ల ప్రస్తావన ఉండేది కదా కదా! ఓడిపోయారంటే మీరు సాధించలేరని కాదు.గెలుపు కోసం మరింత ప్రయత్నించాలని అర్థం. అపజయం పొందారంటే మీకు అవకాశం తప్పిపోయినట్టు కాదు. మీకు రెక్కలు ఎగరటానికి సిద్ధమవుతున్నాయని భావించాలి. ఫెయిల్యూర్ అంటే మీకేదీ మిగలలేదని కాదు.కొత్తదారులలోకి మీరు అడుగుపెట్టవలసిన సమయం వచ్చిందని తెలుసుకోండి. పట్టుదల, ఏకాగ్రతతో ముందుకు వెళ్లండి.

# అదానీ దుమారం




ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అత్యంత సన్నిహితుడైన గౌతమ్ అదానీకి అగ్రరాజ్యమైన అమెరికా అరెస్టు వారంట్ జారీచేయడంతో ఇండియాలో రాజకీయ దుమారం చెలరేగింది. భారతదేశంలో విద్యుత్తు ప్రాజెక్టుల కోసం రాజకీయ పెద్దలకు ముడుపులు ఇచ్చారనీ, పెట్టుబడుల సేకరణ సందర్భంగా నిజాలు దాచిపెట్టారనేవి అదానీపై ప్రధానమైన ఆరోపణలు. ఇవి అమెరికా చట్టాల ప్రకారం నేరాలనీ, వీటి ఉల్లంఘన ఎక్కడ జరిగినా తమ న్యాయవ్యవస్థ వదిలిపెట్టదనీ అమెరికా అంటున్నది. భారత కుబేరుడిని ప్రపంచ పెద్దన్న అమెరికా జైలుకు పంపేందుకు సిద్ధమైందన్న వార్త మన దేశంలో సహజంగానే ప్రకంపనలు సృష్టించింది. స్టాక్‌మార్కెట్ కుప్పకూలింది. ముఖ్యంగా అదానీ గ్రూప్ షేర్లు దారుణంగా దెబ్బతిన్నాయి. ఒక్కరోజులోనే కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. అదానీ విషయమై పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీలు హంగామా చేస్తున్నాయి. ఇది టీ కప్పులో తుఫానులా సమసిపోతుందా? లేక పైకప్పులు ఎగరగొట్టే వాయుగుండమవుతుందా? అనేది ఇదమిద్ధంగా చెప్పలేం. మోదీ ప్రాపకంలోనే వివాదాస్పద పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ అంచెలంచెలుగా ఎదిగి ప్రపంచ కుబేరుడయ్యారన్న సంగతి మరువరాదు. ఏది ఎలా ఉన్నప్పటికీ అదానీ గ్రూప్ సంస్థలకు హిండెన్‌బర్గ్ ఉదంతాన్ని మించిన నష్టాన్ని అమెరికా అరెస్టు వారంటు కలిగించిందని చెప్పక తప్పదు. అదానీ ప్రతిధ్వనులు మన రాష్ట్రంలోనూ వినిపించాయి. అదానీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఢిల్లీలో నిప్పులు చెరుగుతుంటే, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అదే అదానీకి ఎర్రతివాచీ పరచి స్వాగతిస్తుండటం విస్మయం కలిగించింది. ఇప్పుడు అమెరికా వారంటు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అదానీతో జరిపిన సయ్యాటలపైకి అందరి దృష్టి మరోమారు మళ్లింది. వివాదాస్పద పారిశ్రామికవేత్త రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు ఇదివరకూ ప్రయత్నాలు జరుపకపోలేదు. రాష్ట్రంలో 20 వేల మెగావాట్ల థర్మల్ ప్లాంట్ కోసం అదానీ గ్రూప్ వస్తే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సున్నితంగా తిరస్కరించడం తెలిసిందే. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. అధిష్ఠానం వైఖరికి భిన్నంగా అదానీపై ప్రత్యేకాభిమానం ప్రదర్శించడం విడ్డూరం. ప్రస్తుత వివాదాలు ముసురుకున్న వేళ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆత్మసమర్థనలో పడింది. అందులో భాగంగానే అదానీ ఇచ్చిన విరాళంపై యూటర్న్ తీసుకున్నది. స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ.100 కోట్ల విరాళం తిరస్కరిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హడావుడిగా ప్రకటించారు. అదానీతో సహా ఏ సంస్థ నుంచీ తెలంగాణ సర్కారు విరాళాలు తీసుకోలేదని మీడియా సాక్షిగా వివరణ ఇచ్చుకున్నారు. అధిష్ఠానం అల్టిమేటంతోనే ఆయన అందుకు సిద్ధమయ్యారనేది తెలుస్తూనే ఉంది. అంతటి ఇరకాటంలోనూ విపక్ష పార్టీపై బట్టకాల్చి మీద వేసే ప్రయత్నాలు ఆపలేదు. కేంద్ర ప్రాజెక్టులను బీఆర్ఎస్ ఖాతాలో వేసేందుకు విఫలయత్నం చేసి అభాసుపాలయ్యారు. దావోస్‌లో అదానీ గ్రూప్‌తో అట్టహాసంగా కుదుర్చుకున్న వేల కోట్ల రూపాయల ఒప్పందాలను రద్దు చేసుకుంటారా? దీనిపై రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ వివరణ ఇచ్చుకోవాల్సి ఉన్నది.

# వీటిని రోజూ తీసుకుంటే చాలు కొలెస్ట్రాల్ ఎంత ఉన్నా సరే కరిగిపోతుంది



ప్రస్తుతం చాలా మంది నిత్యం గంటల తరబడి కూర్చుని పనిచేసే ఉద్యోగాలు చేస్తున్నారు. దీని వల్ల ఒత్తిడి బారిన పడుతున్నారు. అలాగే శారీరక శ్రమ కూడా ఉండడం లేదు. అస్తవ్యస్తమైన జీవన విధానాన్ని పాటిస్తున్నారు. రాత్రిపూట సరిగ్గా నిద్రించడం లేదు. జంక్ ఫుడ్‌కు బాగా అలవాటు పడ్డారు. ఇంట్లో వండిన ఆహారాల కన్నా బయటి ఆహారాలనే అధికంగా తింటున్నారు. అలాగే ధూమపానం, మద్యపానం చేస్తున్నారు. ఇవన్నీ శరీరంలోని కొలెస్ట్రాల్‌ను పెంచేందుకు కారణాలు అవుతున్నాయి. శరీరంలో కొలెస్ట్రాల్ చేరితే రక్తనాళాల్లో అడ్డంకులు వస్తాయి. దీంతో రక్త సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది. ఫలితంగా అది హార్ట్ ఎటాక్‌కు దారి తీస్తుంది. కనుక హార్ట్ ఎటాక్ రావొద్దంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవన శైలిని పాటించాల్సి ఉంటుంది.

### పసుపు..

ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. చాలా మంది ఇళ్లలో పసుపును విరివిగా ఉపయోగిస్తుంటారు. అయితే ఇది మనకు నిజంగా ఆరోగ్య ప్రదాయిని అని చెప్పవచ్చు. దీన్ని ఆయుర్వేదంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో ఇది అద్భుతంగా పనిచేస్తుంది. పసుపులో కర్క్యుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది రక్తనాళాలను క్లీన్ చేసి వాటిని ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. కనుక పసుపును రోజూ ఏదో ఒక విధంగా ఆహారంలో భాగం చేసుకోవాలి. దీంతో గుండె పోటు రాకుండా చూసుకోవచ్చు.

### తులసి ఆకులు..

కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించడంలో తులసి ఆకులు కూడా బాగానే పనిచేస్తాయి. వీటిల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఈ ఆకులు యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కూడా కలిగి ఉంటాయి. అందువల్ల తులసి ఆకులను రోజూ 4 చొప్పున పరగడుపునే తింటుంటే కొలెస్ట్రాల్ లెవల్స్‌ను కరిగించుకోవచ్చు. దీని వల్ల గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో మెంతులు కూడా బాగానే పనిచేస్తాయి. వీటిల్లో ఫైబర్ అదికంగా ఉంటుంది. అలాగే సాపోనిన్స్ అనే సమ్మేళనాలు మెంతుల్లో ఉంటాయి. ఇవి శరీరంలో అధికంగా ఉండే కొలెస్ట్రాల్‌ను బయటకు పంపేస్తాయి. రాత్రి పూట మెంతులను కొన్ని తీసుకుని నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం పరగడుపునే వీటిని తినాలి. ఇలా చేస్తుంటే కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గిపోతాయి.

### దాల్చిన చెక్క..

శరీరంలోని కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గించడంలో దాల్చిన చెక్క కూడా అద్భుతంగానే పనిచేస్తుంది. దీన్ని రోజూ కషాయం రూపంలో తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. దాల్చిన చెక్క నీళ్లను తాగడం వల్ల షుగర్ లెవల్స్ కూడా తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. రోజూ ఉదయం అల్లం రసం సేవించడం వల్ల శరీరంలో రక్త సరఫరా మెరుగుపడుతుంది. దీంతో బీపీ తగ్గుతుంది. అలాగే శరీరంలోని కొలెస్ట్రాల్ లెవల్స్ కూడా తగ్గుతాయి. వెల్లుల్లిలో ఆల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. కనుక వెల్లుల్లిని కూడా రోజూ తినాలి. రోజూ ఉదయం పరగడుపునే 2 పచ్చి వెల్లుల్లి రెబ్బలను తింటే ఎంతో మేలు జరుగుతుంది. ఇలా పలు రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్‌ను సహజసిద్ధంగానే తగ్గించుకోవచ్చు.

# శీతాకాలం ఎండ ఎంత మేలో!



సూర్యకిరణాలు శరీరాన్ని స్పర్శించడం వల్ల దేహం విటమిన్-డిని తయారు చేసుకుంటుంది. విటమిన్- డి కోసం శరీరాన్ని ఎండకు ఉంచేందుకు శీతాకాలం అనువైనది. ఈ కాలంలో ఎండ వేడి తక్కువగా ఉంటుంది. చల్లదనం వల్ల శరీరం బిగుసుకుపోయి, చర్మం పగుళ్లతో ఉంటుంది. ఉదయాన్నే ఎండకు ఉండటం వల్ల కండరాల కదలిక తేలిక అవుతుంది. శరీరానికి కావాల్సినంత విటమిన్-డి తయారు కావాలంటే రోజులో కనీసం 15 నిమిషాల నుంచి 30 నిమిషాల పాటు ఎండలో ఉండాలి. చర్మం ఎర్రగా ఉండేవాళ్లు ఎండకు తక్కువ సమయం ఉండాలి. నల్లని చర్మం ఉండేవాళ్లు ఎక్కువ సమయం ఎండలో గడపాలి. విటమిన్-డి వల్ల ఎముకలు క్యాల్షియాన్ని ఎక్కువగా శోషించుకోగలుగుతాయి. కాబట్టి ఎముకలు బలంగా ఉంటాయి. ఆస్టియోపొరోసిస్ సమస్య రాదు. ఎండలో ఉన్నప్పుడు మానసికోల్లాసం కలుగుతుంది. అలాగే రుతువులు మారినప్పుడు కలిగే మానసిక సమస్యలు తొందరగా తొలగిపోతాయి. గుండె పనితీరుని విటమిన్-డి మెరుగుపరుస్తుంది. హైపర్ టెన్షన్‌ని తగ్గిస్తుంది. సో, చలికాలంలో బారెడు పొద్దెక్కే వరకూ పడుకోకుండా.. ఉదయం ఎండలో ఎక్కువ సమయం గడిపే ప్రయత్నం చేయడం చాలా అవసరం అని గుర్తించండి.

తెలంగాణ సేన




# గుత్తాధిపత్యం గతచరిత్రే




ఏ మాత్రం అవకాశం దొరికినా ప్రాంతీయ పార్టీల మీద జాతీయ పార్టీలు దుమ్మెత్తి పోస్తుంటాయి. తమది సువిశాలమైన జాతీయవాదమనీ, వాటిది సంకుచిత ప్రాంతీయ వాదమనేది ప్రధానంగా ముందుకుతెచ్చే వాదన. కానీ, ఆసేతు హిమాచలం పరచుకొని ఉన్నది వైవిధ్యభరితమైన భారతం. దేశాన్ని ఒకే గాటన కట్టి పబ్బం గడుపుకోవాలన్నదే జాతీయ పార్టీల భావన. ఈ విషయంలో బీజేపీ, కాంగ్రెస్ అన్న తేడాలు ఉండవు. దొందూ దొందే. విభిన్నమైన జాతులు, భాషలు, ఆచారాలు ఉండటమనేది సమస్య కాదు. ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలనే కోరుకుంటారు. కానీ, ఒక్కో ప్రాంతం ప్రజల ఆశలు, ఆకాంక్షలు భిన్నంగా ఉంటాయి. అందులో నుంచే ప్రాంతీయ వాదం, దానికి కొనసాగింపుగా పార్టీలు ఆవిర్భవిస్తాయి. అధికారం కోసం జరిగే పోరులో ఓట్ల రూపంలో, సీట్ల రూపంలో ఆ ఆకాంక్షలే వ్యక్తమవుతాయి. తాజాగా వెలువడిన మహారాష్ట్ర, జార?ండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రాంతీయ శక్తుల ప్రాముఖ్యాన్ని, అనివార్యతను చాటిచెప్పాయి. మహారాష్ట్రలో శివసేన షిండే వర్గం, ఎన్సీపీ అజిత్ పవార్ వర్గంతో పొత్తు పెట్టుకొని బీజేపీ తన ఉనికిని నిలబెట్టుకున్నది. రెండు ప్రాంతీయ పార్టీలను చీల్చి, ఆ చీలిక వర్గాలతో కలిసి పోటీచేసింది. అత్యధికంగా 149 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ సొంతంగా మెజారిటీకి కొద్దిదూరంలో ఆగిపోయింది. అంటే మిత్రపక్షాలైన ప్రాంతీయ పార్టీల మీద ఆధారపడక తప్పని పరిస్థితి. 'ఏక్ హై తో సేఫ్ హై' వంటి హద్దు మీరిన ప్రచారం జరిపినప్పటికీ వేర్వేరు ప్రాంతాల్లో మిత్రపక్షాలైన ప్రాంతీయ పార్టీల ఓటు బదిలీ నుంచి లాభపడింది. కాంగ్రెస్ సీట్లు భారీగా నష్టపోతే బీజేపీ అతిపెద్ద పార్టీగా ముందుకువచ్చి పట్టు బిగించింది. ఇటు కాంగ్రెస్ చీలిక పార్టీల అవశేష వర్గాలతో కలిసి పోటీచేసినా కనీసం ప్రధాన ప్రతిపక్ష హోదాకు అవసరమైనన్ని సీట్లు కూడా దక్కించుకోలేకపోయింది. జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు గెలిచిన సీట్ల సంఖ్యను పోల్చి చూసుకుంటే అంతరం అంతంత మాత్రమేనని తెలిసిపోతుంది. జార?ండ్ ఫలితాలు ప్రాంతీయ పార్టీల ఉనికిని బలంగా చాటాయనే చెప్పాలి. రాష్ట్ర సాధనకు ఉద్యమించిన జేఎంఎం కేంద్రం వేధింపులను, బీజేపీ విష ప్రచారాన్ని తట్టుకొని నిలిచి ప్రజాక్షేత్రంలో జెండా ఎగురవేసింది. కాంగ్రెస్ అంటకాగే పార్టీ స్థాయికి దిగజారిపోయింది. కేంద్ర, రాష్ట్ర అధికార పీఠాలను జాతీయ పార్టీలు అధిరోహించాలంటే ప్రాంతీయ పార్టీల మద్దతు, అండదండలు లేకుండా సాధ్యమయ్యే రోజులు ఎప్పుడో పోయాయని ఈ ధోరణి సూచిస్తున్నది. రెండు పెద్ద పార్టీలు ఎంతగా వద్దనుకుంటున్నా ప్రాంతీయపార్టీలు మళ్లీ మళ్లీ తలెత్తుకుంటూనే ఉన్నాయి. తమ సత్తాను, అనివార్యతను చాటుకుంటున్నాయి. సమాఖ్యవాదం ప్రాముఖ్యాన్ని పదే పదే గుర్తుచేస్తూనే ఉన్నాయి. జాతీయ పార్టీలు ప్రాంతీయ ఆకాంక్షల పరిపూర్తిలో ఘోరంగా విఫలం కావడమే అందుకు ప్రధాన కారణం. ఎప్పటికైనా ప్రాంతీయ పార్టీలే దేశానికి శ్రీరామరక్ష అని చెప్పకతప్పదు.

## ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా అయితే అది ఫ్యాటీ లివర్ సమస్య కావచ్చు



మన శరీరంలో లివర్ అనేక ముఖ్య విధులను నిర్వహిస్తుంది. సుమారుగా 800 జీవక్రియలు సక్రమంగా నిర్వర్తించేందుకు లివర్ అవసరం అవుతుంది. అయితే లివర్ చేసే పనుల వల్ల అందులో కొవ్వు పేరుకుపోతుంది. దీంతో ఫ్యాటీ లివర్ సమస్య వస్తుంది. దీన్ని రెండు రకాలుగా చెబుతారు. నాన్ ఆల్కహాలిక్, ఆల్కహాలిక్ అని ఫ్యాటీ లివర్ రెండు రకాలుగా ఉంటుంది. మద్యం ఎక్కువగా సేవించడం వల్ల ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి వస్తుంది. మద్యం సేవించకపోయినా తీసుకునే ఆహారాల వల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోయి నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ వ్యాధి వస్తుంది. అయితే రెండింటిలోనూ లక్షణాలు సమానంగా కనిపిస్తాయి. వాటిని గుర్తించడం ద్వారా ఫ్యాటీ లివర్ సమస్య వచ్చిందని అర్థం చేసుకోవచ్చు.

**సైజ్ పెరుగుతుంది..**

ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారిలో లివర్ వాపులకు గురవుతుంది. దీంతో లివర్ సైజు పెరుగుతుంది. లివర్ ఉన్న చోట చర్మం ఉబ్బెత్తుగా మారుతుంది. దీన్ని అందరూ గుర్తించలేకపోవచ్చు. కానీ లివర్ ఉన్న భాగంలో మాత్రం కాస్త నొప్పిగా అనిపిస్తుంది. ఇక లివర్ పెరిగిపోవడాన్ని హెపాటోమెగాలి అంటారు. ఫ్యాటీ లివర్ వచ్చిన వారిలో ఇలా జరుగుతుంది. కనుక మీకు ఈ లక్షణం కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలవండి. అలాగే ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారిలో పాదాలు వాపులకు గురై కనిపిస్తుంటాయి.

**జీర్ణవ్యవస్థపై..**

ఫ్యాటీ లివర్ సమస్య ఉంటే జీర్ణవ్యవస్థ పనితీరుపై ప్రభావం పడుతుంది. దీంతో తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాక అజీర్తి ఏర్పడుతుంది. అలాగే ఆకలిగా కూడా ఉండదు. మెటబాలిజం సరిగ్గా ఉండదు. కొందరికి కడుపులో నొప్పి కూడా ఉంటుంది. ఏ ఆహారాన్ని చూసినా వాంతికి వచ్చినట్లు అనినిస్తుంది. ఈ లక్షణాలు ఉంటే ఫ్యాటీ లివర్ సమస్యగా అనుమానించాల్సిందే. మీరు నిద్ర నుంచి అప్పుడే లేచినప్పటికీ తీవ్రమైన అలసట ఉందంటే దాన్ని కూడా ఫ్యాటీ లివర్ సమస్యగా అనుమానించాలి. ఈ దశలో చిన్న పని చేసినా తీవ్రంగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. శరీరంలో శక్తి స్థాయిలు లేనట్లు అనిపిస్తుంది.

**పొట్ట ఉబ్బరం..**

లివర్ సమస్య ఉన్నవారిలో సహజంగానే పొట్ట ఉబ్బిపోయి కనిపిస్తుంది. ఉన్నట్లుండి అకస్మాత్తుగా ఈ సమస్య వచ్చినా కూడా దాన్ని ఫ్యాటీ లివర్ సమస్యగా అనుమానించాలి. లివర్ వ్యాధి ఉంటే శరీరంలోని వ్యర్థాలు సరిగ్గా బయటకు పోవు. దీంతో చర్మం దురదగా అనిపిస్తుంది. కొందరికి చర్మంపై దద్దుర్లు కూడా ఏర్పడుతుంటాయి. ఫ్యాటీ లివర్ వ్యాధి ఉన్నప్పుడు చికిత్స తీసుకోకపోతే అది లివర్ సిర్రోసిస్‌గా మారే ప్రమాదం ఉంటుంది. కొందరికి ఇది క్యాన్సర్‌గా కూడా మారవచ్చు. కనుక ఈ లక్షణాలు కనిపిస్తే ఎవరైనా సరే జాగ్రత్త పడాల్సిందే. వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. ఫ్యాటీ లివర్ ఉన్నట్లు తేలితే డాక్టర్ సలహా మేరకు మందులను వాడాలి. అలాగే ఆరోగ్యవంతమైన ఆహారాలను తినాలి. దీంతో లివర్ పనితీరు మెరుగు పడుతుంది. లివర్ మళ్లీ ఎప్పటిలా పనిచేస్తుంది.

## గజగజ వణికిస్తున్న చలి పులి అన్ని జిల్లాల్లో 15 డిగ్రీలలోపు రాత్రి ఉష్ణోగ్రతలు



తెలంగాణలో చలి పంజా విసురుతోంది. తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 15 డిగ్రీలలోపు కనిష్ఠ రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ఉత్తర, మధ్య తెలంగాణ జిల్లాల్లో చలి తీవ్రత ఎకువగా ఉన్నదని చెబుతున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. సిర్పూర్(యూ)లో రికార్డు స్థాయిలో 8.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 8.8, ఆదిలాబాద్ జిల్లా బేలలో 9.9 డిగ్రీలు నమోదైంది. జోగులాంబ గద్వాలలో 15.1, సూర్యాపేటలో 15.6, వనపర్తిలో 15.9 డిగ్రీలుగా నమోదైంది. తూర్పు, ఈశాన్య ప్రాంతాల నుంచి రాష్ట్రం వైపు గాలులు వీస్తుండటమే చలి తీవ్రత పెరగటానికి కారణమని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా రానున్న మూడ్రోజులు చలి తీవ్రత మరింత అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆసిఫాబాద్, సంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లో 10 డిగ్రీలలోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన 27 జిల్లాల్లో 15 డిగ్రీల లోపు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. ప్రతి ఏడాది డిసెంబర్‌లో ఉష్ణోగ్రతలు తకువ స్థాయికి పడిపోతుంటాయి. ఈ ఏడాది కొన్ని జిల్లాల్లో నవంబర్‌లోనే చలి తీవ్రత విపరీతంగా పెరిగింది. పదేళ్లతో పోల్చితే ఈ నెల 23న రాత్రి నాలుగు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు.

# ప్రాంతీయ పార్టీలు చిరంజీవులు




దేశంలో ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలని, జాతీయ పార్టీలైన తమది మాత్రమే ఎదురులేని ఆధిపత్యం కావాలని కాంగ్రెస్, బీజేపీ కొన్ని దశాబ్దాలుగా ప్రయత్నిస్తున్నాయి. అది నెరవేరేది కాదని ఇప్పటికే అనేకసార్లు రుజువైంది. ఈ రెండు జాతీయ పార్టీలు తమ సొంత బలంతో అధికారానికి రాలేక ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోక తప్పని దశ వచ్చిన తర్వాత సైతం, ఒకవైపు వాటిపై ఆధారపడుతూనే మరొకవైపు వాటిని బలహీనపరిచి, చీల్చి, కబళించే వ్యూహాలను సాగిస్తూ వస్తున్నారు. ఆయా పరిస్థితుల్లో ఈ వ్యూహాలు అప్పుడప్పుడు పనిచేసి ప్రాంతీయ పార్టీలు బలహీనపడిన సందర్భాలు లేకపోలేదు. కానీ, అవి చిరంజీవుల వలె తిరిగి అంతలోనే పైకి లేస్తూ జాతీయ పార్టీలకు తమతో కలిసి నడవక తప్పని విధిలేని స్థితిని సృష్టిస్తున్నాయి. కొద్దిరోజుల కిందటి మహారాష్ట్ర, ఝార?ండ్ అసెంబ్లీ ఫలితాలు అందుకు తాజా ఉదాహరణ. ఎదురుగా ఉన్న సీట్ల లెక్కలే ఆ మాట చెప్తున్నాయి. మహారాష్ట్రలో బీజేపీ రెండు ప్రాంతీయ పార్టీలతో, కాంగ్రెస్ మూడు పార్టీలతో పొత్తులు కలిసాయి. ఝార?ండ్‌లోనూ ఇరువురూ అదే పనిచేశారు. ఆ రెండింటిలో గెలిచిందెవరు ఓడిందెవరు, ఎవరికెన్ని సీట్లు వచ్చాయి అన్నవి కాదు ప్రశ్నలు. ఇరువురు కూడా ఒంటరిగా పోటీ చేయలేకపోయారు, ప్రాంతీయ పార్టీలతో పొత్తు తప్పదనుకున్నారనేది విషయం. అట్లా భావించి బీజేపీ ఎన్డీయేని, కాంగ్రెస్ పార్టీ యూపీఏని ఏర్పాటుచేసుకోవటం మొదలై రెండు నుంచి మూడు దశాబ్దాలు గడిచాయి. వాటి బలహీనతలు అం తకు మరో దశాబ్దం ముందు నుంచి ఆరంభమయ్యాయి. ఆ బలహీనతలకు మూలాలను వెతకాలంటే ఇంకొక రెండు దశాబ్దాలు వెనుకకు వెళ్లాలి. ముఖ్యంగా కాంగ్రెస్‌కు సంబంధించి. స్వాతం త్ర్యం వచ్చినప్పటి నుంచి అది మన దేశాన్ని పాలిస్తున్న పార్టీ గనుక. ఆ విధంగా ఇది కనీసం అరవై ఏండ్ల చరిత్ర. బలహీనతల మూలాలు అప్పటివి కాగా, ప్రాంతీయ పార్టీలతో పొత్తులు తప్పవనుకునే విధిలేని స్థితి బీజేపీకి పూర్వరూపమైన జనసంఘ్‌కు నేషనల్ ఫ్రంట్ వేదికగా 1989లో ఏర్పడగా, కాంగ్రెస్‌కు యూపీఏ వేదికగా 2004లో ఎదురైంది. ఈ విధిలేని స్థితి ఉభయులకు కూడా ఈ 2024లోనూ కొనసాగుతున్నదనేది గుర్తించవలసిన విషయం. అంతే ముఖ్యమైన మరొక విషయం ఏమంటే, ఈ స్థితి నుంచి బీజేపీ, కాంగ్రెస్‌లలో ఏదీ కూడా కనుచూపు మేరలో బయటపడే అవకాశాలు లేవు. ఇది ఏదో జోస్యం వంటిదో లేక ఆశాభావం లాం టి మాటో కాదు. జాతీయస్థాయి పరిస్థితులను, వివిధ రాష్ట్రాల పరిస్థితులను గమనించినప్పుడు తోచేది ఇదే. పరిస్థితులు అంటే ఏమిటి? ఇందు లో ప్రధానంగా గమనించవలసినవి రెండున్నా యి. మొదటిది కాంగ్రెస్, బీజేపీ రెండూ కూడా తమ అస్తవ్యస్త విధానాలు, అసమర్థ పాలనలు, అవినీతి కారణంగా, తాము అధికారంలో ఉండిన సమయాలలో ప్రజల విశ్వాసాన్ని పొందలేకపోవటం. అదే స్థితి ఇప్పటికీ ఉండటం. వైఫల్యాల నుంచి, గత పరాజయాల నుంచి పాఠాలు నేర్వకపోవటం. ఇది మొదటిది కాగా, ప్రజలలో పలురకాల చైతన్యాలు, వాటితో పాటు ఆకాంక్షలు పెరుగుతుండటం. ఏ పార్టీ పట్ల, నాయకుని పట్ల కూడా ఒకప్పటి వలె గుడ్డిగా అనుసరించే విధేయతలు లేకుండా పోతుండటం. ఈ పరిణామాల ఫలితంగా వ్యక్తిగత ప్రయోజనాల నుంచి తమ ప్రాంతీయ ప్రయోజనాల వరకు ప్రధానం అవుతుండటం. ఇది రెండవది. ఇవి రెండూ మౌలికమైన స్థితులు. తక్కినవ న్నీ వీటికి లోబడి వీటి చుట్టూ తిరిగేవే. కాంగ్రె స్, బీజేపీలలో ఎవరు ఏ నినాదాలు ఇచ్చినా, ఏ మ్యానిఫెస్టోలు ప్రకటించినా, ఎవరితో పొత్తులు పెట్టుకున్నా, మరేమి ఎత్తుగడలు వేసి నా, ఏ సిద్ధాంతాలు మాట్లాడినా, ఎటువంటి అజెండాలు తెరపైకి తెచ్చినా, అన్నీ కూడా ఈ రెండు వైఫల్యాలను, బలహీనతలను అధిగమించి, ప్రజలను నమ్మించి, అంతిమంగా అధికారం సంపాదించటానికి మాత్రమే. తిరిగి గుర్తుచేసుకోవాలంటే, తమ అస్తవ్యస్త విధానా లు, అసమర్థ పాలనలు, అవినీతి కారణంగా కోల్పోయిన ప్రజల విశ్వాసాన్ని పలు విధాలుగా వారిని మరొకమారు వంచించటం ద్వారా సంపాదించి, అధికారం చేజిక్కించుకోవటం కోసమే. అదేవిధంగా, ప్రజలలో పెరుగుతున్న చైతన్యాలను, వారి సరికొత్త ఆకాంక్షలను మభ్యపెట్టి, ఏ పార్టీ పట్ల కూడా స్థిరంగా లేకుండాపోయిన విధేయతలను అధిగమించి ఎన్నికలు గెలవటం కోసమే. అందులో సఫలమవుతారా లేదా అన్నది వేరే ప్రశ్న. ఒకసారి కావచ్చు, మరోసారి కాకపోవ చ్చు. వారు ఆ వలయంలోంచి బయటపడలేరన్నది మాత్రం గుర్తించవలసిన ప్రధాన విష యం. బయట పడాలంటే పైన పేర్కొన్న రెండు పరిస్థితులను అధిగమించాలి. ఆ పనిచేయటం వారికి సాధ్యమయ్యేది కాదు. తమ స్వార్థ ప్రయోజనాలు నెరవేరేందుకు అస్తవ్యస్త విధానాలు, అసమర్థ పాలన, అవినీతి, ప్రజల మేలు కోసం చిత్తశుద్ధితో పనిచేయకపోవటం, వారి చైతన్యాలను, ఆకాంక్షలను పట్టించుకోకపోటం, పక్కదారి పట్టించటం, ప్రాంతాల ఫెడరల్ అవసరాలను, హక్కులను హరించి అధికార కేంద్రీకరణలు చేయటం వంటివన్నీ వారికి ఒక తప్పనిసరి అవసరం. తమ స్వార్థ ప్రయోజనాల ప్రాతిపదికగా వారికి ఏర్పడిన స్వభావమది. ఒకవైపు ఇది ఆ రెండు పార్టీల స్వభావం ఎట్లా అయిందో, మరొకవైపు దేశంలోని ప్రాంతాలకు, అక్కడి ప్రజలకు ఫెడరలిజం తమ స్వభావంగా మారింది. ఈ స్వభావం అనే దానిలోకి అనేకం వస్తాయి. తమ ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రయోజనాలు, చరిత్ర, సంస్కృతి, ఆకాంక్షలు, ప్రత్యేక గుర్తింపులు మొదలైనవన్నీ. ఒకవైపు ఇది ఆ రెండు పార్టీల స్వభావం ఎట్లా అయిందో, మరొకవైపు దేశంలోని ప్రాంతాలకు, అక్కడి ప్రజలకు ఫెడరలిజం తమ స్వభావంగా మారింది. ఈ స్వభావం అనే దానిలోకి అనేకం వస్తాయి. తమ ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రయోజనాలు, చరిత్ర, సంస్కృతి, ఆకాంక్షలు, ప్రత్యేక గుర్తింపులు మొదలైనవన్నీ. మరొకవైపు జాతీయపార్టీలకు జాతీయ ప్రయోజనాల పేరిట జాతీయస్థాయి ఆర్థికశక్తుల ప్రయోజనాలు, అనగా పెద్ద ధనవంతులు వ్యాపారాల వారు, వారితో సంబంధాలుండే విదేశీ ఆర్థికశక్తులు ప్రధానమవుతాయి. తమ యూనిటరిస్టు పెత్తందారీతనం ప్రధానమవుతుంది. అందుకు తగిన విధానాలతో పరిపాలిస్తూ అందుకోసం ప్రాంతాల ప్రయోజనాలను, ఆకాంక్షలను బలిపెట్టజూస్తారు. రెండింటి మధ్య వ్యతిరేకతలన్న వి, లేదా వైరుధ్యాలన్నవి అక్కడ మొదలవుతాయి. జాతీయ పార్టీలు, నాయకత్వాలన్నవి నిజం. జాతీయ దృష్టితో మొత్తం అన్ని ప్రాంతా ల ప్రయోజనాలను, వైవిధ్యతలను దృష్టిలో ఉంచుకొని ప్రజాస్వామికంగా పాలించినట్టయి తే, అది మన రాజ్యాంగం చెప్పిన సహకార ఫెదరలిజం అవుతుంది. ఇండియా వంటి వైవిధ్య దేశంలో ప్రాంతాలు, వాటి ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలకు మధ్య సహకార సమన్వయాలు ఎంత అవసరమో స్పష్టంగా గుర్తించినందువల్లనే రాజ్యాంగ రచయితలు బలమైన కేంద్రం, బలమైన రాష్ట్రాలు, సహకార ఫెడరలిజం అనే సూత్రీకరణలను ఎంతో ముందుచూపుతో రాజ్యాంగంలో చేర్చారు. కానీ, పైన చెప్పుకున్నట్టు కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఈ సూత్రీకరణలను తమ ప్రయోజనాల కోసం ఉల్లంఘిస్తూ రావటం వల్లనే తడబడుతున్నాయి. తరచూ ఓడుతున్నాయి. అధికారాన్ని సంపాదించేందుకు ప్రాంతీయ పార్టీలపై ఆధారపడక తప్పని పరిస్థితులను తమకు తామే సృష్టించుకున్నాయి. కొన్ని దశాబ్దాల కిందటే మొదలైన ఈ స్థితి నుంచి నేటికీ పాఠాలు నేర్చుకోవటం లేదు. అందుకే, ప్రాంతీయ శక్తులు, పార్టీలు ఫెడరలిజం సూత్రాల ప్రాతిపదికగా ఈ సువిశాల వైవిధ్య దేశంలో చిరంజీవులవుతున్నాయి. వాటిని తుద ముట్టించేందుకు కాంగ్రెస్, బీజేపీలలో ఏది ఎన్ని ఎత్తుగడలు వేసినా అది ఎంతమాత్రం సాధ్యం కావటం లేదు. సంఘ్‌పరివార్, బీజేపీ నాయకత్వాలు హిందూత్వ పేరిట ఆ పనిచేయవచ్చునని సాగించిన ఆలోచన సైతం పెండ్యులం కదలికల వలె మిగిలిపోవటం తప్ప, దశాబ్దాలు గడిచినా ప్రాంతీయతలను, ఫెడరలిజాన్ని గోవాల్కర్ తన 'బంచ్ ఆఫ్ థాట్స్'లో రాసినట్టు అంతం చేయలేకపోయాయి. ఆ విషయంలో కాంగ్రెస్ వలెనే ఈ శక్తులు కూడా పైన పేర్కొన్న తమ స్వార్థాలు, బలహీనతల వల్ల విఫలమవుతూ వస్తున్నాయి. ముమ్ముందు సఫలం కాగల సూచనలూ లేవు. వాటి స్వభావంలోనే అది ఉన్నది. కనుక ప్రాంతీయతలు, ప్రాంతీయశక్తులు, పార్టీలు చిరంజీవులు.

# మానుకోటలో కాళ్లగజ్జల హిమ్మతి




'మా భూములు మాగ్గావాలే' అంటూ లగచర్లలో లంబాడీ బిడ్డల లడాయి మట్టిబిడ్డల పంతానికి అద్దం పట్టింది. భూమి కోసం జరిగిన అన్ని పోరాటాల్లో భూమిపుత్రులే గెలిచారు తప్ప, రాజ్యం ఎన్నడూ పైచేయి సాధించలేదు. ఉన్న ఊరు కన్న తల్లితో సమానమని అంటారు. ఏ కన్నతల్లి తన సొంత బిడ్డకు శాపనార్థాలు పెట్టదు. కానీ, తన సొంత నియోజకవర్గ ప్రజలే 'నీ అధికారం కాలిపోను' అని శపించే దారుణ పరిస్థితికి దిగజారిన తర్వాత ముఖ్యమంత్రిగా ఉండి ఏం లాభమో ఆలోచించుకోవాలి. రాజకీయ వ్యవస్థలో ఏ నాయకుడికైనా తన సొంత నియోజకవర్గమే మొదటి ప్రాధాన్యంగా ఉంటుంది. అందుకే అంటారు వడ్డించేవాడు మనవాడైతే ఏ మూల న కూర్చున్నా డోకా ఉండదని. కానీ, ఆ వడ్డిం చే వాడే నడ్డి విరిచే వాడయ్యాడని కొడంగల్ ప్రజలు కన్నీళ్లు పెట్టే దుస్థితి నెలకొన్నది. ఫార్మా కంపెనీలకు తమ భూములను ధారాదత్తం చెయ్యబోమని, 'మా భూములు మాకే'నని మర్లబడ్డ లగచర్ల రైతుల లడాయిని బెదిరింపులతో, అక్రమ కేసులతో, తన రాజ్యహింసతో, పోలీసుల అణచివేతతో కప్పిపుచ్చాలని రేవంత్‌రెడ్డి చూస్తున్నారు. కానీ, మండే సూర్యుడిని గొంగడిలో దాచడం, నిప్పు రవ్వలను బట్టలో మూలకట్టడం, పారే ఏరును వలలో బంధించడం సాధ్యం కాదని తెలియ దు పాపం. పోరాటాల పురిటిగడ్డలో ప్రశ్నించడానికి అనుమతి తీసుకోవాల్నా? తల్లిపాలు తాగడానికి బిడ్డకు అనుమతి కావాల్నా? గిరిజనులకు, రైతు బిడ్డలకు భూమితో విడదీయరాని అనుబంధం ఉంటుంది. అది తల్లిపాలలాంటి పేగు బంధం. తల్లి నవమాసాలు మోసి అన్నం మెతుకులు అలవాటు అయ్యేదాకా పాలిచ్చి సాకితే, నేల తల్లి, వ్యవసాయ భూమి మాత్రం కట్టె కాలే దాకా అన్నం పెడుతూ తల్లిలా సాకుతుంది. ఆ తల్లిలాంటి భూమిని లాక్కుంటామంటే లడాయి చెయ్యక లొంగిపోతారా? పాలకులకు సైతం పరిమితులుంటాయని మర్చిపోవద్దు. లగచర్ల లడాయికి సంఘీభావంగా మానుకోటలో ధర్నా పెడితే అనుమ తి లేదన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. గిరిజనుల భూములు లాక్కోవడానికి ఎవరి అనుమతి తీసుకున్నది? భూమి అంటే కేవలం రియల్ ఎస్టేట్ సరిహద్దులుగానే కనిపించే రేవంత్‌కు భూమి బంధం విలువ తెలుసా? ఈ నేలపై జరిగిన అనేక తిరుగుబాటులు భూమి కోసం, భుక్తి కోసం, తాడిత, పీడిత ప్రజల విముక్తి కోసం జరిగినవే. నాడు భారత స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్‌వారితో జరిగిన పోరు, నిజాం నవాబు రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం%ూ% ఏవైనా భూమి కోసం జరిగినవే. నాడు జల్, జంగల్, జమీన్ నినాదంతో కొమురం భీం పోరుసల్పిన నేల ఇది. దేశ్‌ముఖ్ దొరలను ఉరికిచ్చిన చాకలి ఐలమ్మ నడయాడిన నేల ఇది. జైలు గోడల మధ్య మగ్గుతూ ఆ గోడలపైనే బొగ్గుతో 'నా నిజాము తరతరాల బూజు' అని రాసి సంకెళ్ల మధ్య సైతం సమరం సాగించిన ధీశాలి దాశరథి పుట్టిన గడ్డ ఇది. 'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి. అన్యాయాన్నెదిరించినోడు నాకు ఆరాధ్యుడు' అన్న ధిక్కార స్వరం కాళోజీని కన్న నేల ఇది. పోరాటాలకు పుట్టినిల్లు అయిన ఓరుగల్లు నుంచే కాంగ్రెస్ ప్రభుత్వంపై భారత రాష్ట్ర సమితి పోరుకు సిద్ధమైంది. మా జాతి బిడ్డలకు జరిగిన అన్యాయంపై గర్జించడానికి మానుకోట గడ్డకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన బలగంతో వస్తున్నారన్న మతలబును అందుకొని నలుమూలల నుంచి వేలాదిమంది ప్రజలు మానుకోట నడిబొడ్డుకు చేరుకున్నారు. అడుగడుగునా సర్కారు పెట్టిన నిర్బంధం, కోర్టు విధించిన పరిమితికి మించి గిరిజన బిడ్డలు మానుకోట గడ్డకు తరలిరావడం విశేషం. లగచర్లలో లడాయి జరిగితే మానుకోటకు ఏం సంబంధం? అన్న ప్రభుత్వ ప్రశ్నకు ప్రజా స్పందనే సమాధానమైంది. మానుకోట రాళు నాడు తెలంగాణ ఉద్యమ సత్తా ప్రపంచానికి చాటాయి. నేడు అదే మానుకోట రాళ్లను ముద్దాడి ఆ స్ఫూర్తిని నరనరాన నింపుకొని కాంగ్రెస్ కోటను బద్దలు కొట్టడానికి ప్రతీ తెలంగాణ బిడ్డ కంకణబద్ధులు కావడం శుభపరిణామం.

# వెర్రితలలు వేస్తున్న స్వేచ్ఛ




ఒక దినపత్రికలో ఇటీవల కేసీఆర్ గురించి ప్రచురితమైన తాటికాయంత శీర్షిక ఆయనపై దుష్ప్రచారానికి పరాకాష్ఠ. తెలంగాణ సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రజల ఆరాధ్య నాయకుడిపై ఆ వార్తా పత్రిక విషం కక్కిందనడానికి ఆ శీర్షికే నిదర్శనం. ప్రజాస్వామ్యంలో మీడియాను ఫోర్త్ ఎస్టేట్‌గా పరిగణిస్తుంటాం. అలాంటిది ఒక పత్రికకు ప్రజా జీవితంలో ఏ వార్త ప్రధానమో, ఏది కాదో అర్థం కాని పరిస్థితి నెలకొనడం శోచనీయం. ఆ పత్రికకు ఎంత కసి, కక్ష ఉంటే తప్ప ఇంతటి దుస్సాహస శీర్షికతో కూడిన ఒక వార్త ప్రచురిస్తుంది? ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ, విలువలు పాటించవలసిన జర్నలిజం.. నిజనిర్ధారణ సిద్ధాంతాన్ని గాలికి వదిలేసి, విద్వేషపూరిత విష ప్రయోగం మనుషుల మస్తిష్కాల్లోకి జొప్పించజూడటం హేయనీయం. కేసీఆర్ వ్యక్తిత్వ హననానికి నిర్లజ్జగా, నిర్హేతుకంగా సదరు పత్రిక పూనుకోవడం అత్యంత దారుణం. మానసిక హీన దుర్బల ఉద్వేగంలో ఉచ్ఛరించిన పదజాలాన్ని సార్వజనీన ఆమోదమైందని, సత్యదూర భావనలను ప్రచురించడం ఏ పాటి జర్నలిజం నైతిక వర్తనమో అర్థం కావడం లేదు. దేశ కాలమాన పరిస్థితులను, సమస్యల విషవలయంలో చిక్కుకున్న ప్రజలను కాపాడుకోవడానికి సువిశాల మానవీయ దృక్పథంతో విలువలకు కట్టుబడి భావనలను వ్యక్తపరచవలసిన పత్రిక చేయవలసిన పని ఇదేనా? పొద్దస్తమానం మానవ ఉద్వేగాలతో ఆటలాడుతూ జర్నలిజాన్ని పచ్చి వ్యాపారాత్మకంగా, స్వార్థపూరిత ప్రయోజనాల కోసం బలి చేస్తూ సంయమనం, సుహృద్భావం, ప్రజా సంక్షేమం.. ప్రమాణాలుగా విరజిల్లవలసిన మాధ్యమం పచ్చి ప్రకోపాల వ్యక్తీకరణకు వాహకమై ప్రజలను రెచ్చగొట్టి సమాజ కల్లోలానికి ప్రేరేపించడం విచారించదగిన దుష్పరిణామం. ఉద్రేకాలను పురిగొల్పుతూ తాము సంధించే విషపూరిత, విద్వేషపూరిత శీర్షికల వల్ల సాధించేదేముంది? ఏ రాజకీయ పక్షాన్నో, ఏ పార్టీ నాయకుడినో సమర్థించి తను పబ్బం గడుపుకోవడానికి జర్నలిజం వ్యవస్థనే సాధనంగా మలుచుకోవడం ఒక దుష్ట సాంప్రదాయం. భారత రాజ్యాంగం ప్రసాదించిన 'స్వేచ్ఛ' వెర్రితలలు వేస్తున్న జర్నలిజం నియంత్రణ కోల్పోయి ఇలాంటి శీర్షికలు పెడుతూ ప్రజలను మభ్యపెడుతున్నది. తమ స్వార్థపూరిత పరిధిలో సమాజాన్ని నియంత్రించాలనుకోవడం పరమ దుర్మార్గం. ఏది రాస్తే ప్రజలకు చేరుతుందనేది ప్రధానం కాదు. ఏది రాసినా చెల్లుబాటు అవుతుందని.. స్వేచ్ఛ పేరుతో ఇంతగా దిగజారిన పరిస్థితిని కల్పించే ఏ మాధ్యమమైనా ఖండనీయమే. రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా అహరహం తపించి, రాష్ట్రాన్ని సాధించి, ప్రజా సంక్షేమానికి కట్టుబడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మహోన్నత వ్యక్తి కేసీఆర్. దేశంలో ఎవరికీ ఊహకందని నిర్మాణాత్మక ప్రగతి పథకాలను ప్రవేశపెట్టి, సర్వవిధాలుగా తెలంగాణను తీర్చిదిద్దిన మహా మనీషి కేసీఆర్. అలాంటి వ్యక్తిని కించపరుస్తూ అదే సెన్సేషనల్ వార్తగా ప్రచురిస్తూ పైశాచికానందాన్ని పొందడం జర్నలిజానికి ఒక మాయని మచ్చ.

తెలంగాణ సేన

గురువారం 13 - 02 - 2025

### బంగారం, వెండి కొంటున్నారా

# ఈ రేట్లు తెలుసుకుని వెళ్లండి



దేశంలో పెళ్లిళ్ల సీజన్ వేళ బంగారం, వెండి ధరలు పైపైకి చేరుతున్నాయి. దీంతో వీటిని కొనుగోలు చేయాలంటేనే సామాన్యులు ఆలోచించాల్సి వస్తుంది. అయితే నేటి ధరలు ఎలా ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం.బంగారం, వెండి కొంటున్నారా ఈ రేట్లు తెలుసుకుని వెళ్లండి.రోజు మీరు బంగారం, వెండి కొనుగోలు చేయాలని చూస్తున్నారా. అయితే ఓసారి రేట్లను తెలుసుకుని వెళ్లండి మరి. ఎందుకంటే వీటి ధరలు సామాన్యులకు షాక్ ఇస్తున్నాయి. కొనుగోలు చేయాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ క్రమంలో గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం ఉదయం 6.15 గంటలకు ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 87,540గా ఉండగా, 22 క్యారెట్ల పసిడి ధర 10 గ్రాములకు రూ. 80,620 స్థాయికి చేరుకుంది.మరోవైపు హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 87,390కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 80,110గా ఉంది. ఇక వెండి రేటు విషయానికి వస్తే హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ. 97,400గా ఉంది. ఈ నేపథ్యంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి ధరల వివరాలను ఇక్కడ చుద్దాం.

## దేశంలో ప్రధాన నగరాల్లో బంగారం ధరలు (10 గ్రాములకు) (24 క్యారెట్స్, 22 క్యారెట్స్)

చెన్నైలో రూ. 87,390, రూ. 80,110
వడోదరలో రూ. 87,440, రూ. 80,160
ఢిల్లీలో రూ. 87,540, రూ. 80,620
ముంబైలో రూ. 87,390, రూ. 80,110
విజయవాడలో రూ. 87,390, రూ. 80,110
హైదరాబాద్‌లో రూ. 87,390, రూ. 80,110
కేరళలో రూ. 87,390, రూ. 80,110
బెంగళూరులో రూ. 87,390, రూ. 80,110
కోల్‌కతాలో రూ. 87,390, రూ. 80,110
పూణేలో రూ. 87,390, రూ. 80,110

**బంగారం స్వచ్ఛత తెలుసుకోవడం ఎలా?**

బంగారం స్వచ్ఛతను గుర్తించడానికి (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) ద్వారా హాల్ మార్కులు ఇస్తారు. 24 క్యారెట్ల బంగారు ఆభరణాలపై 999, 23 క్యారెట్‌లపై 958, 22 క్యారెట్‌పై 916, 21 క్యారెట్‌పై 875, 18 క్యారెట్‌పై 750 అని రాసి ఉంటుంది. ఎక్కువగా బంగారాన్ని 22 క్యారెట్లలో విక్రయిస్తుండగా, కొందరు 18 క్యారెట్లను కూడా ఉపయోగిస్తున్నారు. 24 క్యారెట్ల బంగారం 99.9% స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారం దాదాపు 91 శాతం స్వచ్ఛమైనది. 22 క్యారెట్ల బంగారంలో 9% రాగి, వెండి, జింక్ వంటి ఇతర లోహాలను కలపడం ద్వారా ఆభరణాలను తయారు చేస్తారు.


## ఉపాధి కల్పనలో హైదరాబాద్ యునికార్న్‌లు టాప్




ఉపాధి కల్పనలో హైదరాబాద్ యునికార్న్‌లు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా పని చేస్తున్న యునికార్న్‌లు జనవరి నెలలో ఉద్యోగ నియామకాల్లో 25్న వృద్ధిని సాధించాయి. ఉపాధి కల్పనలో ఉపాధి కల్పనలో హైదరాబాద్ యునికార్న్‌లు టాప్ .ఉపాధి కల్పనలో హైదరాబాద్ యునికార్న్‌లు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నాయి. దేశవ్యాప్తంగా పని చేస్తున్న యునికార్న్‌లు జనవరి నెలలో ఉద్యోగ నియామకాల్లో 25్న వృద్ధిని సాధించాయి. ఉపాధి కల్పనలో 74% వృద్ధితో హైదరాబాద్ యునికార్న్‌లు అగ్రస్థానంలో ఉండగా 60్న వృద్ధితో చెన్నై రెండో స్థానంలో ఉంది. జనవరి నెలలో నియామకాల ధోరణిపై నౌకరి జాబ్‌స్పీక్ ఇండెక్స్ ఈ విషయాలు ధ్రువీకరించింది. అయితే ఐటీ రంగం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నట్టయితే నియామకాల్లో -1్న తగ్గుదలతో ఫ్లాట్‌గా ఉంది. రంగాలవారీగా చూసినట్టయితే ఎఫ్ఎంసీజీ 16్న, బీమా 15్న, ఫార్మా 11్న వృద్ధిని నమోదు చేశాయి. ఫ్రెషర్ల నియామకం 3్న పెరిగి నిలకడగా ఉంది. రిటైల్ రంగం దీర్ఘకాలిక ప్రతికూల ధోరణి నుంచి బయటపడి నియామకాల్లో 1్న వృద్ధిని నమోదు చేసింది. బెంగళూరు, ఢిల్లీ ఎన్‌సీఆర్ వంటి కీలక మార్కెట్లు ఇందుకు దోహదపడ్డాయి. ప్రధానంగా మిడ్ లెవెల్ ఉద్యోగ నియామకాలు జోరుగా సాగాయని ఆ నివేదిక తెలిపింది.మూడింట రెండొంతుల పన్ను రిటర్నుల్లో చెల్లింపులు నిల్లు


## మూడింట రెండొంతుల పన్ను రిటర్నుల్లో చెల్లింపులు నిల్లు

**ఆదాయం పన్ను (ఐటీ) రిటర్న్‌లు సమర్పించే వారిలో మూడింట రెండొంతుల మంది చెల్లించిన పన్ను సున్నా అని కేంద్రం వెల్లడించింది. వీరి సంఖ్య 2019-20 ఆర్థికతో పోలిస్తే**




ఆదాయం పన్ను (ఐటీ) రిటర్న్‌లు సమర్పించే వారిలో మూడింట రెండొంతుల మంది చెల్లించిన పన్ను సున్నా అని కేంద్రం వెల్లడించింది. వీరి సంఖ్య 2019-20 ఆర్థికతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి దాదాపు రెట్టింపైంది. లోక్‌సభలో పన్ను చెల్లింపుదారులపై అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లిఖిత పూర్వకంగా ఈ విషయాన్ని వెల్లడించారు. మంత్రి సమర్పించిన డేటా ప్రకారం.. 2019-20లో 6.48 కోట్ల మంది ఐటీ రిటర్న్‌లు సమర్పించగా.. అందులో సున్నా పన్ను బకాయితో దాఖలైన రిటర్నులు 2.9 కోట్లు. అంటే మొత్తం రిటర్న్‌ల్లో 44.75 శాతానికి సమానం. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 31 నాటికి 8.39 కోట్ల మంది రిటర్న్‌లు ఫైల్ చేశారు. అందులో 5.58 కోట్ల(66.5 శాతం) మంది సున్నా పన్ను బకాయితో రిటర్న్‌లు సమర్పించినట్లు మంత్రి తెలిపారు.

# మార్కెట్లోకి నిషేధిత చైనా యాప్స్.. ఎంతకు తెగించార్రా




చైనా వాళ్ల ఫోకస్ ఎక్కువగా ఇండియాపైనే ఉంటుందని చెప్పవచ్చు. భారతీయులు వినియోగించే అనేక రకాల యాప్స్ సహా ఉత్పత్తులపై వ్యాపారాలు చేస్తూ దోచేస్తుంటారు. ఈ క్రమంలో భారత్ బ్యాన్ చేసిన పలు చైనా యాప్స్ మళ్లీ మార్కెట్లోకి వచ్చాయి. ఆ విశేషాలేంటో ఇక్కడ చూద్దాం.చైనా టార్గెట్ ప్రధానంగా భారత్‌పైనే ఉంటుంది. చైనా మాంజా నుంచి మొదలుకుని బొమ్మలు, పలు రకాల యాప్స్ పేరుతో ఇండియాలోకి ప్రవేశించి దోచేకునేందుకు ప్లాన్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే ఇప్పటికే నిషేధించిన చైనా యాప్స్ మళ్లీ భారత మార్కెట్లోకి వచ్చాయి. అయితే 2020లో భారతదేశం భద్రతా ఆందోళనల కారణంగా దాదాపు 267 చైనీస్ యాప్‌లను నిషేధించింది. గల్వాన్ లోయలో చైనా భారత సరిహద్దు ఘర్షణ తర్వాత, దేశంలోని భద్రతా పరిస్థితులు బలహీనమైనాయని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. తర్వాత అనేక రోజులు ఈ యాప్స్ కనిపించకుండా పోయాయి.

**రూపాన్ని మార్చుకుని..**

అయితే తాజాగా వేగంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఈ యాప్‌లు వాటి అసలు రూపాన్ని మార్చుకుని, వేర్వేరు పేర్లతో తిరిగి మార్కెట్‌లో ప్రవేశించాయి. ప్రస్తుతం గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్‌లలో గతంలో నిషేధంలో ఉన్న దాదాపు 36 యాప్‌లు ప్రస్తుతం డౌన్‌లోడ్ చేసుకోవడానికి అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్‌లు కొన్ని అంగీకరించిన మార్పులతో తిరిగి రావడంతోపాటు వాటి అసలు గుర్తింపు, లోగో, బ్రాండింగ్, యాజమాన్యాన్ని మార్చుకున్నాయి. గేమింగ్, షాపింగ్, వినోదం, ఫైల్ షేరింగ్, కంటెంట్ సృష్టి వంటి విభాగాల్లో ఈ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి.

**భారతదేశంలోకి తిరిగి వచ్చిన ముఖ్యమైన యాప్‌లు**

ఫైల్ షేరింగ్ సర్వీస్ యాప్. ఇది యాప్ స్టోర్‌లో అందుబాటులో ఉంది. కానీ ఇప్పటికీ గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో లేదు.ఈ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంలో టీవీ కంటెంట్ ఉండగా, ఇప్పుడు గుర్తింపు మార్చుకోకుండా పనిచేస్తుంది.ప్రముఖ షాపింగ్ యాప్ ఇప్పుడు కనిపిస్తోంది. ఇది ముందుగా ఉన్న విధంగా పనిచేస్తుంది.ప్రముఖ డేటింగ్ యాప్, ఇప్పుడు రీబ్రాండ్ చేసుకుంది

**షీన్ రీ బ్రాండింగ్**

షీన్ ప్రఖ్యాత ఫ్యాషన్ రిటైలర్. ఇది తిరిగి భారత్‌లోకి వచ్చి, రిలయన్స్‌తో లైసెన్సింగ్ ఒప్పందం చేసుకోవడంతో తన స్థానాన్ని దృవీకరించుకుంది. భారత ప్రభుత్వ అంగీకారంతో షీన్ అన్ని వినియోగదారుల డేటా ఇప్పుడు భారత్‌లోనే నిల్వ చేయబడుతుంది. చైనీస్ సంస్థకు ఎటువంటి యాక్సెస్ ఉండదు.

**ఇతర యాప్‌లు, క్లోన్‌లు**

నిషేధించబడిన యాప్‌ల క్లోన్ వెర్షన్‌లు కూడా కొన్ని సందర్భాల్లో తిరిగి వచ్చినట్లు గుర్తించబడింది. ఈ తరహా మార్పులతో కొన్ని యాప్‌లు చిన్న సవరణలతో తిరిగి మార్కెట్‌లో ప్రవేశించాయి. ఉదాహరణకు 2020లో నిషేధించబడింది. కానీ 2021లో దక్షిణ కొరియా క్రాఫ్టన్ క్రింద తిరిగి వచ్చింది. ఈ వెర్షన్ కూడా 2022లో మరో నిషేధాన్ని ఎదుర్కొంది. కానీ భద్రతా ప్రమాణాల ప్రకారం 2023లో పునరుద్ధరించబడింది.

**అమలు చేయడం కష్టమా..**

ప్రభుత్వం ఈ యాప్‌లను నిషేధించడానికి చర్యలు తీసుకున్నప్పటికీ, వాటి అసలు రూపాన్ని మారుస్తూ, విడివిడిగా పలు రకాల పేర్లతో ప్రత్యామ్నాయ వెర్షన్‌లు, క్లోన్‌ల ద్వారా మళ్లీ మార్కెట్లోకి వస్తున్నాయి. దీంతో ఈ యాప్‌లను నిషేధించడం కష్టమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతేకాదు ప్రభుత్వం పలు చైనా యాప్స్‌కి పర్మిషన్ ఇచ్చిందా అని కూడా ప్రశ్నిస్తున్నారు.

# ఎల్ అండ్ టీ చైర్మన్ వివాదాస్పద వ్యాఖ్యలు



"ఇంట్లో కూర్చుని ఎంతసేపని భార్యని చూస్తూ ఉంటారు?.. ఇంట్లో కంటే ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని మీ భార్యకు చెప్పండి. వారానికి 90 గంటలు పనిచేయండి.నేను ఆదివారాలు కూడా పనిచేస్తున్నా.. ఆరోజు మీతో పని చేయించలేక పోతున్నందుకు బాధపడుతున్నా. అలా చేయించగలిగితే నాకు చాలా హ్యాపీ" అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన లార్సెన్ టూబ్రో చైర్మన్ ఎస్ఎన్ సుబ్రహ్మణ్యన్ మరోమారు కీలక వ్యాఖ్యలు చేశారు.మంగళవారం చెన్నైలో జరిగిన మిస్టిక్ సౌత్ గ్లోబల్ లింకేజెస్ సమ్మిట్ 2025లో సుబ్రహ్మణ్యన్ మాట్లాడుతూ.. సౌకర్యాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల నిర్మాణ పరిశ్రమకు కార్మికుల కొరత ఏర్పడుతోంది. భారతదేశంలో కార్మికులు పనిచేయడానికి ఇష్టపడటం లేదు. ప్రభుత్వం అందించే కొన్ని పథకాల కారణంగా.. కార్మికుల ఆర్థిక వ్యవస్థ బాగానే ఉందని, బహుశా ఈ కారణంగానే వారు పనిచేయడానికి ఇష్టపడటం లేదని అన్నారు.కార్మికుల కొరత భారతదేశ మౌలిక సదుపాయాల నిర్మాణంపై ప్రభావం చూపుతోంది. ఎల్ అండ్ టీ సంస్థకు 4 లక్షల మంది కార్మికులు అవసరం. కానీ అవసరమైన మేర కార్మికులు లభించడం లేదు. అంతే కాకుండా ద్రవ్యోల్బణం కారణంగా.. కార్మికుల వేతనాలను కూడా సవరించాల్సిన అవసరం ఉందని సుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు.కార్మికులలో మాత్రమే కాకుండా.. ఉద్యోగులలో కూడా అదే ధోరణి ఉందని సుబ్రమణ్యన్ అన్నారు. నేను ఎల్ అండ్ టీ కంపెనీలో ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరినప్పుడు.. మా బాస్ ఢిల్లీలో పనిచేయాల్సి ఉంటుందని చెప్పారు. దానికి నేను ఒకే చెప్పాను. కానీ ఇప్పుడు ఎవరికైనా ఢిల్లీలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని చెబితే ఉద్యోగాన్నే వదిలేసి వెళ్ళిపోతారు అని అన్నారు.

90 గంటల పనిపై చర్చ

వారానికి 90 గంటలు, ఆదివారాలు కూడా పనిచేయాలని చెప్పిన సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యలు గతంలో చర్చకు దారితీశాయి. దీనిపై ఆదార్ పూనవాలా, ఆనంద్ మహీంద్రా, ఐటీసీ సంజీవ్ పూరి వంటి దిగ్గజ పారిశ్రామిక వేత్తలు స్పందిస్తూ.. వర్క్ లైఫ్ బ్యాలెన్స్ గురించి వివరించారు.గరిష్ట పని గంటలను వారానికి 70 లేదా 90 గంటలకు పెంచే ప్రతిపాదనను పార్లమెంటుకు కూడా చేరింది. బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వేలో వారానికి 60 గంటలకు పైగా పని చేయడం వల్ల.. ఆరోగ్యం దెబ్బ తింటుందని, ప్రతికూల ప్రభావాలు ఎదురవుతాయని వెల్లడించారు. రోజుకు 12 గంటలు లేదా అంతకంటే ఎక్కువ సేపు పనిచేస్తే.. శారీరక, మానసిక సమస్యలు ఎదురవుతాయని ఒక సర్వేలో కూడా తెలిసింది.

# పాత - కొత్త పన్ను విధానం: ఎప్పుడు ఏది ఎంచుకోవాలంటే




యూనియన్ బడ్జెట్ 2025లో కేంద్రమంత్రి 'నిర్మలా సీతారామన్' మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కల్పించే విధంగా కొత్త ఆదాయపు పన్ను విధానంలో కొన్ని ప్రధాన మార్పులను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగానే ప్రాథమిక మినహాయింపు పరిమితిని రూ.4 లక్షలకు పెంచాలని ప్రతిపాదించారు. సెక్షన్ 87కింద రాయితీ కోసం ఆదాయ పరిమితిని రూ.12 లక్షలకు పెంచారు.నూతన విధానంలో కొత్త శ్లాబుల ప్రకారం మొదటి రూ.4 లక్షల్లోపు ఆదాయం ఉంటే పన్ను పరిధిలోకి రారు. స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపి చూసుకుంటే రూ.12.75 లక్షల ఆదాయం దాటని వేతన జీవులు, పెన్షనర్లు పన్ను చెల్లించక్కర్లేదు. రూ.4-12లక్షల ఆదాయంపై సెక్షన్ 87ఏ కింద రిబేట్ అమల్లో ఉంది. దీనికి రూ.75వేల స్టాండర్డ్ డిడక్షన్ అదనం. అంటే మొత్తంగా రూ.12,75,000 లక్షల ఆదాయం వరకు పన్ను చెల్లించక్కర్లేదు. వార్షిక ఆదాయం రూ. 12.75 లక్షల కంటే ఎక్కువ ఉంటే.. పాత పన్ను విధానం ఎందుకోవాలా? కొత్త పన్ను విధానం ఎంచుకోవాలా అని కొంత తికమకపడే అవకాశం ఉంటుంది. ఇక్కడ ఎప్పుడు ఏ పన్ను విధానం ఎందుకోవాలో పరిశీలిద్దాం.

**కొత్త పన్ను విధానం ఎప్పుడు ఎందుకోవాలంటే..**

ప్రావిడెంట్ ఫండ్, పీపీఎఫ్, జీవిత బీమా, లేదా హౌసింగ్ లోన్ (ప్రిన్సిపల్ తిరిగి చెల్లింపు వంటివి) లేదా సెక్షన్ 80డీ (మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం) కింద మినహాయింపులు ఉండవు.మీరు భారీ తగ్గింపులను క్లెయిమ్ చేయకపోతే.. కొత్త పన్ను విధానం ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే ఇది వివరణాత్మక డాక్యుమెంటేషన్ అవసరం లేకుండా తక్కువ పన్ను రేట్లను అందిస్తుంది.

**మీరు పాత పన్ను విధానం ఎప్పుడు ఎంపిక చేసుకోవాలంటే..**

అధిక తగ్గింపులను క్లెయిమ్ చేయగల వ్యక్తులకు పాత పన్ను విధానం మరింత అనుకూలంగా ఉంటుంది. ఇందులో.. సెక్షన్ 80సీ కింద పీఎఫ్, పీపీఎఫ్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలు, హోమ్ లోన్ చెల్లింపు మొదలైనవి మాత్రమే కాకుండా.. సెక్షన్ 80డీ కింద వ్యక్తిగత కుటుంబ సభ్యులకు మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంలు, హోమ్ రెంట్ అలవెన్స్ , లీవ్ ట్రావెల్ అలవెన్స్ వంటివి కూడా ఉన్నాయి. పన్ను చెల్లింపుదారులు ఈ తగ్గింపులను గరిష్టంగా పెంచుకుంటే, వారి పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చు.

**కొత్త పన్ను విధానంలో శ్లాబులు**

రూ.0-4 లక్షలు - సున్నా
రూ.4-8 లక్షలు - 5 శాతం
రూ.8-12 లక్షలు - 10 శాతం
రూ.12-16 లక్షలు - 15 శాతం
రూ.16-20 లక్షలు - 20 శాతం
రూ.20-24 లక్షలు - 25 శాతం
రూ.24 లక్షల పైన 30 శాతం

**పాత పన్ను విధానంలో పన్ను శ్లాబులు**

రూ.2,50,001 - రూ.5,00,000 - 5 శాతం
రూ.5,00,000 నుంచి రూ. 10,00,000 - 20 శాతం
రూ.10,00,000 ఆపైన - 30 శాతం

# ఎప్పుడు, ఎలా చనిపోతారో చెప్పే డెత్ క్లాక్: దీని గురించి తెలుసా?



మనషి పుట్టుక, చావు అనేది దైవాధీనాలు. అంటే మనిషి ఎప్పుడు పుడతాడు, ఎప్పుడు చనిపోతాడు అనేది దేవుని చేతుల్లోనే ఉంటాయంటారు. అయితే 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెత్ క్లాక్' మనిషి ఎప్పుడు చనిపోతాడో చెప్పేస్తానంటోంది. ఇంతకీ ఇదెలా సాధ్యం?.. ఏఐ చెప్పింది నిజమవుతుందా? అనే విషయాలు పరిశీలిద్దాం.డెత్ క్లాక్ అనే ఫ్రీ వెబ్‌సైట్.. ఒక వ్యక్తి వయసు, అతని బాడీ ఇండెక్స్, ఆహారపు అలవాట్లు, రోజువారీ వ్యాయామం, ధూమపానం, మద్యపానం అలవాట్లు, అతడు ఎలాంటి ప్రాంతంలో నివసిస్తున్నాడు అనే వాటిని ఆధారంగా చేసుకుని ఎప్పుడు, ఎలా చనిపోతాడో చెబుతోంది. అంటే మనం ఇచ్చే సమాచారం ఆధారంగా.. చావు రోజును చల్లగా చెప్పేస్తుందన్నమాట.డెత్ క్లాక్ వెబ్‌సైట్ ఇప్పటి వరకు 63 లక్షల మందికి.. వారి చావు డేట్ చెప్పింది. ఏఐ డెత్ క్లాక్ డేట్ ప్రకారం.. ఎంతమంది చనిపోయారో, లేదో తెలియదు, కానీ దీనికి సంబంధించిన వార్తలు మాత్రం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

**ఎక్కువ కాలం జీవించడానికి టిప్స్**

ఎప్పుడు, ఎలా చనిపోతారో చెప్పడం మాత్రమే కాదు. ఎక్కువ రోజులు జీవించడానికి టిప్స్ కూడా డెత్ క్లాక్ చెబుతోంది.


ఆరోగ్యకరమైన బరువును మెయింటెన్స్
క్రమం తప్పకుండా వ్యాయామం
పొగ తాగడం మానేయండి
సమతుల్య ఆహారం
మద్యం పూర్తిగా మానేయండి లేదా తక్కువగా తాగండి
మంచి నిద్ర
క్రమం తప్పకుండా హెల్త్ చెకప్స్
ఒత్తిడిని తగ్గించుకోండి

**అనుబంధాలను పెంపొందించుకోండి**

ఎన్ని టెక్నాలజీలు వచ్చినా.. మనిషి ఎప్పుడు, ఎలా చనిపోతాడు అనే విషయం చెప్పడం అసాధ్యం. డెత్ క్లాక్ అనేది ఒక ఏఐ కాలిక్యులేటర్, దీనికి మీరిచ్చే సమాచారాన్ని బట్టి ఒక డేట్ చెబుతుంది. అదే ఖచ్చితమైన మరణ తేదీ కాదు. దీనిని సరదా కోసం మాత్రమే ఉపయోగించాలి. ఏఐ కాలిక్యులేటర్ అంచనా నిజమని.. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు.

# భారీగా పడిపోయిన పామాయిల్ దిగుమతులు

## భారీగా పడిపోయిన పామాయిల్ దిగుమతులు



భారత్ పామాయిల్ దిగుమతులు 2025 జనవరిలో 14 ఏళ్ల కనిష్టానికి పడిపోయాయి. అదే సమయంలో సోయా దిగుమతులు భారీగా పెరిగాయి. సోయా దిగుమతులు మునుపటి సంవత్సరంతో పోలిస్తే రెట్టింపు కంటే ఎక్కువ నమోదయ్యాయి. పామాయిల్ శుద్ధి చేసేందుకు అయ్యే ఖర్చు.. దానివల్ల సమకూరే మార్జిన్లు సోయా దిగుమతులకు కారణమైనట్లు నిపుణులు చెబుతున్నారు. పామాయిల్ దిగుమతులు పడిపోవడానికిగల కొన్ని కారణాలను విశ్లేషిస్తున్నారు.దిగుమతి చేసుకున్న పామాయిల్ రిఫైనింగ్ మార్జిన్లు తక్కువగా ఉంటున్నాయి. చాలా కంపెనీల రెవెన్యూపై దీని ప్రభావం పడుతుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో కొన్ని ప్రాంతాలు పామాయిల్ ధరలను టన్నుకు 80-100 డాలర్లు తగ్గించాయి. అయినప్పటికీ దిగుమతులు మందగించాయి. ఇండోనేషియా, మలేషియా వంటి ప్రధాన పామాయిల్ ఉత్పత్తి దేశాలు ఎగుమతి సరఫరాలను కఠినతరం చేశాయి. ఇది సోయా నూనె వైపు మళ్లడానికి మరింత ప్రోత్సహించింది. ప్రపంచంలోనే అత్యధికంగా కూరగాయల నూనెలను కొనుగోలు చేస్తున్న భారత్ పామాయిల్ దిగుమతులు తగ్గడం ప్రపంచ మార్కెట్లపై గణనీయమైన ప్రభావం చూపుతుందని నిపుణులు భావిస్తున్నారు. భారత్ నుంచి డిమాండ్ తగ్గడంతో మలేషియా పామాయిల్ ధరలు తగ్గే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.ఫిబ్రవరిలో పామాయిల్ దిగుమతులు స్వల్పంగా పెరిగే అవకాశం ఉన్నప్పటికీ అవి సాధారణం కంటే తక్కువగానే ఉంటాయని భావిస్తున్నారు. సోయా దిగుమతులు కొద్దిగా తగ్గవచ్చని, సన్‌ఫ్లవర్ నూనె దిగుమతులు స్వల్పంగా పెరగవచ్చని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అంచనా వేసింది.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332